ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కడప

fb.com/vaartha Digital

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

11-5-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 99 పేజీలు: 10+4 వెల: 8.00

భారత్‌దాడుల్లో మృతి చెందిన ఉగ్రవాదులు వీరే..

పాక్ కాల్పుల్లో మరో జవాన్ వీరమరణం

5లో



శనివారం రాజ్‌భవన్‌లో జరిగిన ఇంటర్ ఫెయిత్ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో గవర్నర్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

# అందరి నినాదం 'నేషన్ ఫస్ట్' కావాలి

### భారత్,పాక్ మధ్య కాల్పుల విరమణ శుభపరిణామం: గవర్నర్ నజీర్

### ప్రధాని ఏ నిర్ణయం తీసుకొన్నా మద్దతిస్తాం: సిఎం చంద్రబాబు

#### రాజ్‌భవన్‌లో జరిగిన 'ఇంటర్ ఫెయిత్' కార్యక్రమంలో పాల్గొన్న సిఎం, డిసిఎం

**అమరావతి, మే 10 ,ప్రభాతవార్తప్రతినిధి:** జాతీయ వాదమే భారతీయుల సంఘటితకు నిదర్శనం అని ఏపీ గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ అన్నారు.మన జాతి పరిరక్షణనే మన కింకర్తవ్యం అనే దృడ సంకల్పంతో ప్రతి భారతీయుడిలో ఉండటమే శత్రు దేశాలకు భయాన్ని కలిగిస్తోందన్నారు.భారత్ పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో రాజ్ భవన్‌లో శనివారం గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్ ఫెయిత్ కార్యక్రమం జరిగింది.అంతర్గత సమస్యలను రెచ్చగొట్టి లబ్దిపొందాలనే వారికి భారత దేశ ప్రజలంతా సంఘటితంగా ఉండటం కనువిప్పు అన్నారు.పాక్,భారత్ నడుమ యుద్ధ వాతావరణ నెలకున్నప్పుడు జాతి యావత్తు ప్రధానికి అండగా నిలవడం మన సంస్కృతికి చిహ్నం అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ మనం ఏ పరిస్థితుల్లో ఉన్నా నేషన్ ఫస్ట్ నినాదంతో దేశాన్ని కాపాడుకోవాల్సి ఉందన్నారు. ఏ సమస్య వచ్చినా భారతదేశంలో ఉండే ప్రతి ఒక్కరూ సంఘటితంగా ఉండాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ప్రపంచశాంతిని ఉగ్రవాదం పట్టి పీడిస్తోందని, తీవ్రవాదం, ఉగ్రవాదం దేశంలో అనిశ్చిత పరిస్థితులకు, ఆర్థిక ఇబ్బందులకు కారణం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పహల్గాంలో మారణకాండ సృష్టించారుపహల్గాంలో ఉగ్రవాదులు మారణకాండ సృష్టించారు. ఉగ్రవాదుల కాల్పుల్లో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఇది పర్యాటకులపై జరిగిన దాడి కాదు దేశ శాంతి సుస్థిరతను దెబ్బతీసే అంశం. మనందరం కులమతాలకు అతీతంగా ముక్తకంఠంతో ఉగ్రదాడిని ఖండించాం. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యుల బాధను ఎవరూ తీర్చలేరు. ఉగ్రవాదుల కాల్పుల్లో మన రాష్ట్రానికి చెందిన ఇద్దరు పర్యాటకులు చనిపోయారు. మనదేశం ఉగ్రవాదంపై పోరాడు >>2



### ఒప్పందాన్ని ఉల్లంఘించిన పాక్

#### సరిహద్దు పొడవునా కాల్పులు జరిపింది

#### విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ

**న్యూఢిల్లీ, మే 10:** అగ్రరాజ్యం అమెరికా జోక్యంతో కాల్పుల విరమణకు అంగీకరించినా పాకిస్థాన్ మాత్రం సరిహద్దు పొడవునా కాల్పుల విరమణను ఉల్లంఘించిందని విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ప్రకటించారు. రాత్రిపొద్దుపోయాకా మీడియాతో మాట్లాడిన మిస్రీ సరిహద్దుపొడవునా నాలుగురాష్ట్రాల్లోను >>2

# ఇటు విరమణ.. అటు కాల్పులు

### భారత్, పాక్ కాల్పుల విరమణ ప్రకటించిన కొద్దిసేపటికే మళ్లీ కాల్పులు జరిపిన దాయాది

### తన మధ్యవర్తిత్వంతో సయోధ్య సాధ్యమైందన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్

### 12న మళ్లీ చర్చలు జరిగే అవకాశం

**న్యూఢిల్లీ, మే 10:** అగ్రరాజ్యం జోక్యంతో పాకిస్తాన్ దారికి వచ్చింది. సరిహద్దు గ్రామాలు, సైనిక స్థావరాలు టార్గెట్‌గా దాడులు చేయబోయి బొక్కబోర్లాపడిన పొరుగుదేశం పాకిస్థాన్ ఎట్టకేలకు దిగివచ్చింది. గల్ఫ్‌దేశాలు, మిత్రదేశాలతో సంప్రదింపులు జరిపినా కూడా భారత్ ఎక్కడా తగ్గకపోవడం, పహల్గాం మూల్యం చెల్లించుకోవాల్సిందేనని స్పష్టంచేయడంతోపాటు ఆస్థాయిలోనే పాక్ దాడులకు ప్రతి దాడులుచేసింది. పహల్గాం ఘాతుకం తర్వాత వరుసవెంబడి పక్షంరోజులపాటు సరిహద్దుల్లో కాల్పులు జరుపుతూనే రావడంతో సహనం నశించిన భారత్ ఒక్కసారిగా ఆపరేషన్ సిందూర్‌తో భారత్ శక్తిసామర్థ్యాలను చాటిచెప్పింది.దీనితో తోకముడిచిన పాకిస్తాన్ గత్యంతరంలేక కాల్పుల విరమణకు అంగీకరించింది. కాల్పుల విరమణకు అంగీకారం జరిగిందని చెపుతూనే సరిహద్దుల్లో మళ్లీడ్రోన్లతో దాడులకు దిగడం పాక్ వక్రబుద్ధిని స్పష్టంచేస్తోంది. పాక్ కుట్రలను గమనించే భారత్ అప్రమత్తంగా ఉంది. కేవలం ఉగ్రస్థావరాలే లక్ష్యంగా తొమ్మిది కేంద్రాల్లో భారత్ జరిపిన దాడులతో 100మందికిపైగా మృతిచెందడం, పాక్ ఆయుధాగారం, వైమానికస్థావరాలే టార్గెట్‌గా భారత్‌కూడా శక్తివంతమైన దాడులకు దిగడంతో దాయాదికి నిలువెల్లా వణుకు బయలుదేరి అగ్రరాజ్యం అమెరికాను ఆశ్రయించింది. రెం డుదేశాల వివాదంలో జోక్యం చేసుకోబోమని చెప్పిన అమెరికా చివరి >>2



### సయోధ్య కుదిర్చిన 'పెద్దన్న'

#### రెండు దేశాలకు అభినందనలు తెలిపిన ట్రంప్

**న్యూఢిల్లీ:** ఆపరేషన్ సింధూర్‌పై పాక్ ఉగ్రస్థావరాలను భారత్ నేలమట్టం చేపట్టినప్పటి నుంచి నాలుగు రోజులుగా భారత్ పాక్ మధ్య తారాస్థాయికి చేరిన ఉద్రిక్తతలకు శనివారం సాయంత్రం 5 గంటలకు తెరపడింది. మధ్యాహ్నం 3.35 గంటలకు పాక్ డీజీఎంవో నుంచి భారత్ జీజీఎంఓకు ఫోన్ రావడం, కాల్పుల విరమణపై ఇరుదేశాల డీజీఎంఓల మధ్య జరగడం, చర్చల అనంతరం అనంతరం కాల్పుల విరమణకు ఇరుదేశాలు అంగీకరించడం చకచగా జరిగాయి. సాయంత్రం 5 గంటల నుంచి కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. ఈ మేరకు ఇరుదేశాల విదేశాంగ శాఖ ప్రతినిధులు వేర్వేరు ప్రక టనల్లో కాల్పుల విరమణను >>2

### రాజధానిలో బిట్స్‌కు

# 70 ఎకరాలు

#### భూకేటాయింపులపై ప్రభుత్వ ఉత్తర్వులు

**విజయవాడ,మే 10,ప్రభాతవార్త ప్రతినిది:** రాజధాని అమరావతిలో బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) క్యాంపస్ ఏర్పాటుకు ఎకరం రూ.50 లక్షల చొప్పున 70 ఎకరాలు కేటా యిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. >>2

### అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో

# జనఔషధి షాపులు

#### ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా నిర్వహణ: మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,మే10,ప్రభాతవార్తప్రతినిధి:** పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఆసుపత్రులకొచ్చే రోగుల ప్రయోజనార్థం నాణ్యమైన జనరిక్ మందులను అతి తక్కువ ధరలకే అందించడానికి అన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో జన ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో జనరిక్ మందుల ఏర్పాటుపై అధికారులతో మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన అధికారిక నివేదికలను అనుసరించి మాట్లాడుతూ ప్రస్తుతం జనరిక్ మెడికల్ షాపుల నిర్వాహకులు కొన్ని సందర్భాల్లో 50నుండి 600 శాతం మేరకు లాభాలతో ఈ మందుల్ని విక్రయిస్తున్నారు. ప్రస్తుతం 16 జిజిహెచ్ లలో 23 ప్రైవేట్ జనరిక్ మెడిసిన్ స్టోర్లు ఉన్నాయి. నంద్యాల జిజిహెచ్ లో మాత్రం ఇలాంటి స్టోర్ లేదు. ప్రభుత్వాసుపత్రుల్లో జనరిక్ మందుల షాపుల్ని నిర్వహించడానికి లాభాపేక్షలేని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతిపాదనకు మంత్రి ఆమోదం తెలిపారుప్రస్తుత వ్యవస్థలో లోపాలుజనరిక్ మందుల తయారీ మరియు వాటి ధరలను నిర్ణయించడంలోని లోపాల్ని ఉపయోగించుకుని ప్రస్తుతం అమ్మకందారులు భారీ లాభాలతో రోగులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం 16 జిజిహెచ్ లలో పనిచేస్తున్న జనరిక్ మెడిసిన్ రిటైలర్లు జనరిక్ ఔషధాల తయారీ, ధరల నిర్ణాయక విధానంలోని లొసుగులను ఉపయోగించుకుంటూ రోగులను దోపిడీ చేస్తున్నారు. దీనికి తోడు ఈ వ్యవస్థపై తగిన నియంత్రణ లేకపోవటం వారికి అనుకూలంగా మారింది. జనరిక్ ఔషధాల తయారీదారులు తమ ఉత్పత్తులపై అధిక ఎంఆర్ పి (గరిష్ట రిటైల్ ధర)ని ముద్రించి సరఫరా చేయడాన్ని అమ్మకందారులు స్వంత ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. దీంతో రిటైలర్లు వివిధ మందులపై వివిధ ప్రదేశాలలో తమ ఇష్టానుసారం డిస్కౌంట్లను అందిస్తున్నారు. ఈ ప్రక్రియలో వారు 50 నుండి 600 వరకు భారీ లాభాలను ఆర్జిస్తున్నారు. అంతేకాక వారు అవసరమైన జనరిక్ ఔషధాలలో కేవలం 30 నుండి 40 వర కు మాత్రమే అందుబాటులో ఉంచుతున్నారు. అధిక లాభార్జనను నిరోధించడంతో పాటు ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల అమ్మకాలను నిరోధించే తప్పనిసరి బిల్లింగ్ వ్యవస్థ అమలులో లేదు. >>2



# ధర్మ యుద్ధంలో గెలిచాం

### దేశ సైన్యానికి సెల్యూట్ చేయడం మన బాధ్యత: డి.సిఎం పవన్

**విజయవాడ,మే10,ప్రభాతవార్తప్రతినిధి:** ధర్మ యుద్ధంలో మనం గెలిచామని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. భారత్,పాక్ కాల్పుల విరమణ అనంతరం ఆయన శనివారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేసారు. ఉగ్రవాదానికి పుట్టిల్లుగా ఉన్న పాకిస్థాన్ కి బలమైన ఎప్పటికీ మరచిపోలేని పాఠం నేర్పింది ఆపరేషన్ సిందూర్. భారత దేశ శక్తిసామర్థ్యాలను చాటి చెప్పగలిగాము. అసమాన పోరాటం చేసిన మన సైన్యానికి సెల్యూట్ చేసి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు చెప్పడం మనందరి బాధ్యత. దేశానికి బలమైన నాయకత్వం ఉంటే ప్రజలకు ఎంతటి మనోధైర్యం కలుగుతుందో, అందరం ఏకతాటిపై ఎలా నిలుస్తామో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోమారు నిరూపించారు. పహల్గాంలో పర్యటకులను ఊచకోత కోసిన ఉగ్రవాదులు పాకిస్థాన్ దేశ ప్రాయోజితమే. ఆ దేశ ప్రభుత్వం పెంచి పోషించి మనపైకి పంపిస్తోందని ఆపరేషన్ సిందూర్ తో ప్రపంచానికి ఇంకోసారి బలంగా చెప్పగలిగాము. ఇకపై ఉగ్రవాద దాడిని యుద్ధంగానే పరిగణిస్తామని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నాము. ఆయన తొలి నుంచి దూరదృష్టితో పరిపాలన సాగిస్తూ, దృఢమైన నిర్ణయాలు తీసుకొంటూ వచ్చారు. తన బృందాన్ని కూడా అదే పంథాలో నడిపించారు. దివంగత మనోహర్ పారికర్ గారు రక్షణ శాఖ మంత్రిగా ఉన్న సందర్భంలో ఎస్400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్, రాఫెల్ యుద్ధ విమానాలను సమకూర్చారు. ఆ రోజు శ్రీ మోదీ గారు నిర్దేశకత్వంలో.. దివంగత పారికర్ గారి ఆధ్వర్యంలో రక్షణ శాఖ సమకూర్చుకున్న సంపత్తి ఈ రోజు ఆపరేషన్ సిందూర్ లో సుదర్శన చక్రాల్లా ఉపయోగపడ్డాయి. మన సైన్యం ఎల్లవేళలా అప్రమత్తతతో ఉంటుంది. సరిహద్దుల్లో పహారా కాస్తూ మనల్ని రక్షిస్తుంది. ప్రతి పౌరుడు ఒకటి గుర్తుంచుకోవాలి. యుద్ధం ముగిసిపోయింది అనుకోవద్దు. మనం నిత్య అప్రమత్తతతో ఉండాలి. అంతర్గత భద్రత పట్ల జాగురూకతతో వ్యవహరిస్తూ ఏ దశలోనూ అశాంతికి తావిచ్చే ఘటనలు చోటు చేసుకోకుండా చూడాలి. దేశ సమగ్రత విషయంలో ప్రతి ఒక్కరం ఏకతాటిపై నిలవాలి. జనసేన నాయకులు, శ్రేణులు ముందు అనుకున్న విధంగానే షష్ట షణ్ముఖ క్షేత్రాలు, కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్ లోని అన్ని పుణ్య క్షేత్రాల్లో జనసేన శ్రేణులు మంగళవారం పూజాదికాలు నిర్వహిస్తాయి. ఆపరేషన్ సిందూర్ లో మన సైన్యం సాధించిన విజయానికిగాను భగవంతుడికి మొక్కులు చెల్లించుకుంటారు.



శనివారం నెల్లూరు భగత్‌సింగ్ కాలనీలో ప్లాటెడ్ ప్యాక్టరీ షెడ్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి నారాయణ

# పారిశ్రామికాభివృద్ధే లక్ష్యం

#### పురపాలక మంత్రి నారాయణ

**నెల్లూరు, మే 10, ప్రభాతవార్త-వైద్యం:** రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. పరిశ్రమలు స్థాపించే వారికి అన్ని రకాల వసతులు కల్పిస్తామన్నారు. స్థలం సమస్య తలెత్తకుండా ఒకే కాంప్లెక్స్‌లో క్లస్టర్‌లు, యూనిట్లు నెలకొల్పేందుకు ప్లాటెడ్ ఫ్యాక్టరీ షెడ్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. నెల్లూరు భగత్‌సింగ్ కాలనీలో 12 కోట్లతో ప్రయోగాత్మకంగా నిర్మించనున్న ఎంఎస్‌ఎంఈ ప్లాటెడ్ ప్యాక్టరీ షెడ్‌కు శనివారం సాయంత్రం మంత్రి నారా యణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ప్రాంతంలోనే 1400 కుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఒక వ్యాపారవేత్తను తయారు చేయాలన్నది సీఎం సంకల్పమని చెప్పారు. అన్ని నియోజకవర్గాల్లో పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశించారని, రాష్ట్రంలోనే మొదటి సారిగా నెల్లూరు సిటీలో ప్లొటెడ్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి షెడ్‌లతో పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పరిశ్రమల నెలకొల్పాలంటే ఎక్కువ స్థలం, ఫ్యాక్టరీకి అవసరమైన నీరు, విద్యుత్, ఇలా ఎన్నో రకాల >>2

# నెలాఖరుకు 'అన్నదాత సుఖీభవ'

### ఖరీఫ్ నాటికి రైతు ఖాతాల్లోకి నిధులు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే10,ప్రభాతవార్తప్రతినిధి:** అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు అన్ని సన్నాహకాలు ప్రారంభించినట్లు ఏపీ నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు.రైతాంగ ప్రయోజనాంశాలపై తమ ప్రభుత్వం స్థిరమైన ప్రణాళికతో వ్యవహరిస్తుందన్నారు.ఈ ఖరీఫ్ సీజన్(ఈ మాసాంతానికి) ఆరంభం నాటికి అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాల్లో జమవుతాయన్నారు."ఎక్స్'వేదిక చంద్రబాబు ఈ విషయాన్ని స్పష్టం చేసారు.ఇప్పటికే అధికార యంత్రాంగం ఈ దిశలో కార్యచరణ చేపట్టింది. లబ్దిదారు రైతుకు కచ్చితంగా నిధులు అందే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు.అన్నదాత సుఖీభవ పథకాన్ని వెబ్‌ల్యాండ్‌కు అనుసంధానం చేశారు. అందులో మరణించినవారు, ఉద్యోగులు, ప్రభుత్వ పెన్షన్ పొందేవారు, ఆదాయపు పన్ను చెల్లించేవారి వివరాలన్నీ వెబ్‌ల్యాండ్‌కు అనుసంధానం చేసి తొలగించాలని వ్యవసాయ, రెవెన్యూ శాఖకు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. వెబ్‌ల్యాండ్ డేటాను వారి లాగిన్లకు: రైతు సేవా కేంద్రాల(ఆర్‌ఎస్‌కే) వారీగా వెబ్ ల్యాండ్ డేటాను వీఏఏలు, వీఎస్‌ఏలు, వీహెచ్ ఏలతో పాటు ఏవోల లాగిన్లకు ఇచ్చారు. వెబ్‌ల్యాం డ్‌లో సర్వే నంబర్లు, రైతు పేరు, విస్తీర్ణం కచ్చితంగా ఉన్నాయా లేదా అన్నది రైతు సేవా కేంద్రాల సహాయకులు పరిశీలించి కచ్చిత వివరాలను మండల వ్యవసాయాధికారులకు వారు జిల్లా వ్యవసాయాధికారికి నివేదించాలి.

తప్పులుంటే సరిచేయడం, లేనిపక్షంలో తహసీల్దార్ల దృష్టికి తీసుకెళ్లి తప్పులు సరిచేసి ఇంటర్నెట్ లో పొందుపరచాలి. క్షేత్ర స్థాయిలో పరిశీలనలో అనర్హులను ఏరివేయాలి. అర్హులకు పథకాన్ని తప్పనిసరిగా వర్తింపజేయాలి. రైతు సేవా కేంద్రాల సహాయకులు ఈ నెల 20వ తేదీలోగా తప్పులు సరిచేసి ఇంటర్నెట్ లో నమోదు చేయాలని వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావును ఆదేశించినట్లు తెలిపారు అన్నదాత సుఖీభవ పథకం అమలులో భాగంగా గతంలో రైతు భరోసా పథకం కింద ఉన్న గణాంకాల వెబ్‌ల్యాండ్ డేటా సరిచేసిన తర్వాత ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనర్హులు ఉంటే తొలగిస్తామని అర్హులందరికీ అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేస్తారని తెలిపారు. రైతుల విషయంలో ప్రభుత్వం ఏ మాత్రం నిర్లక్ష్యం చేయదని సీఎం చంద్రబాబు అన్నారు.జిల్లాల్లో అకాల వర్షాలు, ప్రస్తుత పరిస్థితులను గురించి సీఎంకు కలెక్టర్లు వివరించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు ఇంకా వర్ష సూచన ఉన్నందున కలెక్టర్లు, అధికారులు ప్రజలను అప్రమత్తం చేసామన్నారు.ఎక్కడా ప్రాణనష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకునే దిశలో జిల్లా ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. విపత్తుల సమయాల్లో అధికారులు మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు. పిడుగుల పడే సమయాల్లో ప్రజల సెల్ ఫోన్‌లకు సందేశం వెళ్లని సమయంలో దగ్గరగా ఉన్నట్లైతే నేరుగా వెళ్లి అప్రమత్తం చేయాలని సూచించారు. దీనికి అనుగుణంగా సచివాలయాల్లోని సిబ్బందిని సిద్ధం చేయాలన్నారు.

పిడుగులు పడి చనిపోయిన పశువులకు కూడా నిబంధనల మేరకు పరిహారం వెంటనే విడుదల చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.జిల్లాల్లో పరిస్థితులను బట్టి కిందిస్థాయి అధికారులతో కలెక్టర్లు సమన్వయం చేసుకోవాలని సూచించారు. అకాల వర్షాలతో రాష్ట్రంలో 2,224 హెక్టార్లలో వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. ఈ మేరకు ప్రాథమిక అంచనాల నివేదికను సీఎం చంద్రబాబుకు అందజేశారు. ప్రధానంగా పశ్చిమ గోదావరి, నంద్యాల, కాకినాడ, సత్యసాయి జిల్లాల్లో ఈ పంటలకు నష్టం వాటిల్లిందని అన్నారు. అత్యధికంగా పశ్చిమ గోదావరి జిల్లా లోని 15మం డలాల్లో 1,033హెక్టార్లలో >>2

## రక్షణ, భద్రతా దళాల కదలికలను ప్రత్యక్ష ప్రసారం చేయొద్దు

2లో

# ముందస్తు వర్షాకాలం!

**విజయవాడ,మే10,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో వర్షాకాలం ముందే రానున్నదని భారతీయ వాతావరణ శాఖ వెల్లడించింది. మే 27వ తేదీన నైరుతీ రుతుపవనాలు కేరళను తాకనున్నట్లు ఒకవేళ అధికారులు అంచనా వేసినట్లు ముందుగానే రుతుపవనాలు కేరళను చేరితే, అప్పుడు 2009 తర్వాత ఈ ఏడాది తొలిసారి వర్షాకాలం ముందుగా వచ్చినట్లవుతుందని ఐఎండి వెల్లడించింది. 2009 సంవత్సరంలో మే 23వ తేదీన నైరుతీ కేరళను తాకినట్లు >>2

# పిఎస్ఆర్‌కు బెయిలు తిరస్కృతి

#### జత్వానీ కేసు

**విజయవాడ,మే 10,ప్రభాతవార్త ప్రతినిధి:** బాలీ వుడ్ నటి కాదంబరీ జెత్వానీని వేధింపులకు గురి చేసిన కేసులో ఐపీఎస్ అధికారి,నాటి నిఘా విభాగాధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులుకు చుక్కెదురైంది.ఆయన దాఖలు చేసిన బెయిలు పిటీషన్‌ను విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు తోసిపుచ్చింది. ఈ పిటీషన్‌పై ఇటీవల వాదనలు ముగిసాయి.ఈ మేరకు న్యాయాధికారి రాజేశ్వరి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసారు. ఈ కేసులో పీఎస్ఆర్‌ను >>2



ఇంటర్ ఫెయిత్ కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత,ప్రభుత్వ సీఎస్ విజయానంద్,డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా,ఇతర ఉన్నతాధికారులు వివిధ మతాల పెద్దలు

# అందరి నినాదం 'నేషన్ ఫస్ట్' కావాలి


>>తోంది. పహల్గాం కాల్పుల తర్వాత సరిహద్దుల్లో ఐదారు రోజులుగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పాడ్డాయి. ఈ సమయంలో మన త్రివిధ దళాలు వీరోచితంగా పోరాడాయి. ఈ పోరాటంలో కొందరు సైనికులు, పౌరులు ప్రాణాలు కోల్పోయారు. యుద్దంలో మన రాష్ట్రానికి చెందిన వీర సైనికుడు మురళీ నాయక్ ప్రాణాలు వదిలారు. 25 ఏళ్ల వయసులో దేశ రక్షణ కోసం ప్రాణాలు వదిలారు. తన దేహంపై జాతీయ జెండా కప్పుకుని చనిపోతానని చెప్పి వీరోచితంగా పాకిస్తాన్‌తో పోరాడి మురళీనాయక్ చనిపోయారు. ప్రజల్ని బాధపెట్టే ఉగ్రవాదాన్ని ఉపేక్షించంఇతర దేశాలను దెబ్బతీసే ఆలోచన భారతదేశం చేయదు. మనదేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటూనే ఎవరైనా మనమీదకు వస్తే గట్టిగా సమాధానమిస్తాం. ప్రజల్ని బాధపెట్టే తీవ్రవాదం, ఉగ్రవాదాన్ని ఎప్పటికీ ఉపేక్షించం. దేశంలోని ప్రతి కులం, ప్రాంతం, మతం దేశంకోసం పని చేస్తామని చెప్పాయి. ప్రజాస్వామ్యంలో విభేధాలు ఉండొచ్చు, అభిప్రాయలు, సిద్ధాంతాలను ఏకీభవించకపోవచ్చు. కానీ రాష్ట్ర, దేశ భవిష్యత్ కోసం ఎప్పుడూ వెనకడుగు వేసిన సందర్భాలు లేవు. మత విద్వేషాలు లేని రాష్ట్రం ఏపీ. అందుకే ఇక్కడ అన్ని మతాల ప్రతినిధులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసుకున్నాం. దేశ రక్షణలో ప్రాణాలు పోగొట్టుకున్న సైనికుల త్యాగాన్ని మనం గుర్తు చేసుకుని సంఘీభావంగా ఉండాలి. భారతదేశం చేసే పోరాటానికి సంఘీభావాన్ని తెలియజేయాలి. సరిహద్దు రాష్ట్రాల్లోని ప్రజలు ఐదారు రోజుల బాంబుల మోతతో ఇబ్బందులు పడ్డారు. చదువుకునే విద్యార్థులు స్వరాష్ట్రాలకు తిరిగొచ్చారు. హోంమంత్రి వంగలపూడి అనిత,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్,డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా,ఇతర ఉన్నతాధికారులు వివిధ మతాల పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటర్‌ఫెత్ కార్యక్రమానికి ముందు ఏపీ గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్.సీఎం చంద్రబాబు, డీ.సీఎంపవన్‌కల్యాణ్‌లు మర్యాదపూర్వకంగా పలు అంశాలపై ముచ్చటించారు. **కాల్పుల విరమణ శుభపరిణామం:** కాల్పుల విరమణ శుభపరిణామమని ఈ సమావేశంలో సీఎం చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు భారత్‌పాక్ దేశాల ఆర్మీ చీఫ్‌లు మాట్లాడుకుని కాల్పుల విరమణ చేయాలని నిర్ణయించారు. ఈ పిలుపు కూడా ముందు పాకిస్తాన్ నుంచి రావడంతోనే భారత్ అంగీకరించింది. మన దేశానికి యుద్ధం చేయాలనే ఆలోచన లేదు. కానీ ఉగ్రవాదం, తీవ్రవాదంపై రాజీలేని పోరాటం చేస్తామని కేంద్రం తెలిపింది. రెండు దేశాల ప్రతినిధులు 12వ తేదీన సమీక్ష చేసుకుంటామని ప్రకటించాయి. యుద్ధంలో నష్టపోయిన వారందరికీ సంతాపం తెలుపుతూ తీర్మానం చేద్దాం. దేశ సమగ్రతకు ప్రధాని, కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్నా తెలుగుజాతి, ఏపీప్రజలు అండగా ఉంటామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ దేశం ముఖ్యమనే కీలక లక్ష్యంతో ఆపరేషన్ సింధూరకు అండగా నిలవడం అభినందనీయమన్నారు.

## అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో జనఔషధి షాపులు

>> అటు వంటి జనరిక్ ఔషధాల నాణ్యత విషయంలో నియంత్రణ లేకపోవటం కూడా ఆందోళన కలిగించే మరో అంశం.ప్రస్తుతం ఉన్న 23 జనరిక్ దుకాణాలను స్వయం సహాయక బృందాలు మరియు ఇతర సం ఘాలకు కేటాయించినప్పటికీ, ప్రైవేట్ వ్యక్తులు వాటిని భారీ లాభాలతో నడుపుతున్నట్లు తెలుస్తోంది. ఎంతో ప్రజోపయోగమైన జన ఔషధి కేంద్రాల్ని దేశ వ్యాప్తంగా నెలకొల్పాలని ప్రధాని నరేంద్ర మోడీ సూచించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. **వీర జవాను మురళీ నాయక్ అంత్య క్రియలకు హాజరుకానున్న ఆరోగ్య మంత్రి:** దేశ రక్షణ కోసం పాకిస్తాన్ సేనలతో పోరాడుతూ అసువులు బాసిన వీర సైనికుడు మురళీ నాయక్ కు వైద్య,ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ నివాళులు అర్పించారు. మురళీనాయక్ మృతి పట్ల మంత్రి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి సానుభూతిని తెలియజేసి వీర సైనికుని కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.మురళీనాయక్ అంత్యక్రియలకు మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరవుతారు.

## ముందస్తు వర్షాకాలం!

>> ఐఎండీ డేటా తెలుపుతుంది. సాధారణంగా జూన్ ఒకటో తేదీ సమయానికి కేరళలోకి నైరుతీ రుతుపవనాలు ప్రవేశిస్తాయి. ఈ రుతుపవనాల వల్లే దేశంలో వర్షాకాలం ప్రారంభం అవుతుంది. ఆ తర్వాత జూలై 8వ తేదీలోగా దేశవ్యాప్తంగా ఆ రుతుపవనాలు విస్తరిస్తాయి. సెప్టెంబర్ 17వ తేదీ నుంచి ఆగ్నేయ దిశ నుంచి తిరోగమనం అవుతాయి. అక్టోబర్ 15వ తేదీలోగా పూర్తిగా ఆ రుతుపవనాలు వెళ్లిపోతాయి. 2025 వర్షాకాలంలో సాధారణం కన్నా అధికంగానే వర్షం కురుస్తుందని ఏప్రిల్‌లో ఐఎండీ వివరించిన సంగతి విదితమే. ఎల్ నినో పరిస్థితులు ఉండబోవని ఐఎండీ పేర్కొన్నది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు ఈసారి నాలుగు నెలల్లో వర్షపాతం సాధారణ స్థాయి కన్నా ఎక్కువే ఉంటుందని ఎర్త్ సైన్సెస్ శాఖ కార్యదర్శి ఎం రవిచంద్రన్ తెలిపారు. ఈసారి వర్షాకాలం ముందే రానున్నదని, మే 27వ తేదీన నైరుతీ రుతుపవనాలు కేరళను తాకనున్నట్లు భారతీయ వాతావరణ శాఖ తెలిపింది.



వీర సైనికునికి నివాళులు అర్పిస్తున్న మహారాష్ట్ర మంత్రి ఉదయ్ సమత్

## మురళి నాయక్ కుటుంబానికి మహారాష్ట్ర ప్రభుత్వం అండ

### మురళి కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించిన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే

**గోరంట్ల, మే 10 ప్రభాతవార్త :** వీరజవాన్ మురళి నాయక్ మహారాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మహారాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి ఉదయ్ సమత్ పేర్కొన్నారు. శనివారం గోరంట్ల మండలంలోని కల్లి తండాలోని దేశంకోసం ప్రాణాలర్పిచ్చిన వీర జవాన్ అగ్నివీర్ మురళి నాయక్ ఇంటిని సందర్శించి మురళి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు.ఈ సందర్భంగా మురళి నాయక్ తల్లి తండ్రి శ్రీరామ్ నాయక్, జ్యోతి బాయి లనుపరామర్శించి ఓదార్చారు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏకనాథ్ సిందే చరవాణి ద్వారా మురళినాయక్ తల్లీ తండ్రి పరామర్శించి,మీ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మహారాష్ట్ర ప్రభుత్వం వారి కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు, మహారాష్ట్రలో వారు నివసించిన ప్రదేశంలో విగ్రహం ఏర్పాటు చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు, మహారాష్ట్ర కు వలస వచ్చి వీర జవాన్ మురళి మురళి నాయక్ కుటుంబం నివాసం నివాసం ఉన్నదని తెలిపారు. వారి ఆత్మ శాంతి కలగాలని ప్రార్థించారు. మహారాష్ట్ర పట్టణంలో మంచి కూడలిలో వారి పేరు పైన కాంప్లెక్స్ పేరు పెట్టడం జరుగుతుందని తెలిపారు.

# నెలాఖరుకు 'అన్నదాత సుఖీభవ'

>> వరిపంట దెబ్బతిందని వివరించారు. నంద్యాల జిల్లాలో 641 హెక్టార్లలో, కాకినాడ జిల్లాలో 530 హెక్టార్లలో, సత్యసాయి జిల్లాలో 20 హెక్టార్లలో వరిపంట దెబ్బతిందని అధికారులు వివరించారు. అకాల వర్షాల కారణంగా రాష్ట్రంలో దెబ్బతిన్న హార్టికల్చర్ పంటల వివరాలను సీఎంకు అధికారులు వివరించారు. అరటి, బొప్పాయి, మామిడి, తదితర ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో ఎక్కువగా అరటి, మామిడి పంటలకు నష్ట వాటిల్లింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 138 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. కృష్ణా, ఏలూరు, కాకినాడ, ఎన్టీఆర్, తిరుపతి, నంద్యాల, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఉద్యానవన పంటలకు నష్టం కలిగిందని అధికారులు వివరించారు. రబీలో 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని పౌరసరఫరాల శాఖ ప్రత్యేక కార్యదర్శి సౌరబ్ గౌర్ సీఎంకు వివరించారు. ఇప్పటికే 13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. వర్షాలకు రంగు మారిన ధాన్యం కూడా కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతుల వద్దనున్న ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. పోలవరం కుడి ప్రధాన కాలువకు సమాంతరంగా మరో కాలువ తవ్వి నీరు పంపగలిగితే రాయలసీమకు ఉపయుక్తంగా ఉంటుందని చంద్రబాబు వెల్లడించారు. అది పోలవరం బనకచర్ల అనుసంధానంతోనే సాధ్యమవుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టును పూర్తిచేస్తే ఏపీలోని అత్యధిక ప్రాంతాలకు సమృద్ధిగా నీళ్లు అందుతాయని చెప్పారు. ఈ ప్రాజెక్టుతో తెలంగాణ కూడా లబ్ధి పొందుతుందని కానీ వాళ్లెందుకో ప్రతికూల భావనలో ఉన్నారని పేర్కొన్నారు. తెలంగాణ నీటివాటాకు ఎలాంటి ఇబ్బందీ ఉండదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టును అనుకున్న లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేస్తామన్నారు.ఈ ఏడాది డిసెంబర్ చివరినాటికి డయాఫ్రమ్ వాల్ పూర్తి చేస్తామన్నారు.పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కూటమి ప్రభుత్వం వచ్చాక పరుగులుపెడుతోంది. సవాళ్లను దాటుకొని ముందడుగు వేస్తోంది. 9 నెలల కాలంలోనే ప్రాజెక్టు మొత్తం మీద 6.11 శాతం పనులు జరిగాయి. జగన్ హయాం ఐదేళ్లలో మాత్రం 11.58 శాతం పనులు మాత్రమే చేశారు. కూటమి ప్రభుత్వంలో 9 నెలల్లోనే అందులో సగం పనులు పూర్తి చేసింది. ప్రధాన డ్యాంలో 3.80 శాతం భూసేకరణ, పునరావాసానికి సంబంధించి 2.56 శాతం మేర పురోగతి కనిపిస్తోంది. జగన్ ఇరిగేషన్ శాఖలోనే రూ.18వేల కోట్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టి వెళ్లారని తెలిపారు. గత ప్రభుత్వం లష్కర్లకు ఏడాది జీతాలు బకాయిలు పెడితే కూటమి ప్రభుత్వం చెల్లించిందని చెప్పారు.

**రాయలసీమకు నీరందించేలా చర్యలు:** వృథాగా పోతున్న వరద జలాలను లోటు ఉన్న ప్రాంతాలకు తరలించేలా లింకు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. పల్నాడు జిల్లా బొల్లాపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి బనకచర్ల రెగ్యులేటర్ వరకూ నీటిని తరలించేలా ప్రణాళిక రూపొందించనున్నారు. దాదాపు 150 టీఎంసీల వరకూ నీటిని తరలించేందుకు ఆస్కారం ఉందని లోటు ఉన్న జిల్లాలకు ఈ వరద జలాలను వినియోగించుకోవచ్చని యోచిస్తున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉండే రాయలసీమ జిల్లాలకు నీటిని అందించేలా ఈ ప్రాజెక్టు ఉపకరిస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. ఇప్పటికే ?పోలవరం బనకచర్ల రెగ్యులేటర్ కు కాలువలు, ఎత్తిపోతల పథకాలు, భూగర్భ పైప్ లైన్లు, సొరంగాల ద్వారా నల్లమల నుంచి నీటిని తరలించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. దీనికోసం ఓ ప్రత్యేక వాహక సంస్థగా జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టుగా దీన్ని తీర్చిదిద్దాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఎస్పీవీగా బహిరంగ మార్కెట్ల నుంచి నిధులు సేకరించేందుకు అవకాశం ఉందని వెల్లడించింది. ఈ మేరకు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

## పిఎస్ఆర్‌కు బెయిలు తిరస్కృతి

>> గత నెలలో సీఐడీ అధికారులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుండి విజయవాడ లోని జిల్లా జైలులో రిమాండులో ఉన్నారు. కేసులో ఇంకా దర్యాప్తు పూర్తి కాల్ మనీ,ఈ దశలో నిందితుడిని బెయిలు ఇస్తే విచారణపై ప్రభావం పడుతుందని వాదనల సందర్భంగా ప్రాసిక్యూషన్ తరఫున ఏసీపీ వాదనలు వినిపించారు. ఈ కేసులో నిందితుడికి ఎటువంటి సంబంధంలేదని,కక్షపూరితంగా పేరు చేర్చారని పీఎస్ఆర్ తరపు న్యాయవాది వాదించారు.

## రాజధానిలో బిట్స్‌కు 70 ఎకరాలు

>> రాజధానిలోని మందడం,వెంకటపాలెం గ్రామాల పరిధిలో ఈ భూమిని కేటాయించింది. రాజధానిలో వివిధ సంస్థలకు కొత్తగా భూ కేటాయింపులు కొన్ని సంస్థలకు గతంలో చేసిన కేటాయింపులు రద్దు చేస్తూ మంత్రివర్గ ఉపసంఘం తీసుకున్న నిర్ణయాలపై ప్రభుత్వం జిఓ జారీ చేసింది. ఈఎస్ఐ కార్పొరేషన్‌కు ఎకరం రూ.50 లక్షల చొప్పున నెక్కల్లులో 25 ఎకరాలు ఇచ్చారు. హడ్కో ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు ఎకరం భూమి రూ.4 కోట్లు చొప్పున 8 ఎకరాలు కేటాయించింది. భారతీయ రిజర్వు బ్యాంకును నేలపాడు వద్ద గతంలో ఎకరం రూ.4 కోట్లు చొప్పున 2 ఎకరాలు కేటాయించగా,దాన్ని ఇప్పుడు 3 ఎకరాలకు పెంచింది. లా యూనివర్సిటీకి 55 ఎకరాలు, క్వాంటమ్ వ్యాలీకి 50 ఎకరాలు,బసవతారకం క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌కు అదనంగా 6 ఎకరాలు ఐఆర్‌సిటీసీ హోటల్‌కు ఎకరం,ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి 0.78,కోస్టల్ బ్యాంకు 0.40 ఎకరాలు చొప్పున కేటాయించింది.ఎల్ఐసీ,కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్),సెంకరటల్ చిన మ్రయ మిషన్ ట్రస్ట్,న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ,జీఎస్ఐ,రామకృష్ణమిషన్‌లకు గతంలో మొత్తం 23,805 ఎకరాలు కేటాయించగా,దాన్ని ఇప్పుడు 8.85ఎకరాలకు తగ్గించింది. కాగ్‌కు గతంలో 14.05 ఎకరాలు కేటాయించగా దాన్ని 2.05 ఎకరాలకు తగ్గించింది.2014-19 మధ్య 22 సంస్థలకు చేసిన 99.61 ఎకరాల భూ కేటాయింపులను రద్దు చేసింది.+రాజధానిలో హోటళ్ళ ఏర్పాటుకు గతంలో వరుణ్ హాస్పటాలిటీ అండ్ ఇట్స్ కన్సార్షియంతో సీఆర్‌డీఏ చేసుకున్న భూ విక్రయ ఒప్పందాన్ని మార్పు చేసి వరుణ్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్‌తో చేసుకునేందుకు అనుమ తిచ్చింది. ఓం శ్రీ భావనసాయి అసోసియేట్స్‌తో గతంలో చేసుకున్న ఒప్పందానికి కాలం చెల్లించినందున,మళ్ళీ ఒప్పందం చేసుకునేందుకు అనుమతినిచ్చింది. ఇప్పుడు ఆ సంస్థ హయత్ గ్రూప్‌తో కలిసి హోటల్ ఏర్పాటు చేయబోతుంది.

# సయోధ్య కుదిర్చిన 'పెద్దన్న'

>> ధ్రువీక రించారు. కాల్పుల విరమించామంటూ భారత్‌పాక్ ధ్రువీకరించడానికి కొద్ది ముందే ఇరుదేశాల మధ్య సయోధ్య కుదిరిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. భారత్, పాక్ దేశాల మధ్య రాత్రంత్రా జరిపిన మధ్యవర్తిత్వం ఫలించిందని, యుద్ధ విరమణకు భారత్, పాక్ అంగీకరించినందుకు సంతోషంగా ఉందని ట్రంప్ అన్నారు. కాగా, దీనికి కొద్ది గంటల ముందే భారత్‌పాక్ ఉద్రిక్తతల వేళ రెండు దేశాల నడుమ జరిగే యుద్ధంలో తాము జోక్యం చేసుకోమంటూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తేల్చిచెప్పడం ఆసక్తికరం. ప్రాథమికంగా అయితే ఇరుదేశాల మధ్య యుద్ధం తమకు సంబంధం లేదని విషయమని ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వాన్స్ పేర్కొన్నారు. అణ్వాయుధ దేశాల మధ్య ఘర్షణ వాతావరణం తగ్గించేందుకు మాత్రం ప్రోత్సహిస్తామన్నారు. ఆయుధాలు వదిలేయాలని భారత్, పాక్‌కు మేం చెప్పలేం. మేము దౌత్య మార్గాల ద్వారా ఉద్రిక్తతలు తగ్గించేందుకు ప్రయత్నిస్తాం అని చెప్పారు. ఈ క్రమంలోనే ఏ ఉగ్రదాడినైనా ఇక నుంచి యుద్ధంగా పరగణిస్తాంటూ భారత్ కీలక నిర్ణయం తీసుకుంది. పాక్‌కు పరోక్షంగా తీవ్ర హెచ్చరికలు చేసింది. దీంతో రాయబారం కోసం అమెరికాను పాక్ వేడుకోవడం, ట్రంప్ దౌత్యం ఫలించి కాల్పుల విరమణకు భారత్ అంగీకరించడంతో ఆయన తక్షణమే ఇరుదేశాల అంగీకారంపై కీలక ప్రకటన చేశారు. భారత్‌పాక్ ఎంతో వివేకంగా వ్యహరించాయని, కాల్పుల విరమణకు అంగీకరించాయంటూ ప్రశంసలు కురిపించారు.

## ఉల్లంఘించిన పాక్

>> కాల్పుల విరమణను ఉల్లంఘించిందని, పాక్ దురాగతాలను భారత సైన్యం సమర్థంగా తిప్పికొడుతోందని మిస్రీ అన్నారు. ఎలాంటి పరిస్థితిని అయినాసరే కట్టడిచేసేందుకు భారత్ సన్నద్ధంగా ఉందన్నారు. కాల్పుల విరమణ ఉల్లంఘనపై తక్షణ చర్యలు తీసుకోవాలని పొరుగుదేశానికి సూచించామని, డ్రోన్లు, కాల్పులు జరిపినట్లు సమాచారం అందిందని, ఈ సంఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. డైరెక్టర్‌జనరల్‌మిలిటరీ ఆపరేషన్స్ రెండు దేశాల అధికారులమధ్య జరిగిన ఒప్పందాన్ని పాకిస్తాన్ ఉల్లంఘించిందని అయినా భారత్ తన వ్యూహం అమలుచేసి ఎక్కడికక్కడ తిప్పి కొట్టిందని ఆయన అన్నారు.ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు విదేశాంగ కార్యదర్శి చెప్పారు.

## రక్షణ, భద్రతా దళాల కదలికలను ప్రత్యక్ష ప్రసారం చేయవద్దు

**విజయవాడ,మే10,ప్రభాతవార్తప్రతినిధి:**భారత రక్షణ, భద్రతా దళాల కదలికలను ప్రత్యక్ష ప్రసారం చేయకుండా ఉండాలని భారత ప్రభుత్వం సమాచార. ప్రసార మంత్రిత్వ శాఖ (న్యూఢిల్లీ) దేశంలోని అన్ని మీడియా ఛానళ్ళకు మోలిక సూత్రాలు,. నిబంధనలు జారీ చేసింది.ఏపీ సమాచార,పౌరసంబంధాల శాఖ ఈ విషయంపై శనివాం ఒక ప్రకటన జారీ చేసింది.జాతీయ భద్రత దృష్ట్యా, అన్ని మీడియా ప్లాట్ ఫామ్స్, వార్తా సంస్థలు సోషల్ మీడియా ఉప , రక్షణ, ఇతర భద్రతా కార్యకలాపాల గురించి ప్రసారం చేసేటప్పుడు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.

# పారిశ్రామికాభివృద్ధే లక్ష్యం

>> సదుపాయాలు కల్పించాల్సి ఉంటుందన్నారు. భూమి దొరకకుంటే ఫ్యాక్టరీలు పెట్టేందుకు అవకాశం ఉండదని, భూమి కావాలంటే టౌన్‌లకు దూరంగా ఏదొక పల్లెటూరుకు దగ్గరగా వెళ్లిపోవాల్సి వస్తుందన్నారు. ఒక ఫ్యాక్టరినో లేదా చిన్న కంపెనియో స్థాపించాలంటే పట్టణాల్లో ఎక్కడా స్థలం కనపడదని తెలిపారు. ఆ సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు పట్టణాల్లో యూనిట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఉద్యోగాలు చేసే వారికి కంపెనీలు అందుబాటులో ఉండాలని ప్రభుత్వం ఆలోచన చేసిందన్నారు. అందులోంచి వచ్చిందే ఈ ప్లోటెడ్ ఫ్యాక్టరీ షెడ్‌ల ఏర్పాటని అన్నారు. ప్లోటెడ్ షెడ్‌కు రెండు, మూడు ఎకరాలు ఉంటే సరిపోతుందని అందులో మల్టీ స్టోర్ బిల్డింగ్ కడతారని తెలిపారు. వాటిని పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా డివైడ్ చేస్తారన్నారు. ఈ రోజు శంకుస్థాపన చేసుకున్నది కూడా అలాంటిదేనన్నారు. ఏపీఐఐసీ రెండెకరాల 40 సెంట్లు స్థలం కొనుగోలు చేసి ఈ షెడ్‌ను మొత్తం 12 కోట్లతో జీ ప్లస్ 2 విధానంలో ఇక్కడ మల్టీ స్టోర్డ్ బిల్డింగ్ నిర్మిస్తారని చెప్పారు. ఈ బిల్డింగ్‌లో 26 యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రౌండ్ ఫ్లోర్లో 14357 చదరపు అడుగుల విస్తీర్ణంలో 7 యూనిట్లు, ఫస్ట్ ఫ్లోర్లో 13980 చదరపు అడుగుల విస్తీర్ణంలో 9 యూనిట్లు, సెకండ్ ఫ్లోర్‌లో 13980 చదరపు అడుగుల విస్తీర్ణంలో 10 యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా డివైడ్ చేస్తామని తెలిపారు. ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు, సిటీ రూరల్‌లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. అనుకున్నది సాధించే పట్టుదల ఉన్న వ్యక్తి మంత్రి నారాయణ అని కొనియాడారు. ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం చేస్తున్న ఆలోచన చాలా మంచిదన్నారు. నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఎంఎస్ఎం ఈ పార్కు ఏర్పాటుకు మంత్రి నారాయణ కృషి చేస్తారన్నారు. భగత్ సింగ్ కాలనీకి గత ప్రభుత్వ సేవలు ద్రోహం చేస్తే కాలనీ వాసులకు శాశ్వత ఇంటి పట్టాలతో పాటు, నివాస ప్రాంతంలోనే ఎంఎస్ఎంఈ పార్కు పెట్టి ఉపాధి కల్పించాలని సంకల్పించి మాట నిలబెట్టుకున్న చేతల మంత్రిగా నారాయణ చరిత్రలో నిలిచిపోతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కమీషనర్ నందన్, ఆర్డీఓ అనూష, ఏపీఐఐసీ జీఎం ప్రసాద్, జోనల్ మేనేజర్ శివకుమార్, టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, టీడీపీ నగర అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్ షఫియాబేగం, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ జహీర్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

# ఇటు విరమణ.. అటు కాల్పులు

>> నిమిషంలో మనసు మార్చుకుని 24 గంటలపాటు రెండువైపులా చర్చలుజరిపింది. విదేశాంగమంత్రి మార్కోరుబియో, ఉపాధ్యక్షుడు జెడివాన్స్‌లు కూడా కీలకంగా వ్యవహరించడంతో పాక్ దారికి వచ్చింది. సరిహద్దుల్లో దాడులు ఆపివేస్తేనే కాల్పుల విరమణ ఉంటుందని భారత్ తెగేసి చెప్పింది. అంతేకాకుండా ఉగ్రస్థావరాలకు సాయం నిలిపివేయాలన్న డిమాండ్‌ను కూడా వినిపించింది. తనకు ఎంతో మిత్రులైన గల్ఫ్‌దేశాలు, చైనా, రష్యాలుకూడా కేవలం ప్రకటనలే చేసాయికానీ భారత్‌కే మద్దతు తెలిపాయన్న భావన పెరగడంతో గత్యంతరంలేక పాక్ కాల్పుల విరమణకు అంగీకరించింది. కాల్పుల విరమణకు భారత్; పాకిస్తాన్‌లు అంగీకరించాయని విదేశాంగశాఖ కార్యదర్శి మిస్రీ తెలిపారు. సాయంత్రం ఐదుగంటలనుంచి అమలుకు వచ్చినట్లు తెలిపింది. విదేశాంగశాఖ కార్యదర్శి మిస్త్రీ మాట్లాడుతూ శనివారం మధ్యాహ్నం 3.35 గంటలకు ఇరుదేశాల డైరెక్టర్‌జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ స్థాయిలో చర్చలుజరిగాయని, పాకిస్థాన్ డిజిఎంఒ భారత డిజిఎంఒకు ఫోన్‌చేసారని తెలిపారు. కాల్పుల విరమణకు ఇరుదేశాల సైనికాధికారులు అంగీకరించారని, సాయంత్రం ఐదు గంటలనుంచి అమలుకువచ్చిందని ప్రకటించారు. భూఉపరితలం, గగనతలంలోను, సముద్రజలాలపరంగా కూడా ఇరుదేశాలమధ్య కాల్పుల విరమణ కొనసాగుతుందని చెప్పారు. రెండుదేశాల సైన్యాలకు ఇందుకు సంబంధించినాదేశాలు వెళ్లాయన్నారు. ఈనెల 12వ తేదీ సాయంత్రం డిజిఎంఒలు మళ్లీ చర్చలుజరుపుతారని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. ఉగ్రవాదంపై భారత్ రాజీలేని వైఖరితోనే కొనసాగుతుందని విదేశాంగమంత్రి జైశంకర్ ఈసందర్భంగా స్పష్టంచేసారు. కాల్పుల విరమణకు అంగీకరించినా భారత సైన్యం నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని భారత సైనికాధికారులు చెప్పారు. కొన్నిరోజులుగా భారత్‌పై పాకిస్థాన్ అసత్యాలు ప్రచారంచేస్తోందని, ఎస్-400, బ్రహ్మోస్ వ్యవస్థలపై దాడిచేసామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. సిర్సా, జమ్ము, భటిండా, భుజ్‌లపై పాక్‌దాడిచేసామని ప్రచారంచేయడం కూడా అవాస్తవమేనన్నారు.నలియా పఠాన్‌కోట్ వాయుసేనస్థావరాలకు నష్టం కలిగించామని చండీగఢ్ ఆయుధాగారంపై దాడిచేసినట్లు పాక్ తప్పుడు ప్రకటనలుచేసిందన్నారు. భారత్ లౌకిక దేశమని ప్రార్థనామందిరాలపై ఎప్పుడూ దాడులుచేయదన్నారు. పాకిస్థాన్ రాడార్, క్షిపణి రక్షణ వ్యవస్థలను నిర్వీరనయంచేసామని, కర్దు, సర్గోదా, జకోదాబాద్‌లోని పాక్ వాయుసేనస్థావరాలను భారత దళాలు ధ్వంసంచేసాయన్నారు. నియంత్రణరేఖపొడవునా అపారనష్టం కలిగించామని, కాల్పుల విరమణకు అంగీకరించినా సైన్యం పూర్తి సన్నద్ధతతో ఉంటుందని సైనికాధికారులు అప్రమత్తంగా ఉంటారని సిఎండిఇ రఘునాయర్, కల్నల్ సోఫియా ఖురేషి, వైమానికదళ కమాండర్ వ్యోమికాసింగ్‌లు ప్రకటించారు.



శనివారం హైదరాబాద్‌లో మిస్‌వరల్డ్ పోటీల కార్యక్రమానికి హాజరైన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

# భారీ ఉష్ణోగ్రతలు నమోదు

### రేణిగుంట, విజయనగరం 41°

**విజయవాడ,మే10,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో పలు ప్రాంతాల్లో శనివారం భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.కొన్ని జిల్లా ఉక్కపోత ప్రజలను ఇబ్బంది పెట్టినప్పటికి,సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వానలు పడ్డాయి.విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది.ఎండలో ఇదే రీతిలో కురు స్తాయని,రాబోయే నాలుగు రోజులు ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ తెలిపింది.శనివారం తిరుపతి జిల్లా రేణిగుంటలో 41.7డిగ్రీలు విజయనగరంలో 41.1డిగ్రీలు, తూర్పుగోదావరి జిల్లా మురమండలో 41డిగ్రీలు అన్నమయ్య జిల్లా కంబాలకుంటలో 40.8డిగ్రీలు, వైఎస్సార్ జిల్లా మద్దూరు,ప్రకాశం జిల్లా మేకలవారిపల్లిలో 40.7డిగ్రీలు చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు.ఎండలో బయటకు వెళ్లేప్పుడు నెత్తికి టోపీ పెట్టుకోండి లేదా రూమాలు కట్టుకోండి, తెలుపురంగు గల కాటన్ వస్త్రాలను ధరించండి. అదేవిధంగా మీ కళ్ళ రక్షణ కోసం సన్ గ్లాసెస్ ఉపయోగించండి. చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలి. గుండె సంబంధిత వ్యాదులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు.మరోవైపు పిడుగులతో కూడిన ఆకస్మిక వర్షాలు, ఈదురుగాలులు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు హోర్డింగ్స్, చెట్ల క్రింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాలు దగ్గర నిలబడరాదన్నారు. ఆదివారం 41డిగ్రీలు 43.5డిగ్రీలు మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు.అల్లూరి సీతారామరాజు11,అనకాపల్లి జిల్లా8 మండలాల్లో తీవ్రవడగాలులు(19), మరో 30 మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు తెలిపారు. సోమవారం 24 మండలాల్లో తీవ్ర,57 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందన్నారు. రేపు అల్లూరి సీతారామరాజు8, అనకాపల్లి16, అనంతపురం4, అన్నమయ్య1, చిత్తూరు జిల్లా కుప్పం మండలాల్లో(30) వడగాలులు వీచే అవకాశం ఉందన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 11-05-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్ల పక్షం
చతుర్దశి రా.8.01
స్వాతి పూర్తి
వర్జ్యం ఉ.9.21-11.10
దు.సా.4.43-6.34
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** ఆత్మీయులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. గృహ నిర్మాణ ఆలోచనలు స్థిరంగా ఉండవు.

**వృషభం:**కుటుంబంలో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. వృత్తి, వ్యాపార లావాదేవీలు మందగిస్తాయి.

**మిథునం:** బంధువులతో ఏర్పడిన తగాదాలు పరిష్కరించుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**కర్కాటకం:** భూవివాదాలు పరిష్కరించుకుంటారు. చర్చాగోష్ఠులలో చురుకుగా పాల్గొంటారు. వస్తు సేకరణ.

**సింహం:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో కొత్త ఆశలు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**కన్య :** పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**తుల :** ప్రయాణాలలో తొందరపాటు వద్దు. ఇంటా బయటా సమస్యలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు.

**వృశ్చికం:** ఉద్యోగయత్నాలు నత్తనడకన సాగుతాయి. వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. సోదరుల కలయిక.

**ధనుస్సు:** ఉద్యోగాలలో చికాకులు ఎదురైన అధిగమిస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. వస్తులాభం.

**మకరం:** ఆకస్మిక ప్రయాణాలలో తొందరపాటు వద్దు. గృహనిర్మాణ ఆలోచనలు స్థిరంగా ఉండవు. వస్త్రాల సేకరణ.

**కుంభం:** శ్రమ పెరుగుతుంది. వ్యాపారాలు మందకొడిగా ఉంటాయి. ఉద్యోగాలలో కొత్త సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి.

**మీనం:** కొత్తమిత్రులు పరిచయమై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

### శని త్రయోదశి సందర్భంగా

# విశేష పూజలు

## 30వేల మంది భక్తుల దర్శనం



శ్రీకాళహస్తీశ్వరుని దర్శనం కోసం నిరీక్షిస్తున్న జనం

**శ్రీకాళహస్తి, మే 10 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తులతో కిట కిట లాడింది. ఉదయం నుంచి ఆలయంలో ఎటు చూసినా భక్తుల శివనామస్మరణతో పునీతమైంది. శనివారం త్రయోదశి కావటంతో శనీశ్వరుని ఆలయం వద్ద , అభయ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. శనీశ్వరునికి 372 అభిషేకాలు జరిగాయి. అభయ వెంకటేశ్వరస్వామి నిలువెత్తు విగ్రహాన్ని కన్నులుమిరుమిట్లు గోల్పునట్లు ముస్తాబు చేసారు. శనీశ్వరుని విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు జరిపారు. వేదపండితులు, అర్చకులు స్వామి సన్నిధిలో వేద మంత్రాలను పఠిస్తూ షోడషాభిషేకాలు జరిపారు. ఇక శనీశ్వరస్వామి, రాహుకేతుదోష నివారణ పూజలు కూడా రికార్డు స్థాయిలో జరిగాయి. ఇటీవల కాలంలో శ్రీకాళహస్తీశ్వరాలయం లో భక్తుల రద్దీ పెరిగింది. ముఖ్యంగా రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. శనివారం ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరోవైపు అతిధులతో కళ కళ లాడింది.

**అనూహ్యంగా పెరిగిన రద్దీ:** నాలుగైదు రోజులుగా ఎండలతో పరిమితంగా ఉన్న భక్తుల సంఖ్య శనివారం ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. దేవస్థానం అందించిన సమాచారం మేరకు సుమారు 30వేల మంది శనివారం స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారని ఆలయాధికారులు చెబుతున్నారు. రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిగినట్లు వివరించారు.

**శివానందైక నిలయం జనంతో కిట కిట:** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శివానందైక నిలయం శనివారం భక్తులతో కిట కిట లాడింది. దక్షిణ కైలాసంలో వెలసిన వాయులింగేశ్వరుడు భక్తులు తమ ఇష్టదైవం ముక్కంటీశునికి దర్శించుకొని శుభాలు పొందాలని పరుగులు తీశారు. ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరో వైపు అతిధుల తాకిడితో ఆలయం కిట కిట లాడింది. అడుగు తీసి అడుగు వేయలేని స్థితి చోటు చేసుకుంది. అయితే వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఆదేశాలతో వారి సిబ్బంది పరుగులు తీసారు. తిరుమలేశుని దర్శనానికి వచ్చిన భక్తులకు దర్శనం ఆలస్యం అవుతుండటంతో సమీపం లోని ఆలయాల దర్శనానికి రద్దీ ఏర్పడింది. ఒక్కసారిగా జనం తండోప తండాలుగా కడలి తరంగాల్లా కదలి వచ్చారు. రెండు రోజులుగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ అధికమైంది. శ్రీకాళహస్తీశ్వరాలయంతో పాటు పరిసర దేవాలయాలు భక్తులతో కిట కిట లాడాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, సతీష్ మాలిక్, టెంపుల్ ఇన్స్పెక్టర్లు హరియాదవ్, సుదర్శనం, వారి సహచరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

**రోజు రోజుకు పెరుగుతున్న భక్తులు : ఇఓ డి.బాపిరెడ్డి** శ్రీకాళహస్తీశ్వరాలయానికి వేసవి సెలవులతో రద్దీ పెరుగుతుందని ఆలయ ఇఓ బాపిరెడ్డి శనివారం వివరించారు. అయితే వచ్చినభక్తులు ఇబ్బందిపడకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆలయంలోనిర్వహించే సేవల్లో స్వామి అమ్మవార్ల అభిషేకాలు 67 రాహుకేతుదోష నివారణ పూజలు 5వేలు జరిగాయి.

# జాతీయ రక్షణ నిధికి స్పీకర్ నెల వేతనం విరాళం

**విజయవాడ,మే10,ప్రభాతవార్తప్రతినిధి:** జాతీయ రక్షణ నిధికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తన ఒక నెల వేతనాన్ని విరాళంగా అందజేశారు. ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా ఈ విరాళాన్ని ఆయన జమ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్న పాత్రుడు గారు మాట్లాడుతూ– మన దేశ సాయుధ



దళాలు ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు చేస్తున్న ధైర్యసాహసాలు ప్రతి భారతీయునిలో గర్వాన్ని కలిగించే అంశం. దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న వీర జవాన్లకు నా వంతుగా సంఘీభావంగా నా నెలవేతనాన్ని జాతీయ రక్షణ నిధికి విరాళంగా ఇచ్చాను. అని తెలిపారు. ఉగ్రవాద నిర్మూలనలో సాయుధ దళాలు ప్రదర్శిస్తున్న ధైర్యసాహసాలు దేశ ప్రజలందరికీ గర్వకారణంగా నిలుస్తున్నాయి అని అన్నారు. భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ఆర్మీకి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. సైనికులకు తమ వంతు సహాయం అందించేందుకు తెలుగు రాష్ట్రాల్లో ప్రజాప్రతినిధులు తమ నెల జీతాన్ని ఆర్మీకి విరాళంగా ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు. తాజాగా ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తన నెల వేతనాన్ని జాతీయ రక్షణ నిధికి విరాళంగా ఇచ్చారు. ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా ఈ విరాళాన్ని స్పీకర్ అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. దేశ సాయుధ దళాలు ఉగ్రవాద నిర్మూలనలో చూపిస్తున్న ధైర్యం ప్రతీ భారతీయునికి గర్వకారణమన్నారు.

# తిరుమల సమాచారం

## వెంకన్న చెల్లెలు గంగమ్మకు టిటిడి సారె

### - గంగమ్మ ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా సహకారం

### - టిటిడి ఛైర్మన్ నాయుడు, ఇఒ శ్యామలరావు

**తిరుమల,మే 10ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి స్వయాన చెల్లెలైన తిరుపతి తాతయ్యగుంట గంగమ్మకు ఆనవాయితీగా సారె తీసుకువచ్చి సమర్పించడం జరుగుతుందని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. తిరుపతి పరిసరాల ప్రాంతాల ప్రజల ఆచార వ్యవహారాలను, వారి జీవనవిధనాలు ప్రతిబింబించేలా అపురూపంగా తిరుపతి గంగమ్మజాతర



జరుగుతుందని అన్నారు. తాతయ్యగుంట గంగమ్మజాతరలో నాల్గవరోజు శనివారం సాయంత్రం అమ్మవారికి పసుపు, కుంకుమ, పూలు, చీర, రవికె, పండ్లుతో సారె తీసుకువచ్చి సమర్పించారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు దంపతులు, టిటిడి ఇఒ శ్యామలరావు దంపతులు, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, శాంతారామ్, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, విఎస్ఒ సదాలక్ష్మి ఆలయ సాంప్రదాయంతో మంగళవాయిద్యాల నడుమ తిరుపతి గోవిందరాజస్వామి ఆలయం వద్ద నుండి సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి గంగమ్మ ఆలయం వద్ద తిరుపతి ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు, ఆలయ ఇఒ జయకుమార్‌కు అందజేశారు. త్వరలోనే 3.50కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని ఇఒ తెలిపారు. అమ్మవారికి సారె సమర్పించిన టిటిడి ఛైర్మన్ నాయుడు దంపతులుకు, ఇఒ శ్యామలరావు దంపతులుకు గంగమ్మ ఆలయ అర్చకులు అమ్మవారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# 13న కల్లి తండాకు జగన్

## మురళీనాయక్ కుటుంబానికి పరామర్శ

**విజయవాడ,మే10.ప్రభాతవార్తప్రతినిధి:** జమ్మూకశ్మీర్ లో వీర మరణం పొందిన మురళీ నాయక్ ఈ నెల 13న కల్లి తండాకు మాజీ సీఎం జగన్ వెళ్లనున్నారు. ఇప్పటికే మురళి కుటుంబాన్ని ఫోన్ ద్వారా పరామర్శించిన జగన్ జమ్మూకశ్మీర్ లో శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లి తండాకు చెందిన జవాన్ మురళీ నాయక్ వీర మరణం పొందారు. మురళి మృతిపై వైసీపీ అధినేత జగన్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు ఈనెల 13న జగన్ కల్లి తండాకు వెళ్లనున్నారు. ఇప్పటికే మురళి కుటుంబ సభ్యులను జగన్ ఫోన్ ద్వారా పరామర్శించి ధైర్యం చెప్పారు. మురళీ నాయక్ అగ్నివీర్ పథకం కింద మూడేళ్ల క్రితం ఆర్మీలో చేరారు. నాసిక్ లో శిక్షణ పొంది అసోంలో పని చేశారు. పాకిస్థాన్ తో యుద్ధం నేపథ్యంలో జమ్మూకశ్మీర్ లో విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పాక్ బలగాలను అడ్డుకునే ప్రయత్నంలో ఆయన వీర మరణం పొందారు. మురళి మృతి పట్ల అన్ని పార్టీల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.

# పిఠాపురం అనాధపిల్లలకు నా జీతం ఇస్తున్నా

### ప్రతి నెల ఇంటివద్దనే అందిస్తాం : డిసిఎం పవన్

**విజయవాడ,మే10,ప్రభాతవార్తప్రతినిధి:** పిఠాపురం నియోజకవర్గంలోని అనాథ పిల్లలకు తన వేతనాన్ని కేటాయిస్తున్నట్లు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. పదవి ఉన్నంత కాలం సాయం కొనసాగుతుందని పవన్ ప్రకటించారు. పిఠాపురం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఒక కీలక నిర్ణయాన్ని తన కార్యాలయం ద్వారా విడుదల చేసిన సమాచార పత్రంలోను, ఎక్స్ వేదికలోను ప్రకటించారు. ఎమ్మెల్యే తన వేతనాన్ని నియోజకవర్గంలోని అనాథ పిల్లల సహాయార్థం అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు. పిఠాపురం నియోజకవర్గ ప్రజలు ఎంతో నమ్మకంతో తనను శాసనసభ్యుడిగా గెలిపించారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడటం, సమస్యలను పరిష్కరించడం తన బాధ్యత అని పవన్ పేర్కొన్నారు. పిఠాపురం ప్రజలు ఇచ్చిన అధికారం ద్వారా వచ్చిన జీతాన్ని అక్కడే వినియోగించాలని ఆయన నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా, నియోజకవర్గ పరిధిలోని తల్లిదండ్రులు లేని పిల్లల భవిష్యత్తు కోసం ఆ మొత్తం ఇస్తున్నట్లు తెలిపారు. తాను పదవిలో ఉన్నంత కాలం వచ్చే జీతం మొత్తాన్ని ఆ పిల్లల సంక్షేమానికి విని యోగిస్తా నని ఆయన స్పష్టం చేశా రు. శుక్రవారం మంగళ గిరిలోని క్యాంపు కార్యాలయంలో పిఠా పురం



నియోజకవర్గానికి చెందిన 42 మంది అనాథ పిల్లలకు పవన్ కల్యాణ్ తన వేతనం నుంచి ఒక్కొక్కరికి నెలకు రూ. 5 వేల చొప్పున మొత్తం రూ. 2 లక్షల 10 వేల ఆర్థిక సహా యం అంద జేశారు. జీతంలో మిగి లిన మొత్తాన్ని కూడా వారి బాగోగులు చూసేందుకే ఖర్చు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న 32 మందికి పవన్ స్వయంగా సహాయం అందజేసినట్లు వివరించారు..

# హేతుబద్దీకరణ, ఆ తర్వాతే టీచర్ల బదలీలు,పదోన్నతులు

**విజయవాడ,మే 10,ప్రభాతవార్త ప్రతినిధి:** హేతుబద్దీకరణ, ఆ తర్వాతే టీచర్ల బదిలీలు, పదోన్నతులు అమలు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధ్యాయుల బదిలీల్లో ఈసారి పోస్టులను బ్లాక్ చేయకూడదని నిశ్చయించింది, పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. గత ప్రభుత్వంలో కొన్ని పోస్టులను బ్లాక్ చేయడం వల్ల ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. దాంతో ఈ సారి పోస్టుల హేతుబద్దీకరణ, బదిలీలు, పదోన్నతులను ఒక దాని తర్వాత మరొకటి నిర్వహిస్తారు. ఇప్పటికే సీనియారిటీ జాబితాలను సిద్దం చేశారు. పదోన్నతులు, బదిలీల ప్రక్రియనువిద్యాశాఖ చేపట్టింది. తొలుత పోస్టుల హేతుబద్దీకరణ ఉత్తర్వులను ఇవ్వనుంది. ఆ తర్వాత పదోన్నతులకు 1.2 విధానంలో జాబితా విడుదల చేసి, అభిప్రాయాలు తీసుకోనుంది. ఏదైనా పాఠశాలలో బదిలీ, పదోన్నతులతో 50%కంటే ఎక్కువ మంది ఉపాధ్యాయులు రిలీవ్ కావాల్సి వస్తే నూతన డిఎస్సీ ఉపాధ్యాయులు వచ్చే వరకు 50% పైన ఉన్న వారిని నిలిపివేస్తారు. ఇకజూన్ 5 నుండి 11 వరకు జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు. పాఠశాలల పునఃప్రారంభమైన వెంటనే వారం రోజుల పాటు విద్యార్థుల ప్రవేశాలకు బడిబాట కార్యక్రమం నిర్వహిస్తారు. జూన్ 28న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేస్తారు.

# ఉద్రిక్తతలకు బ్రేక్ పడినా తిరుమల తిరుపతిలో భద్రత పటిష్టం

### - అలిపిరి, విమానాశ్రయంలో భద్రతాదళాల నిఘా



**తిరుమల,మే 10ప్రభాతవార్తప్రతినిధి:** భారత్ –పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలకు, యుద్దానికి బ్రేక్ పడినా ప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రం తిరుమలతో బాటు తిరుపతి రేణిగుంటవిమానాశ్రయంలో భద్రత పటిష్టంగా అమలుచేస్తున్నారు. పూర్తిస్థాయిలో సిఐఎస్ఎఫ్ భద్రతా దళాలు, ఆక్టోపస్ బలగాలు, పోలీసులు డేగకళ్ళతో నిఘాను కొనసాగిస్తున్నారు. ముందుజాగ్రత్తగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రధానంగా తిరుమలకు చేరుకునే కీలకమైన అలిపిరి సప్తగిరి తనిఖీ కేంద్రం ప్రాంతంలో నిశితంగా తనిఖీలు చేస్తున్నారు. అనుమానం కలిగితే కొండకు వస్తున్న వారెవరు, ఎక్కడ నుండి వచ్చారు అనే వివరాలు రాబడుతున్నారు. ఇరుదేశాల సరిహద్దుల్లో శనివారం సాయంత్రం వరకు ఉద్రిక్తతలు తలెత్తడంతో తిరుమలలో భద్రతను పటిష్టంచేశారు. ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయం పరిసరాల్లో ఆక్టోపస్ దళాలు, ఏఆర్ పోలీసులు ఆయుధాలతో డేగకళ్ళతో పహారాకాస్తున్నారు. తిరుమలలోని జిఎన్‌సి టోల్‌గేట్, శ్రీవారి ఆలయం పరిసరాలు, యాత్రికుల వసతిసముదాయం 3వద్ద యాత్రికులు ఉన్నపుడు ఏదేని అవాంఛనీయసంఘటనలు జరిగితే ఎలా తప్పించుకోవాలి, ప్రాణాలు కాపాడుకోవడంపై విస్తృతంగా మాక్‌డ్రిల్ ద్వారా చూపించారు. తిరుమలకొండపై భద్రతా దళాలు నిరంతరంగా గస్తీ తిరుగుతున్నారు. పోలీసులు, విజిలెన్స్, ఆక్టోపస్ బలగాలు సంయుక్తంగా ఏరియా డామినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ గస్తీ ఆదివారంకూడా కొనసాగుతుందని పోలీసు వర్గాలు తెలిపాయి. అనుమానాస్పద వస్తువులు, బ్యాగ్‌ల తనిఖీలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ తనిఖీలు చేసి పటిష్టంగా భద్రతను అమలుచేస్తున్నారు. హైసెక్యూరిటీజోన్‌లో తిరుమల భద్రతను పెంచారు. అలాగే తిరుపతి యాత్రాస్థలంలో కూడా భద్రతా దళాలు, ఏఆర్ పోలీసులు, నిరంతరం గస్తీ ఉన్నారు. టిటిడికి చెందిన కార్యాలయాలు, వసతి సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాలు వద్ద భద్రతను డేగకళ్ళతో ఉంచారు. రేణిగుంట విమానాశ్రయంలోనూ భద్రతా దళాలు మాక్‌డ్రిల్ నిర్వహించి శనివారం ఉదయంనుండి మధ్యాహ్నం వరకు ప్రాణాలు కాపాడుకోవడంపై అవగాహన కల్పించారు. తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో జిల్లాయంత్రాంగం జిల్లా వ్యాప్తంగా భద్రతను పటిష్టం చేశాయి.

# పి4 పేరుతో పేదలకు అవమానం

### - దీర్ఘకాలిక విద్యుత్ ఒప్పందాలను రద్దుచేయాలి

### - సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు




**తిరుపతి,మే 10ప్రభాతవార్తప్రతినిధి:** పి4 పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నడుపుతున్న నాటకం పేదలను అవమానించడమేనని సిపిఎం పొలిట్‌బ్యూరోసభ్యుడు బివి రాఘవులు విమర్శించారు. దారిద్ర్యాన్ని నిర్మూలించే పేరుతో రాష్ట్రంలో చంద్రబాబు సాగిస్తున్న పథకం పి4 పేదలను అవమానించడమేనని అన్నారు. ప్రభుత్వ తన బాధ్యత నుండి తప్పుకుని పేదలను కార్పొరేట్ శక్తులకు అప్పజెబుతున్నాడని మండిపడ్డారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత పేరున కొన్ని కంపెనీలు కేటాయించే డబ్బులను కొన్ని కుటుంబాలకు ఖర్చుచేయడం ద్వారా దారిద్ర్యం రాష్ట్రంలో పోతుందనుకోవడం ఆయన భ్రమేనని దుయ్యబట్టారు. శనివారం తిరుపతిలోని సిపిఎం కార్యాలయంలో మీడియా ప్రతినిధుల సమా వేశంలో బివి రాఘవులు పలు అంశాలపై వివరించారు. పి4 పథకం అగరుబత్తి లాంటిదని, భక్తునికి భగవంతునికి అనుసం ధానం అగరబత్తి అనే ప్రకటన లాంటిదని ఎద్దేవాచేశారు. చంద్రబాబు వేదాంతం ప్రజలను అవమానం చేసేదని ఆయన తీవ్రంగా విమర్శించారు. కేంద్రప్రభుత్వం పత్రికా స్వాతంత్ర్యానికి, వాక్‌స్వాతంత్ర్యానికి, సభా స్వాతంత్ర్యానికి భంగం కలిగించే రీతిలో వ్యవహరిస్తున్నదని తాజాగా ది వైర్ పత్రికను బ్లాక్‌చేసిందని అన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌పైఅంతర్జాతీయ వేదికల ద్వారా ఒత్తిడి పెంచి ఒంటిపాలు చేయడానికి కేంద్రప్రభుత్వం నిర్ధిష్టచర్యలు తీసుకోవాలన్నారు. ఉగ్రవాదులను పాకిస్థాన్ భారత్‌కు అప్పగించేందుకు తోడ్పడే విధంగా ఈ ఒత్తిడి ఉండాలని రాఘవులు సూచించారు. మౌళికంగా సిపిఎం యుద్దానికి వ్యతిరేకమైనా ఎదుటివారు కవ్వింపు చర్యలకు పాల్పడుతూ, ఉగ్రవాద చర్యలకు పాల్పడటం చూస్తూ ఊరుకోమని దాని అర్ధంకాదన్నారు. ఆపరేషన్ కగారును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, చర్చలకు సిద్ధం అంటున్న మావోయిస్టుల విజ్ఞప్తిని ప్రభుత్వం అంగీకరించకుండా హత్యలు చేయడం దారుణమని రాఘువులు విమర్శించారు. తక్షణం కాల్పులు విరమించి మావోయిస్టులతో చర్చలు జరపాలని ఆయన కోరారు. విద్యుత్ కొనుగోలు పేరుతో ప్రైవేటు సంస్థలతో చేసుకుంటున్న దీర్ఘకాలిక ఒప్పందాలు ప్రజలపై తీవ్రమైన భారాన్ని కలిగించేవని, తక్షణం ఈ ఒప్పందాలనురద్దుచేసుకుని ,ప్రజలపై భారాలు లేకుండా చూడాలని సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. రోజురోజుకూ తెలుగుదేశంపార్టీ తన లౌకిక స్వభావాన్ని కోల్పోతుందని, కేంద్రంలోని బిజెపి ఏది చెబితే తాను తందానా అంటూ వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రాయలసీమ ప్రాంతంలో ఏనుగులు పొలాలపై పడి రైతులను తీవ్రంగా నష్టపరిచి, ప్రాణాలు తీస్తుంటే రాష్ట్రప్రభుత్వం మాటమాత్రంగా కూడా పట్టించుకోకపోవడం లేదని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో రాజధాని అమరావతి, పోలవరం తప్ప మిగిలిన సమస్యలన్నీ పూర్తిగా పాలకులు మరచిపోయారని ఇది బాధ్యతారాహిత్యమని అన్నారు.

# ఎక్స్‌రే అవార్డుకు కవితల ఆహ్వానం

**విజయవాడ మే 10,ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగు కవిత్వం అనేక ప్రాపంచిక పరిణామాలకు స్పందిస్తూనే ఉంది. అటువంటి కవిత్వాన్ని ఎక్స్ రే సంస్థ ప్రోత్సహిస్తుంది. అందులో గత నాలుగు దశాబ్దాలుగా తెలుగు వచన కవితా రంగంలో విశిష్ట స్థానాన్ని పొంది, నిరంతర సాహిత్య పాఠశాలగా వెలుగొందుతున్న ఎక్స్ రే జాతీయస్థాయి అవార్డుల కవితలను ఆహ్వానిస్తుంది. ప్రధాన అవార్డుకు ఎంపికైన కవితకు రూ. పదివేల నగదుతో పాటు జ్ఞాపిక, సత్కారం, మరో పది కవితలకు ఉత్తమ కవితా పురస్కారాలు ఇవ్వబడతాయి. చారిత్రక వికాసాన్ని క్రమ పద్ధతిలో పదిలపర్చే ఈ ప్రయత్నంలో కవులు పాల్గొని సహకరించగలరు. కవితా వస్తువు, పరిధి విషయాల్లో కవికి పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. సుదీర్ఘ కవితలు పరిశీలించబడవు. ఈ సంవత్సరం విజయవాడలో జరిగే సభలో ఈ అవార్డులు బహూకరించబడతాయి. కవితలు పంపేవారు ఖచ్చితంగా ఎక్స్ రే సంస్థలో చందాదారులుగా ఉండాలి. సంవత్సర చందా రూ.100/-లు ఎక్స్ రే పేరు, చిరునామా, కవితపై కాకుండా హామీ పత్రంపై మాత్రమే వ్రాయాలి

# అలిపిరిలో ప్లాస్టిక్ సీసాల కుప్పలు

**తిరుమల,మే 10ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకొండపై పర్యావరణ పరిరక్షణ లో భాగంగా ప్లాస్టిక్‌నీళ్ళ సీసాలు నిషేధం ఉండటంతో ప్రతిరోజూ వస్తున్న యాత్రికుల నీళ్ళసీసాలు అలిపిరిలో అనుమతించడంలేదు. దీంతో యాత్రికులు తమవెంట తీసుకువస్తున్న ప్లాస్టిక్‌నీళ్ళసీసాలను భద్రత సిబ్బంది తనిఖీ కేంద్రం వద్ద తీసిపడేస్తున్నారు. ఉదయం గంట సమయంలోనే ప్లాస్టిక్



నీళ్ళసీసాలు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వస్తువులు, ప్లాస్టిక్ కవర్లు నిషేధించింది. అయితే సామాన్యభక్తులు తాగునీటి సమస్య పరిష్కారంలో గాజుసీసాలు అమలుచేసింది. వీటివల్ల కొన్ని ఇబ్బందులు కలుగుతున్నాయి. అంతేగాక కొండపై గాజుసీసానీళ్ళబాటిల్ 55రూపాయల నుండి 65రూపాయల వరకు విక్రయిస్తున్నారు. నీటిని వాడుకున్న తరువాత ఖాళీగాజుసీసా ఏ దుకాణంలో ఇచ్చినా 30రూపాయలు తిరిగి భక్తులకు చెల్లిస్తున్నారు. దీనివల్ల లీటరునీళ్ళు 30రూపాయలుకు భక్తులు కొని తాగడం ఇబ్బందికరంగా మారింది. అలిపిరిలో ప్రోగవుతున్న టన్నుల కొద్దీ ప్లాస్టిక్ నీళ్ళసీసాలు కాంట్రాక్టర్లకు వరంగామారింది.

# ఐపిఎస్ అధికారి జాషువాకు హైకోర్టులో ఊరట, నోటీసు ఇచ్చి వివరణ తీసుకోమన్న న్యాయస్థానం

**విజయవాడ,మే 10,ప్రభాతవార్త ప్రతినిధి:** స్టోన్ క్రషర్ యాజమాన్యాన్ని విజిలెన్స్ తనిఖీల పేరుతో బెదిరించి లంచం వసూలు చేసిన కేసులో ఐపీఎస్ అధికారి పి.జాషువాకు హైకోర్టులో ఊరట లభించింది. ఆయనకు నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని ఏసీబీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. దర్యాప్తునకు సహకరించాలని కేసుకు సంబంధించిన వివరాలను బహిరంగంగా మాట్లాడవద్దని నివాస వివరాలను అఫిడవిట్ రూపంలో దర్యాప్తు అధికారికి అందచేయాలని జాషువాకు షరతులు విధించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లిఖార్జునరావు ఈ మేరకు ఉత్తర్వులిచ్చిరు. వైకాపా ప్రభుత్వ హయాంలో విజిలెన్స్ తనిఖీల పేరుతో తమను బెదిరించి రూ.2.20 కోట్ల అక్రమంగా వసూలు చేశారంటూ పల్నాడు జిల్లా యడ్లపాడు లోని శ్రీలక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్ మేనేజింగ్ భాగస్వామి ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా మాజీమంత్రి వడదల రజిని తదితరులపై ఏసీబీ కేసు నమోదు చేసిందిజ ఈ కేసైఉలో రెండో నిందితుడు జాషువా ముందస్తు బెయిలు కోసం హైకోర్టులో పిటీషన్ వేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ) మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపస్తూ పిటీషనర్ రూ.10 లక్షలు తీసుకున్నారనే అభియోగాలు ఉన్నాయన్నారు. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న విడదల గోపీని పోలీసులు అరెస్ట్ చేశారని, విచారణలో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ పిటీషనర్‌పై నమోదు చేసిన సెక్షన్లు ఏడేళ్ళ లోపు జైలు శిక్షకు వీలున్నవేనన్నారు. ఇదే కేసులో ఇద్దరు నిందితుల విషయంలో నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని ఇటీవల ఉత్తర్వులు ఇచ్చామని గుర్తు చేశారు. జాషువా విషయంలోనూ అదే ఉత్తర్వులు వర్తిస్తాయని స్పష్టం చేశారు. ఇక ఇదే కేసులో రిమాండులో ఉన్న విడదల గోపి బెయిలు కోసం హైకోర్టులో వేసిన పిటీషన్ను ఉపసంహరించుకున్నారు. బెయిలు కోసం కింది కోర్టును ఆశ్రయించనున్నామని, అందువల్ల హైకోర్టులో వేసి బెయిలు పిటీషన్ను ఉపసంహరించుకునేందుకు అనుమతి ఇవ్వాలని గోపి.

# ఇంద్రకీలాద్రిలో 12న గిరి ప్రదక్షిణ

**ఇంద్రకీలాద్రి, మే 10, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఇంద్రకీలాద్రికి ఈనెల 12న వైశాఖ మాసం పౌర్ణమి సందర్భంగా ఉదయం 5.55 గంటలకు గిరి ప్రదక్షణ నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఘాట్‌రోడ్డు వద్ద వేంచేసియున్న శ్రీ కామధేను అమ్మవారి ఆలయం వద్ద ఈ ప్రదక్షణ ప్రారంభమై విద్యాధరపురం, కుమ్మరిపాలెం, నాలుగు స్తంబాల సెంటర్, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి మీదుగా తిరిగి ఇంద్రకీలాద్రికి చేరుకుంటుని ఇఓ వివరించారు.

# ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత

### - టిటిడి ఉద్యోగులకు ఉచితంగా హెల్మెట్లు అందజేసిన ఛైర్మన్ నాయుడు

**తిరుమల,మే 10ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతిరోజూ లక్షమందివరకు భక్తులు తిరుమలకు వస్తున్నా వారికి చిన్నపాటి అసౌకర్యం, ఇబ్బందులు కలగకుండా సేవలందిస్తున్న ఉద్యోగుల సంక్షేమానికి టిటిడి దర్మకర్తలమండలి, అధికారులు ప్రాధాన్యతనిస్తున్నట్లు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. నిత్యం తిరుమలలో విధుల నిర్వహణకు తిరుపతి నుండి తిరుమలకు



రావడం, తిరిగి తిరుపతికి వెళ్ళడం చేస్తున్న ద్విచక్రవాహనదారులైన ఉద్యోగుల భద్రతకోసం హెల్మెట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులు ఘాట్‌రోడ్లలో ప్రయాణసమయంలో భద్రతకోసం తగిన చర్యలు తీసుకుంటూ, వారికి హెల్మెట్లు అందించామన్నారు. తొలివిడతలో 5లలక్షల రూపాయలు విలువైన 555హెల్మెట్లు గుంటూరుకు చెందిన జలాది రఘురామ్, ఢిల్లీకి చెందిన కెసిఎన్ హెల్మెట్ల తయారీ సంస్థ అధినేత నవీన్ ముందుకువచ్చారన్నారు. 15రోజుల్లో మరో 500 హెల్మెట్లు వస్తాయని చెప్పారు. వీటిని పరిశీలించి బాగున్నాయని తెలిపితే మరో ఐదువేల హెల్మెట్‌లు అందజేస్తారని ఛైర్మన్ నాయుడు తెలిపారు. శనివారం ఉదయం తిరుమలలోని ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఛైర్మన్ బిఆర్‌నాయుడు, విజిలెన్స్ సిఎస్ఒ ఎస్వీవి రామ్‌కుమార్, సురేంద్ర, బోర్డుసభ్యుడు శాంతారామ్‌తో కలసి పంపిణీ చేశారు.

రాష్ట్రంలో మొత్తం 33 జిల్లాలుండగా, ఒక్క జిల్లాలో కూడా 0-5మీటర్ల లోతులోలేవు. అంటే ఏజిల్లాలో నీటి మట్టాలు సురక్షితంగా పరిస్థితుల్లో లేవన్నమాట. భూగర్భ జలాలు సంరక్షణ లేకపోవడంతో పరిస్థితి ఎంత దారుణంగా తయారైందో నివేదిక చూస్తే తెలిసిపో తుంది. మరోవైపు రాష్ట్రంలో 33 జిల్లాలో 18జిల్లాలో 5-10మీటర్ల లోతులో నీటి మట్టాలు ఉన్నాయి. 11 జిల్లాలో 10 నుంచి 15 మీటర్ల లోతులో ఉన్నయి. నాలుగు జిల్లాలో 15 మీటర్ల లోతులో నీటి మట్టాలు ఉన్నాయి. ఈ నాలుగు జిల్లాల పరిస్థితి దయనీయంగా మారింది. 15 జిల్లాల్లో సైతం ఇలాంటి పరిస్థితులు నెలకొని ఉన్నాయి. గతఏడాది ఏప్రిల్ నెలతో పోల్చి చూస్తే ఈ ఏడాది ఏప్రిల్ నెలలో రాష్ట్రంలోని 16 జిల్లాల్లో భూగర్భ జలమట్టాల్లో భారీగా పడిపోయియి. భూగర్భజలాలు గత కొన్ని సంవత్సరాలతో పోల్చి చూస్తే తగ్గుకుంటూ పోతున్నాయి. ప్రస్తుతం సంవత్సరం 3452 చదరపు కిలోమీటర్ల లోతుల్లోకి చేరుకుంది. అత్యంత లోతుల్లో అంటే 20మీటర్లకి మించిన లోతు ఉన్న జలాలున్న ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయి. మే 2024 తో పోల్చితే ఏప్రిల్ 2025లో, 1,262 చదరపు కిలోమీటర్ల నుంచి 3.452 చదరపు కిలోమీటర్ల మేర పెరిగింది. 2015-2024తో పోల్చి చూస్తే మాత్రం ఏప్రిల్‌లో అత్యంత లోతుల్లో భూగర్భ జలాలున్న ప్రాంత విస్తీర్ణం 5,527 చద రపు కిలోమీటర్ల నుంచి4,714 చదరపు కిలోమీటర్లకు తగ్గింది. రంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలో వికారాబాద్ యాదాద్రి జిల్లాల్లోని ఉత్తర, దక్షిణ ప్రాంతాలు, నాగర్‌కర్నూలు, జిల్లాలోని దక్షిణాది ప్రాంతాలు, నిర్మల్, సిద్ధిపేట, సిరిసిల్ల జిల్లాల్లోని పశ్చిమప్రాంతాలు, భూపాలపల్లి జిల్లాలోని ఉత్తర, భద్రాద్రి జిల్లాలోని ఆగ్నేయప్రాంతాల్లో అత్యంత ప్రమాదకర స్థాయికి జలమట్టాలు పడిపోయాయని భూగర్భజలశాఖ తననివేదికల్లో వెల్లడించింది.

# భూగర్భజలాల పరిరక్షణే తక్షణ కర్తవ్యం

**తిరుమల రావు**

రాష్ట్రవ్యాప్తంగా భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. ఎండలు మండిపోతుండడంతో తాగునీటి, సాగునీటికి ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. భూగర్భజలాల పరిరక్షణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రానున్న రోజుల్లో మరింత నీటి ఎద్దడి తప్పేలా లేదు. ఇప్పటికే సాగు,తాగు, అన్ని అవసరాలకు బోరుబావుల నుంచి నీళ్లను విచ్చల విడిగా తోడుతుండడంతో భూగర్భ జలాలలు గతంలో ఎన్నడూ లేనివిధంగా వేగంగా పడిపోతున్నాయి. భూగర్భజలాల పరిరక్షణ విషయంలో ప్రభుత్వంతో పాటు ప్రతి ఒక్కరి బాధ్యత ఉంది. భూగర్భజల్లాల పరిరక్షణకు ఇంకుడు గుంతలు నిర్మించడమే ఏకైక మార్గం. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత నిర్మించేలా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటే నీటి మట్టాలు పడిపోయే పరిస్థితి ఉండదు. వర్షపు నీటిని ఒడిసిపట్టుకుంటే రానున్న రోజుల్లో కూడా నీటి ఎద్దడి అంటూ ఉండదు. మరోవైపు గ్రామాల మొదలు పట్టణాల వరకు ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టకపోగా, విచ్చిల విడిగా బోరుబావులు తవ్వుతున్నారు. ఈ బోరు బావుల నుంచి విచ్చలవిడిగా నీటిని తోడేస్తున్నారు. దీంతో నీటి సమస్యలు తీవ్రతరం అవుతుంది. గత యేడాది డిసెంబరు నెలలో 6.7 మీటర్ల లోతుగా ఉన్న రాష్ట్ర సగటు భూగర్భ జలమట్టాలు క్రమంగా తగ్గతూ ఈ సంవత్సరం జనవరిలో 1.46 మీటర్లు, ఫిబ్రవరి నెలలో 8.88 మీటర్లు, మార్చినెలలో 9.91 మీటర్ల లోతుకు పడిపోయాయి. ఏప్రిల్ నెలల మరింత దిగజారి 10.17 మీటర్లకు చేరుకున్నాయి. డిసెంబర్ నెలతో పోల్చిచూస్తే ఏప్రిల్ నెలనాటికి ఏకంగా 3.47 మీటర్ల మేర భూగర్భ జలమట్టాలు పడిపోవడం ఆందోళన కలిగిస్తుంది. మార్చినెలతో పోల్చితే ఏప్రిల్ నాటికి కేవలం నెల రోజుల వ్యవధిలో 0.23 మీటర్ల మేర నీటి మట్టాలు పడిపోయాయి. ప్రస్తుత మే నెలలో మరింత అధ్వాన్న స్థితికి చేరుకున్నాయి. చాలా ప్రాంతాలలో బోరుబావులు ఎండిపోయాయి. తాగు నీటికి, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండలు మరింత ముదిరి రాబోయే రోజుల్లో తాగు, సాగు నీటి అవసరాలు, ఇతర అవసరాలు పెరిగి వేసవి ముగిసేలోగా భూగర్భ జల మట్టాలు గతంలో ఎన్నడూ లేని విధంగా మరింత పడిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. భూగర్భ జలవనరుల శాఖ ఏప్రిల్లో రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో భూగర్భ జలాల స్థితిగతులను పరిశీలించి నివేదిక తయారు చేసింది. జలవనరుల శాఖ రూపొందించిన నివేదికలో పలుకీలక అంశాలు వెల్లడించింది. రాష్ట్రంలో భూగర్భ జలాల పరిస్థితి రోజురోజుకు పడిపోతున్నాయని, ఇదే పరిస్థితి



కొనసాగితే రానున్న రోజుల్లో నీటికి ఎన్నడూ లేనివిధంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడవచ్చునని, ముందస్తు చర్యలు తీసుకుని, నీటిని సంరక్షించుకోకపోతే మరింత కష్టాలు తప్పవని సూచించింది. వర్షాలు కురిసినప్పుడు నీటిని సంరక్షించుకునే విషయంలో తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రధానంగా నీటి సంరక్షణకు ఇంకుడు గుంతల నిర్మాణం ఏకైక మార్గం, అంతేకాకుండా నీటిని వృధాకానియ్యకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. నీటి సంరక్షణకు చర్యలు తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని, నిర్లక్ష్యం వహిస్తే ప్రతి సంవత్సరం నీటి సమస్యలు ఎదుర్కొకతప్పదు. రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భజల శాఖ తయారు చేసిన నివేదికలో రాష్ట్రంలోనే అత్యధికంగా వికారాబాద్ జిల్లాలో 16.6 మీటర్ల లోతుకు భూగర్భ జల మట్టాలు పడిపోయాయని స్పష్టంగా పేర్కొంది. ఇక జగిత్యాల జిల్లాలో అత్యల్పంగా 5.57 మీటర్లలోతులో నీరు అందుబాటులో ఉందని పేర్కొంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో భూగర్భ జలాలలను సగటుగా 0-5 మీటర్లు, 5-10 మీటర్లు, 10 మీటర్లపైన లోతు అంటూ మూడు విభాగాలుగా విభజించారు. భూగర్భ జలాలు 5 మీటర్ల లోపు లోతుల్లో ఉంటే నీటి మట్టాలు సురక్షిత స్థాయిలో ఉన్నట్టు తేలుస్తారు. రాష్ట్రంలో మొత్తం 33 జిల్లాలుండగా, ఒక్క జిల్లాలో కూడా 0-5 మీటర్ల లోతులో లేవు. అంటే ఏ జిల్లాలో నీటి మట్టాలు సురక్షితంగా పరిస్థితుల్లో లేవన్నమాట. భూగర్భ జలాలు సంరక్షణ లేకపోవడంతో పరిస్థితి ఎంత దారుణంగా తయారైందో నివేదిక చూస్తే తెలిసిపో తుంది. మరోవైపు రాష్ట్రంలో 33 జిల్లాలో 18 జిల్లాలో 5-10మీటర్ల లోతులో నీటి మట్టాలు ఉన్నాయి. 11 జిల్లాలో 10 నుంచి 15 మీటర్ల లోతులో ఉన్నయి. నాలుగు జిల్లాలో 15 మీటర్ల లోతులో నీటి మట్టాలు ఉన్నాయి. ఈ నాలుగు జిల్లాల పరిస్థితి దయనీయంగా మా రింది. 15 జిల్లాల్లో సైతం ఇలాంటి పరిస్థితులు నెలకొని ఉన్నాయి. గతఏడాది ఏప్రిల్ నెలతో పోల్చి చూస్తే ఈ ఏడాది ఏప్రిల్ నెలలో రాష్ట్రంలోని 16 జిల్లాల్లో భూగర్భ జలమట్టా ల్లో భారీగా పడిపోయియి. భూగర్భ జలాలు గత కొన్ని సంవత్సరాలతో పోల్చి చూస్తే తగ్గుకుంటూ పోతున్నాయి. ప్రస్తుతం సంవత్సరం 3452 చదరపు కిలోమీటర్ల లోతుల్లోకి చేరుకుం ది. అత్యంత లోతుల్లో అంటే 20మీటర్లకి మించిన లోతు ఉన్న జలాలున్న ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయి. మే 2024 తో పోల్చితే ఏప్రిల్ 2025లో, 1,262 చదరపు కిలోమీటర్ల నుంచి 3.452 చదరపు కిలోమీటర్ల మేర పెరిగింది. 2015 -2024తో పోల్చి చూస్తే మాత్రం ఏప్రిల్‌లో అత్యంత లోతుల్లో భూగర్భ జలాలున్న ప్రాంత విస్తీర్ణం 5,527 చదరపు కిలోమీటర్ల నుంచి4,714 చదరపు కిలోమీటర్లకు తగ్గింది. రాష్ట్రంలో పలుజిల్లాల్లో ప్రమాదకర స్థాయిలోనీటి మట్టాలు పడిపోయాయి. రంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలోవికారాబాద్ యాదాద్రి జిల్లాల్లోని ఉత్తర, దక్షిణ ప్రాంతాలు, నాగర్‌కర్నూలు, జిల్లాలోని దక్షిణాది ప్రాంతాలు, నిర్మల్, సిద్ధిపేట, సిరిసిల్ల జిల్లాల్లోని పశ్చిమ ప్రాంతాలు, భూపాలపల్లి జిల్లాలోని ఉత్తర, భద్రాద్రి జిల్లాలోని ఆగ్నేయ ప్రాంతాల్లో అత్యంత ప్రమాదకర స్థాయికి భూగర్భ జలమట్టాలు పడిపోయాయని భూగర్భజల శాఖ తన నివేదికల్లో వెల్లడించింది. ఈ ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు 15-20 మీటర్ల మధ్య, కొన్నిచోట్ల 20 మీటర్లకన్నా లోతుకు వెళ్లాయి. రాష్ట్రంలో 172 మండలాల్లో 0.01 మీటర్ల నుంచి 25.80 మీటర్ల వరకు గణనీయంగా క్షీణించాయి. 41 మండలాల్లో 0.5 మీటర్ల వరకు, 34 ముండలాల్లో 0.5 మీటర్ల నుంచి మీటర్ల వరకు, 43 మండలాల్లో 12 మీటర్ల మేర, 54 మండలాల్లో 2 మీటర్లకు పైగా పడిపోయాయి. హైదరాబాద్ నగరానికి నగరానికి నీటి ఎద్దడి పొంచి ఉంది. ఎండలు మండుతుండడంతో రిజర్వాయర్లలో నీటి మట్టాలు పడిపోతున్నాయి. గడిచిన 15 రోజులుగా వివిధ రిజర్వాయర్‌లలో నీటి మట్టాలు ఘణనీయంగా తగుముఖం పట్టాయి. ప్రజలకు తాగునీటిలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు రిజర్వాయర్ల వద్ద పంపింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు చేపట్టారు. నాగార్జునసాగర్‌లో నీటిమట్టం 510 అడుగులకు పడిపోయినప్పుడు అత్యవసర పంపింగ్ చేపట్టేందుకు సిద్ధం చేస్తున్నారు. హైదరాబాద్ నగర ప్రజల అవసరాలకు రోజుకు 581 మిలియన్ గ్యాలెన్ల నీరు అవసరం అవుతుండగా, ప్రస్తుతం కృష్ణా మూడు దశల నుంచి 270 ఎంజిడిల నీటిని తీసుకుంటుండగా, గోదావరి ప్రాజెక్టు ఎల్లంపల్లి నుంచి ప్రతి రోజు 183 ఎండిజిటల నీటిని తీసుకుంటున్నారు. గత యేడాది నాగార్జున సాగర్ నీటి మట్టం 505 అడుగులు ఉండగా, శ్రీశైలం వద్ద 808 అడుగులు ఉండగా, ప్రస్తుతం నాగార్జునసాగర్ వద్ద 514, శ్రీశైలం వద్ద 815 అడుగులు ఉన్నాయి. సాధారణంగా వర్షాలు కురిసి సాగర్‌లోకి కొత్త నీటి రావడం ఆగస్టు నుంచి ప్రారంభం అవుతుంది. ఈ నేపథ్యంలో వర్షాలు కురిసి, పరిస్థితులు మెరుగుపడే వరకు పంపింగ్ ప్రక్రియ తప్పేలా లేదు. 2016లో పంపింగ్ ప్రక్రియను చేపట్టారు. ఆ తరువాత 2024లో జూన్‌లో, ప్రస్తుత సంవత్సరం మే నెలలో పంపింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. ●

---

# నవ 'సిందూరం'..

**ఎ.వి.వి ప్రసాద్**

స్మృతి

న్యూఢిల్లీ

ఏ నోట విన్నా.. ఏ చోట ఉన్నా ఇప్పుడు అంతా 'సిందూర' మే. సిందూర వర్ణ కాంతులే దేశంలో అడుగడుగునా ఆవిష్కృతమవుతున్నాయి. ఆ సిందూరం వెనుక ముష్కరులను అణిచివేసే ప్రతీకారం ఉంది, పక్క వారికోసం ప్రాణాలిచ్చే ప్రేమానురాగాలూ ఉన్నాయి. ప్రజలను పీడించే రక్కసులను అంతమొందించడానికి దుర్గాదేవిఅవతరించి లోకానికి శాంతి అందించిందని పురాణాలలో విన్నాం. ఇప్పుడు ' సిందూరం' కూడా ఆ బాధ్యతే తలకెత్తుకొంది. సిందూరం భారతీయ మహిళకు ఒక సెంటిమెంట్. నొసట ఆ కాంతి లేకుండా ఏ నవ వధువు, ఏ గృహిణి కనిపించదేమో! సిందూరం మహిళలకు రక్షాబంధనం. అందుకే.. ఆ పేరుతోనే ఉగ్ర ముష్కరులను చీల్చి చెండాడే బృహత్తర కార్యక్రమం ఆరంభమైంది. ఏప్రిల్ 22న పహల్గాంలో కొందరు పాక్ ప్రేరేపిత ఉగ్ర ముష్కరులు జరిపిన ఊచకోత అనంతరం కేవలం సంతాప సందేశాలకు పరిమితం కాకుండా, మరోసారి ఎటువంటి ఉగ్రవాది భారత్ వైపు కన్నెత్తి చూడకుండా స్పష్టమైన సమాధానం చెప్పింది కేంద్ర ప్రభుత్వం. దాడి ఘటన జరిగి రెండు వారాలు తిరిగే లోగా గత మంగళవారం ( 6,మే ) అర్ధరాత్రి తర్వాత ఎవరూ ఊహించని విధంగా, ఎక్కడినుంచైతే పహల్గాం దాడికి వ్యూహం తయారయిందో సరిగ్గా అక్కడే ఉగ్ర ముష్కరులను అంతమొందించే ప్రక్రియకు భారత్ సైనికులు శ్రీకారం చుట్టారు. అదే 'ఆపరేషన్ సిందూర్'. 26 మంది పర్యాటకులను వారి భార్యల నుంచి విడదీసి, వారు చూస్తుండగానే,వారు విలపిస్తూండగానే తమ తుపాకులకు బలి చేసిన ముష్కరులను' సిందూరం' ఏరిపారేసింది. వందమందో, రెండువందలమందో.. ఆ లెక్కలు పక్కన పెడితే, మొత్తానికి పెద్ద సంఖ్యలోనే 'శత్రువు' ను మట్టుబెట్టింది. అయితే ఈ సంహార కాండ అక్కడితో పూర్తి కాలేదు. మొత్తం ఉగ్ర వ్యవస్థనే వేళ్లతో పెకలించే ప్రక్రియ కూడా అప్పుడే ఆరంభమయింది. అది కొనసాగుతూనే ఉం టుంది. ఆ 'సిందూరం' మెరుస్తూనే ఉంటుంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత శత్రువు ఊహించని విధంగా దెబ్బ కొట్టడమేగాక, పాక్‌తో యుద్ధ వాతావరణం నెలకొన్న పరిస్థితిలో దేశ పౌరులను కూడా అందుకు మానసికంగా సిద్ధం చేసింది ప్రభుత్వం. మాక్‌డ్రిల్స్ అందులో భాగమే.ప్రజలందరూ ప్రభుత్వ భవిష్యత్ కార్యాచరణను ఊహించుకొంటూండగానే, కేవలం 24 నిముషాల వ్యవధిలో పాక్‌లోని 9 ఉగ్ర స్థావరాలను సైన్యం నేలమట్టంచేసింది. ఉగ్రదాడి ఎప్పుడు జరిగినా మన సైనికులు తట్టుకొని నిలబడడమే గాక తగినవిధంగా పాక్‌కు బుద్ధిచెబుతూనే



యుద్ధం

వస్తున్నారు. అయితే ఈ సారి 'సిందూరం' మరింత కొత్త కాంతిని ప్రసరిస్తోందనిపిస్తుంది. దేశ ప్రజలందరిలో సెంటిమెంట్‌తో పాటు, దేశభక్తిని కూడా మరింత పెంచుతోంది. యువకులే కాదు, దేశంలోని ప్రతి వ్యక్తి ముష్కర మూకలను దునుమాడడానికి 'సిందూరం' ధరిస్తున్నారు. ప్రతి వ్యక్తి ఒక సైని కుడులా మారుతామని, ఉగ్రవాదులను అంత మొందిస్తామనీ ప్రతిజ్ఞ చేస్తున్నారు. పాఠశాలల్లో చదివే బాలబాలికలు సైతం వీర సైనికులకు సంఘీభావంగా రోడ్లపైకి వచ్చి ప్రదర్శనలు జరుపుతున్నారు. తాము కూడా సైనికులం అవుతామంటున్నారు. కుల, మతాతీతంగా దేశంలోని ప్రజలందరూ ఒకే బాటలో కదులుతున్నారు. పహల్గాం దాడిలో తండ్రిని కోల్పోయిన తనూజ్ కుమార్ సత్పతి అనే తొమ్మిదేళ్ల బాలుడు ఉగ్ర స్థావరాలపై సైనిక చర్య ఘటనకు స్పందిస్తూ 'భారత సైన్యంలో చేరి ఉగ్రవాదులను అంతం చేయడానికి నేనూ పోరాడుతా' అని అన్నాడంటే పిల్లల్లో సైతం ఉగ్రవ్యతిరేక ప్రతీకారేచ్ఛ ఎలా ఉన్నదో, దేశభక్తి ఎలా పొంగి పొర్లుతున్నదో అర్థమవుతుంది. అటువంటి బాలలు ఒకరిద్దరు కాదు, దేశంలో అనేక ప్రాంతాల నుంచి అటువంటి ' బాలవాక్కు' వినిపించింది. రేపు అదే బ్రహ్మవాక్కుగా కూడా మారుతుంది. ఒడిశాలోని బాలాసోర్ కు చెందిన ఆ బాలుడు స్ఫూర్తిగా ఎందరో 'సిందూరం' ధరించారు. అదే ప్రతిజ్ఞ చేశారు.'మా సైన్యాన్ని చూసి మేం గర్వపడుతున్నాం, ఆ సైన్యంలో మేమూ భాగస్వాములవుతాం' .. అందరి నోటి నుంచి ఇదే మాట ఇప్పుడు వినిపించడంప్రజల్లో దేశభక్తి ఎలా పెరిగిందో చెప్పడానికి నిదర్శనం. భారతీయ సంప్రదాయంలో వివాహిత మహిళలకు సిందూరం ఎంత ముఖ్యమైనదో తెలియజెప్పే విధంగా, ఆ సిందూరాన్ని మహిళలకు దూరం చేసిన ముష్కరులను అంతమొందించడానికి ప్రధానిమోడీ ఈ ఆపరేషన్ కు'సిందూర్' అనే పేరు పెట్టడాన్ని కూడా దేశమంతా ఎంతో అభినందించింది. అంతేకాదు.. సిందూర్ ఆపరేషన్ మొదలైనప్పటినుంచి జన్మిస్తున్న పిల్లలకు కూడా దేశంలో పలుచోట్ల అదే పేరు పెడుతున్నారట. మొదటి రోజునే 62 మంది ఆడ పిల్లలకు సిందూరి అనీ,మగ పిల్లలకు సిందూర్ అనీ పేర్లు పెట్టినట్లు వార్తలు వినిపించాయి. అంతేకాదు.. కొన్ని ఇతర మతాల మహిళలు కూడా నుదుట సిందూరం ధరించి కనిపించారట. కర్ణాటక సిఎం సిద్దరామయ్య ఆ మర్నాడు బెంగళూరులో మీడియా సమావేశానికి సిందూరం ధరించి వచ్చారు. ఎప్పుడూ తిలకమైనా పెట్టుకోని ఆయన ఇప్పుడు సిందూరం ధరించి కనిపిస్తున్నారు. సిందూర వర్ణం దుస్తులు ధరించేవారు కూడా ఇప్పుడు ఎక్కడ చూసినా అధికమయ్యారు. ఇంకొంచెం ఆసక్తి కరమైన విషయం.. సిందూర్ టైటిల్ ను 30 మంది తెలుగు సినీ నిర్మాతలు వెంటనే రిజిస్టర్ చేయించారట. ఆ టైటిల్ కోసం సినీ నిర్మాతలలో కూడా ఇప్పుడు గట్టిపోటీ కనిపిస్తోందంటే ఆ పదానికి ఉన్న ప్రభావం ఎంతటిదో అర్థమవుతుంది. చిటికెడంత సిందూరం ఆడపడుచుకు ఆకాశమంత భరోసా ఇస్తుంది. అది పాపిట మధ్య చేసుకునే అలంకరణే కాదు.. ఇక దేశంలోని ప్రజలందరికీ రక్షా రేఖ కూడా.. ●

---

# హింసకు సూత్రధారి!

**గన్ని మోహన్**

కథనం

పాకిస్థాన్

సరిహద్దుల్లో భీకరపోరు. శాంతి సామరస్య వాతావరణంలో కొనసాగాల్సిన ఇరుగుపొరుగుదేశాలు ఇపుడు చావోరేవో తేల్చుకునే దశకు చేరాయి. గడచిన మూడురోజులుగా పాకిస్థాన్, భారత్ సరిహద్దుల్లో జరుగుతున్న హింస ఇదే. ఇందుకు కారణం ఎవరు? ఎందుకు ఈపరిస్థితులు ఇలాగే కొనసాగుతున్నాయి?ఉద్రిక్తతలను తొలుత రెచ్చగొట్టింది ఎవరు? ఇవన్నీ పరిశీలించుకుంటే కరుడు గట్టిన మత ఛాందస వాదం, ప్రభుత్వంమొత్తాన్ని తన అదుపులోకి ఉంచుకున్న మిలిటరీ చీఫ్ అనిచెప్పక తప్పదు. జమ్ముకాశ్మీర్, గుజరాత్, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల వెంబడి సుమారు 3300 కిలోమీటర్లమేర విస్తరించిన ఈ సరిహద్దు వెంబడి చొరబాట్లు, మిలిటెంట్ కార్యకలాపాలు ఈనాడే కొత్తగా జరుగుతున్నవికాదు. పొరుగు దేశం ఆర్మీ ప్రోత్సాహం, అండదండలతో యథేచ్ఛగా కొనసాగించిన ఈ మిలిటెంట్ కార్యాచరణ గడచిన పదేళ్లలో కట్టుదిట్టం చేయడంతో గణనీయంగా తగ్గింది. తిరిగి రెండుమూడేళ్లనుంచి మళ్లీ పెరుగుతూ వచ్చింది. అందుకు కారణం పొరుగుదేశం పాకిస్థాన్‌లో మారుతున్న మిలిటరీ చీఫ్‌లేనని చెప్పాలి. ప్రస్తుత మిలిటరీ చీఫ్ సయ్యద్ ఆసిమ్ మునీర్ అహ్మద్‌షా ఒకప్పటి ఇంటిలిజెన్స్ చీఫ్‌గా పనిచేసిన అధికారి. అంచలంచెలుగా తన వ్యూహాలను పదునుపెట్టుకుంటూ మారుతున్న ప్రభుత్వాలకు అనుగుణంగా ఎదుగుతూ వచ్చాడు. నియంతృత్వం, జీహాదీ వైఖరి,మొత్తం సాయుధ బలగాలపైపట్టు సాధించేందుకు ఎంతస్థాయికైనా వెళ్లిపోయే మునీర్ ఇమ్రాన్ హయాంలో అతితక్కువ కాలం పని చేసాడు.అప్పటిప్రధాని ఇమ్రాన్ భార్య బుస్రా బీబీ అవినీతికార్యకలాపాలను బయటపెట్టేందుకు ప్రయత్నించడంతో అప్పటి మిలిటరీ చీఫ్‌క్వామర్ జావేద్ బాజ్వా ఐఎస్‌ఐచీఫ్‌గా తొలగించారు. తిరిగి సంకీర్ణ ప్రభుత్వం రావడం, ఇమ్రాన్‌కు వ్యతిరేకంగా పనిచేసిన ఘనత సాధించడంతో షెహబాజ్‌షరీఫ్ ప్రభుత్వం కీలక పదవులన్నింటినీ అప్పగించడంతోపాటు ఏకంగా ఆర్మీచీఫ్ పదవినే కట్టబెట్టింది. భారత్‌పై నిరంతరం అక్కసు వెళ్లగక్కే పాకిస్తాన్‌కు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌తోపాటు ఇపుడు భారత్ అధీనంలో ఉన్న కాశ్మీర్‌ను కూడా చేజిక్కించుకోవాలన్న లక్ష్యమే కనిపిస్తుంది. ఈవిధంగా 1971లో జరిగిన యుద్ధం కానీ, 1965లో జరిగిన భీకర దాడులు కాని ఆనాటి ఆర్మీచీఫ్‌ల ఆధ్వర్యంలో జరిగినవే. భారత్‌పై దాడులను ప్రోత్సహించడంలో ఆసిమ్ మునీర్ హస్తం పరోక్షంగా పనిచేస్తుందన్నది భారత నిఘా సంస్థలు కూడా గుర్తించాయి. 2019 ఫిబ్రవరి 14వ తేదీ ఆర్మీ కాన్వాయ్‌పై పేలుడు సామగ్రితో ఉన్న ఒక కారులోని ఆత్మాహుతి జీహాదిలు పేల్చి వేయడంతో 40 మందికిపైగా మన సైనికులు ప్రాణత్యాగంచేసారు. ఈ ఘాతుకానికి కుట్రలు చేసిన ఆదిల్ అహ్మద్‌ధర్ నేతృత్వం వహించినా తదనంతర గాలింపుల్లో అతడితోపాటు ఆరుగురు హతమయ్యారు. అయితే ఈ కాన్వాయ్‌పేలుడుకు



ఆసిమ్ మునీర్

సంబంధించిఅప్పటి ఐఎస్ఐ చీఫ్‌గాఉన్న ఆసిమ్ మునీర్ ప్రత్యక్ష, పరోక్ష హస్తం ఉందనేది నిర్వివాదాంశం. బాహ్యప్రపంచానికి జైషెముహ్మద్ ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పేర్కొంటున్నా కర్త, కర్మక్రియ అంతా కూడా మునీర్ కనుసన్నల్లోనే జరిగింది.కాశ్మీర్ మన జీవనాడి అని అది ఎప్పటికీ పాకిస్థాన్ భూభాగంలోనిదేనని, మన కాశ్మీర్ ముస్లిం సోదరులను మనం పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని, అందుకు పాకిస్థాన్ నిరంతరం సంపూర్ణ మద్దతునిస్తూంటుందని చేసిన ప్రసంగాలే సరిహద్దుల్లో చొరబాట్లకు, పాక్‌సైన్యం కాల్పులకు దారితీసిందన్నది నగ్నసత్యం.ఇందుకు ఆర్మీచీఫ్‌గా ఆసిమ్ మునీర్ కనుసన్నల్లోనే ఇదంతా జరిగింది. ఇప్పుడు మొత్తం 11పైగా ఉన్న మిలిటరీ, వైమానిక, నావికా స్థావరాలపై దాడులకు ఉపక్రమించే వ్యూహం కూడా ప్రస్తుత పాక్ ఆర్మీచీఫ్ దే. ఖురాన్‌ను అలవోకగా పఠించగలిగే నైపుణ్యం ఉన్న మునీర్ ముందునుంచి ఇస్లామిక్‌భావజాలం పుణికిపుచ్చుకున్న వ్యక్తి. మిలిటరీలో అంచలంచెలుగా ఎదుగుతున్నా కాశ్మీర్‌పైనే తన ధ్యాసనంతా పెట్టినట్లు తెలుస్తోంది. ఆర్మీచీఫ్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి కూడా సరిహద్దుల్లో కాల్పులు సంఘటనలు పెరిగాయి. మిలిటెంట్లు చొరబడేందుకు విఫలయత్నాలు ఎక్కువ జరిగాయి. తాజాగా పహల్గాంవ్ ఉదంతంతో ఇక భారత్ ఓర్పు,సహనం పరీక్షించిన పాక్ గుణపాఠం చెప్పేందుకు సిద్ధం కావడంవల్లనే నేటి భీకర దాడులు. ఏతావాతా చెప్పాలంటే వీటన్నింటికీకేంద్ర బిందువు, మూల కారకుడు వివాదాస్పద మిలిటరీ చీఫ్ ఆసిఫ్‌మునీర్ అని నిస్సందేహంగా చెప్పాల్సిందే. సింధుజలాల ఒప్పందం తాత్కాలిక నిలిపివేతకు అయినా నేటి హింసాత్మక ఉద్రిక్తతలకు మూలకారణం కూడా ఆయనేనని భారత్ గాఢంగా విశ్వసిస్తోంది. ఎంత మత ఛాందసవాదంతోను, జమ్ముకాశ్మీర్‌ను సొంతం చేసుకోవాలని కుట్రలుచేసినా భారత్‌ముందు మాత్రం ఈ ఆటలుసాగవు. భారత్‌ఎంతమాత్రం సాగనీయదు కూడా. అయినాకూడా ఇదే హింసాత్మక ప్రవృత్తితో పాకిస్థాన్‌వ్యవహరిస్తోంది. అంతర్జాతీయ వేదికలపైనా భారత్‌ను విమర్శించబోయి ఘోర అవమానాలు పాలవుతున్నప్పటికీ తన వైఖరినిమాత్రం వీడటంలేదు. ఉగ్రవాదులు, ఉగ్రస్థావరాలు, ఉగ్ర కార్యకలాపాలకు నిధుల సాయం అందించడంలో ఆధారాలతోసహాభారత్ ప్రకటించినప్పటికీ ఈ దేశ వైఖరి మారలేదు. వాస్తవానికి పాకిస్థాన్‌లో 33 ఏళ్లపాటు సైనిక పాలనే జరిగింది దీనివల్లనే ఈ కరడు గట్టిన వాదం అనేది దేశం మొత్తం పాకిపోయింది. బాధ్యతలుచేపడుతున్న మిలిటరీ ఉన్నతస్థాయి అధికారులు కూడా ఇదే వైఖరితో ఉండటంతో ప్రత్యేకించి భారత్‌పట్ల కుట్రపూరిత భావనతోనే కొనసాగుతుండటం వల్లనే అభివృద్ధి కనుమరుగయి అరాచకం ప్రబలిపోయింది. మొత్తంగా చూస్తే ఇప్పుడు జరుగుతున్న వివాదానికి వివాదాస్పద అధికారి అన్న ట్యాగ్‌లైన్ సాధించిన ఆసిఫ్ మునీర్ అనే స్పష్టం అవుతోంది. ●

---

# టూరిజం అభివృద్ధికి 'మిస్ వరల్డ్' దోహదం



బోరెడ్డి అయోధ్యరెడ

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన మిస్ వరల్డ్ 2025 పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల సుందరీ మణులు హైదరాబాద్‌కు చేరుకుంటు న్నారు. వీరి రాకతో హైదరాబాద్ నగరం సందడిగా మారింది. హైద రాబాద్‌లో మిస్‌వరల్డ్ పోటీలు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఈనెల 10న ప్రారంభమై 31న జరిగే గ్రాండ్ ఫినాలేతోముగుస్తాయి. ఈ 21రోజులు అడుగడుగునా తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. పోటీ ల్లో పాల్గొనే సుందరీమణులకు ఇక్కడి కళలను పరిచయం చేసేలా కార్యక్రమాలను రూపొందించింది. ఇందులో 120 దేశాల ప్రతినిధులు పాల్గొనడమే కాకుండా, 150కిపైగా దేశాల్లో ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం కానుంది. ఈ వేదిక ద్వారా మెడికల్ టూరిజంపై ప్రచారం చేయటం ద్వారా ప్రపంచవ్యాప్తంగా హెల్త్ టూరిస్టులను ఆకర్షించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మెగా ఈవెంట్‌ను కవర్ చేసేందుకు 3వేల మందికిపైగా దేశ,విదేశీ మీడియా ప్రతినిధులు హైదరాబాద్‌కు రానున్నారు. తెలంగాణవైపు ప్రపంచం దృష్టిని ఆకర్షించటం, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచటం, ఇక్కడి పర్యాటకప్రాంతాలకు ప్రాచుర్యం కల్పించడమేలక్ష్యంగా ఈ పోటీలకు ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తున్నది. మిస్ వరల్డ్ 2025 వేడుకలకు 'చార్ సౌ సాల్‌కా షహర్' హైదరాబాద్ ముస్తాబవుతుండగా రాష్ట్రవ్యాప్తంగా హెరిటేజ్, మెడికల్, టెంపుల్ టూరిజానికి ఊతమిచ్చేలా ప్రభుత్వం కార్యాచరణను రూపొందించింది. 'తెలంగాణ జరూర్ ఆనా' థీమ్‌తో అటు అందగత్తెల పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తూనే ఇటు పర్యాటకాన్ని ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటోంది. 116 దేశాల సుందరీమణులు, దేశవిదేశీ అతిథులు, 3 వేల మంది పాత్రికేయులు పాల్గొనే ఈ పోటీలను హైదరాబాద్ మహానగరానికే పరిమితం చేయకుండా.. రామప్ప ఆలయ దర్శనం, యాదగిరిగుట్ట నారసింహుడి ఆశీర్వాదం పోటీదారులకు కలిగేలా షెడ్యూల్‌ను రూపొందించింది. అంతేకాదు.. భౌగోళిక గుర్తింపు పొందిన పోచంపల్లి ఇక్కత్ పట్టు చీరల తయారీ తీరు.. మహబూబ్ నగర్‌లోని పిల్లలమర్రి, ప్రఖ్యాత బౌద్ధారామమైన నాగార్జున సాగర్, హైదరాబాద్‌కు మకుటాయమానంగా ఉన్న చార్మినార్ ఆ పక్కనే అపురూపమైన గాజులకు నిలయమైన లాడ్ బజార్, ఆణిముత్యాల ఆభరణాలను విక్రయించే వీధులు, అస్ఫజాహీల కాలంనుంచి దేశవిదేశీ ప్రతినిధులకు ఆతిథ్యమిచ్చే చౌమొహల్లా ప్యాలెసలను మిస్‌వరల్డ్ పోటీదారులకు పరిచయం చేయనుంది. ఈ పోటీలకు వచ్చినవారు 'హైదరాబాద్ యాత్ర' అనుభూతి గురించి తమ డైరీల్లో ప్రముఖంగా రాసుకునేలా కార్యక్రమాలను రూపొందించింది.జూన్ 2న తెలంగాణ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా మిస్ వరల్డ్ విజేతతోపాటు ఆరు ఖండాల టైటిళ్లను గెలుచుకునే అందగత్తెలకు రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ తేనేటీ విందు ఇస్తారు. మిస్‌వరల్డ్ లిమిటెడ్ సీఈవో జూలియా మోర్లె మాట్లాడుతూ మిస్ వరల్డ్ అనేది అందం కన్నా అంతర్జాతీయ సంస్కృతీ, సాధికారతకు ప్రతీక అన్నారు. ఈ పోటీలు అంతర్జాతీయ పర్యాటక, పెట్టుబడుల కేంద్రంగా తెలంగాణను ముందువరుసలో నిలుపుతాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని కొత్త పుంతలు తొక్కించటమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం తొలి పర్యాటక విధానాన్ని తీసుకొచ్చింది. ఐదేళ్లపాటు అమల్లోఉండే విధంగా రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదించిన తెలంగాణ పర్యాటక పాలసీ 2025-30పై జీవో వెలువరించింది. దీనిలో ఐకానిక్ ప్రాజెక్టులు, మెగా థీమ్‌పార్కులు, ఫిలిం స్టూడియోల అభివృద్ధికి అనువైన ప్రోత్సాహకాలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నూతన పర్యాటక విధానంతో రాబోయే ఐదేళ్లలో 15వేల కోట్ల పెట్టుబడులను రాబట్టాలని, మూడు లక్షల అదనపు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసమై త్వరలో ప్రత్యేక టూరిజం పోర్టల్‌ను అందుబాటులో తీసుకురా



నుంది. తెలంగాణ చరిత్ర, పర్యాటక ప్రాంతాల వివరాలు ఇందులో పొందుపరచనున్నారు.రాష్ట్ర జీడీపీలో టూరిజం వాటాను 10శాతానికి పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకున్నది. రాష్ట్రంలో పర్యాటక వనరులు సమృద్ధిగా కలిగి ఉన్నప్పటికీ, సరైన ప్రచారం లేక పర్యాటక రంగంలో మన రాష్ట్రం వెనకబడిపోయింది. తెలంగాణ రాష్ట్ర జీడీపీలో పర్యాటకరంగం 5.06శాతం ఉండగా, గుజరాత్ 10.2 శాతం, కర్ణాటక 14.20శాతం, కేరళ 10శాతం,రాజస్థాన్ 12శాతంగా ఉన్నాయి. 2023 సంవత్సరంలో రాష్ట్రంలోని వివిధ ప్రదేశాలను సందర్శించిన దేశీయ పర్యాటకుల సంఖ్య 5.84కోట్లు. కాగా, 2024 జనవరి నుంచి ఆగస్టు నాటికి ఆ సంఖ్య 6.51కోట్లకు చేరింది. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా 2023!!24 సంవత్సరంలో దేశీయ పర్యాటకులు సందర్శించిన టాప్ 10 ప్రదేశాల జాబితాను గతనెల విడుదల చేసింది. అందులో గోల్కొండ కోట 6వ స్థానంలో,చార్మినార్‌లో 9వ స్థానంలో నిలిచాయి. పర్యాటకం కారణంగా ఆర్థికవృద్ధితోపాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. టూరిజం కౌన్సిల్‌ప్రకారం అంతర్జాతీయంగా ఏర్పడే ప్రతీ నాలుగు ఉపాధి అవకాశాల్లో పర్యాటకరంగం కూడా ఉంది. పర్యాటకుల రాక పెరిగితే ట్యాక్సీలు నడిపేవారికి, హోటళ్లకు, ఫోటోగ్రాఫర్లకు, టూరిజం గైడ్లకు, వ్యాపారస్తులకు ఉపాధి అవకాశాలు వృద్ధి చెందుతాయి. సింగపూర్ వంటి దేశాలు తక్కువ ప్రదేశంలో వైవిధ్యమైన ప్రణాళికలతో పెద్ద సంఖ్యలో పర్యాటకులను ఆకర్షిస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నాయి. ఇదే తరహాలో రాష్ట్రంలోనూ ఈ రంగం నుంచి వచ్చే ఆదాయం పెరిగితేనే తెలంగాణ ఆర్థిక వ్యవస్థ మరో దశకు చేరుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యాటకశాఖపై సమీక్ష సందర్భంగా పేర్కొన్నారు. ఈరంగంలో బహుళజాతి సంస్థల పెట్టుబడులతో అంతర్జాతీయ స్థాయిలో వసతులు ఏర్పడతాయి. హుస్సేన్‌సాగర్ పరిసరాల్లోని సంజీవయ్య, ఎన్‌టీఆర్, ఇందిరా పార్కులను కలుపుతూ ట్యాంక్‌బండ్ చుట్టూ స్కైవాక్, పర్యాటక వలయాన్ని ఏర్పాటు చేయాలని, కవ్వాల్, అమ్రాబాద్ పులుల అభయారణ్యాలను సఫారీ టూరిజానికి అనుగుణంగా తీర్చిదిద్దాలని ఆయన అధికారులను ఆదేశించారు. మనదేశంలో మిస్ వరల్డ్ పోటీలు గతంలో 1996లో బెంగళూరులో, 2024లో ముంబయ్ వేదికగా జరిగాయి. మూడవసారి ఈ అవకాశం తెలంగాణకు దక్కింది. ఈ పోటీలకు దుబాయ్‌నగరం నుంచి తీవ్ర పోటీ ఎదురైంది. అయితే, హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయంగా ఉన్న గుర్తింపుతోపాటు చారిత్రక, గ్రామీణ ప్రాంతాల ప్రత్యేకతల్ని వివరించటంతో ఇక్కడ నిర్వహించేందుకు అవకాశం లభించింది. దేశంలో కొత్త రాష్ట్రమైన తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతోంది. రాష్ట్రంలో శంషాబాద్ విమానాశ్రయం ప్రపంచంలోని అత్యుత్తమైన విమానాశ్రయాల్లో ఒకటి. ఇక్కడ ఏడాది పొడవునా ఆహ్లాదకర వాతావరణం, ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు అనేకంఇక్కడ ఉన్నాయి. ఈ అంశాలు పోటీల నిర్వహణకు అవకాశం దక్కేందుకు అనుకూలించాయి. ఇప్పటికే ప్రపంచ సుందరి 2024 క్రిస్టినా పిజ్కోవా రాష్ట్రంలోని అనేక ప్రాంతాలను సందర్శిస్తూ, ఈ పోటీలకు ముందస్తు ప్రచారం కల్పిస్తున్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా కేబీఆర్ పార్కులో నిర్వహించిన అంతర్జాతీయ అటవీ దినోత్సవాలలో మంత్రి కొండా సురేఖతో కలిసి మిస్ వరల్డ్ క్రిస్టినా పిజ్కోవా పాల్గొని మొక్కలకు నీళ్లు పోశారు. తెలంగాణకు అంతర్జాతీయంగా పేరు ప్రతిష్టలు తీసుకొచ్చి టూరిజం అభివృద్ధికి ఈపోటీలు దోహదం చేయనున్నాయి. తాము చేయలేని పనిని కాంగ్రెస్‌ప్రభుత్వం చేస్తున్నదనే అక్కసుతో బీఆర్ఎస్ ఈ కార్యక్రమంపై బురద జల్లుతున్నది. ఈ ఈవెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తుండగా, రూ.250కోట్లు చేస్తున్నారని విమర్శలు చేస్తున్నాయి. వాస్తవానికి ఈ పోటీలకోసం అంతర్జాతీయ స్థాయిలో విలేకరులు, ఫోటోగ్రాఫర్లు వచ్చి ఈ వార్తలను కవరేజ్ చేయటం వల్ల అంతర్జాతీయ మీడియాలో తెలంగాణ రాష్ట్రానికి ప్రముఖ స్థానం దక్కుతుంది. ప్రపంచంతోపాటు మనం కూడా పరుగులు పెడితేనే వృద్ధిని అందుకోగలుగుతాం. లేకపోతే వెనకబడిపోతాం. అంతేకానీ ప్రతీ విషయంలోనూ రాజకీయంగా ఆలోచించి విమర్శలు చేస్తూ ప్రతీదాన్ని అడ్డుకునే సంకుచిత మనస్తత్వాన్ని మానుకోవాలి. ●

# భారత్ దాడుల్లో మృతిచెందిన ఉగ్రవాదులు వీరే..



## 'ఆపరేషన్ సిందూర్'లో ఐదుగురు కీలక ఉగ్రనాయకులు హతం

**న్యూఢిల్లీ, మే 10:** పహల్గాం ఉగ్రదాడికి భారత్ తీవ్రస్థాయిలో బదులిచ్చిన సంగతి తెలిసిందే. లష్కరే తోయిబా, జైషే మహ్మద్ ఉగ్రముఠాలే లక్ష్యంగా వాటిస్థావరాలపై బాంబులతో విరుచుకుపడింది. ఈనెల 7వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత పాక్ పీఓకేలో జరిపిన మెరుపుదాడుల్లో తొమ్మిది కీలక ఉగ్రశిబిరాలను నేలమట్టంచేసింది. ఈ ఆపరేషన్ సిందూర్‌లో సుమారు 100 మంది ఉగ్రవాదులు హతమైనట్లు కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో ఐదుగురు కీలక ఉగ్రనాయకులను కూడా మట్టుబెట్టినట్లు తెలుస్తోంది. వారి వివరాలను కూడా కేంద్రం తాజాగా వెల్లడించింది. జైషేమహ్మద్ వ్యవస్థాపకుడు మసూద్ అజహర్ ఇద్దరు బావమరుదులతోపాటు లష్కరే తాయిబాకు చెందిన కీలక ఉగ్రవాది మరో ఇద్దరు హతమయ్యారు. వీరిలో కీలకమైన ఉగ్రనేత పేర్లను కేంద్రం ప్రకటించింది. ముదస్సర్ ఖదాయన్‌ఖాస్ అలియాస్ అబు జుందాల్ లష్కరేకు కీలక ఉగ్రవాదిగా కొనసాగుతున్నాడు. ఈతడిఅంత్యక్రియలను పాక్ ఆర్మీ లాంఛనాలతో నిర్వహించింది. అంతర్జాతీయ ఉగ్రవాది హాఫీజ్ అబ్దుల్ రవూఫ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి పాక్ ఆర్మీచీఫ్ పంజాబ్‌లోని పాక్ సీఎం, ఐజీలు పాల్గొన్నారు. ఇకమసూద్ అజర్ పెద్ద బావమరిది హాఫీజ్ మహ్మద్ జమీల్ ఉగ్రముఠాలో కీలకసభ్యుడు. మసూద్ అజార్ మరో బావమరిది అయిన మహ్మద్‌యూసఫ్ అజార్ అలియాస్ ఉస్తాద్‌జీ అలియాస్ సలీమ్ అలియాస్ సాహబ్ జైషేలో కీలకంగా కొనసాగుతున్నాడు. ఐసి 814 విమాన హైజాక్ ఘటనలో ప్రధాన నిందితుడు. ఇక జమ్ము కాశ్మీర్‌లో ఉగ్రదాడులకు నాయకత్వం వహించిన మరో కీలక ఉగ్రనేత లష్కనే సీనియర్ ఖలీద్ అలియాస్ అబూ అకాస కూడా హతం అయ్యాడు. ఆఫ్ఘన్ నుంచి ఆయుధాలు స్మగ్లింగ్ చేసేవాడు. ఫైసలాబాద్‌లో జరిగిన అంత్యక్రియ లకు పాక్ సీనియర్ ఆర్మీ అధికారులు, స్థానిక డిప్యూటీకమిషనర్ కూడా హాజరయ్యారు. మహ్మద్ హసన్‌ఖాన్ జైషేలో కీలక నేత పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని జైషే ఆపరేషనల్ కమాండర్ ముఫ్తి అస్గర్‌ఖాన్ కశ్మీరీ కుమారుడు. జమ్ముకాశ్మీర్‌లోకి ఉగ్రవాదులను పంపించడంలో కీలకపాత్రపోషించాడు. జైషే, లష్కరే ముఠాల కీలక స్థావరాలే లక్ష్యంగా భారత్ ఈమెరుపు దాడులు చేపట్టింది. భారత్ టార్గెట్‌చేసిన కేంద్రాల్లో లాహోర్‌కు 40 కిలోమీటర్ల దూరంలోని మురిద్కేలో ఉన్న లష్కరే తోయిబా ఉగ్రశిబిరం ఉంది. 26/11 ముంబయి దాడులకు పాల్పడిన ఉగ్రవాదులు అజ్మల్ కసబ్, డేవిడ్ హెడ్లీ ఇక్కడే శిక్షణ తీసుకున్నారు. ఇక జైషేకు చెందినప్రధాన కేంద్రం బహవల్‌పూర్‌లోని మర్కజ్‌సుభాన్‌పైనా భారత్ మెరుపుదాడి చేసింది. ఈ దాడిలో మసూద్ అజర్ కుటుంబంలోని పదిమంది మృతి చెందినట్లు స్వయంగా మసూద్ ప్రకటించాడు.



## మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తాం

### ప్రతి కుటుంబానికి రూ.10లక్షల సాయం: జమ్ముకాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా

**శ్రీనగర్, మే 10:** జమ్ముకాశ్మీర్ సరిహద్దుల్లో పాకిస్థాన్ జరిపిన విచక్షణారహిత కాల్పుల్లో సుమారు 20 మంది పౌరులు మృతిచెందిన సంగతి తెలిసిందే. మృతుల కుటుంబాలకు జమ్ముకాశ్మీర్‌ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నష్టపరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలచొప్పున పరిహారం అందిస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు తమ ప్రభుత్వం ఎప్పటికీ మద్దతుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. పహల్గాంప్ దాడికిప్రతీకారంగా ఉగ్రస్థావరాలను భారత్ ధ్వంసం చేయడంతో పాక్‌కూడా సరిహద్దుప్రాంతాల్లో ప్రతీకార దాడులకు పాల్పడుతోంది. నియంత్రణ రేఖ వెంట పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి దాడులకు తెగబడింది. జమ్ముకాశ్మీర్‌ప్రభుత్వ అధికారి రాజ్‌కుమార్ థాపా సహా 20 మందిపౌరులు ప్రాణాలు కోల్పోయారు. పదులసంఖ్యలో గాయపడ్డారు. ఒక్కరోజుముందే తాను నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో రాజ్‌కుమార్ పాల్గొన్నారని, ఇంతలోనే రాజౌరిలోని ఆయన ఇంటిపై జరిగిన దాడిలోప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేసారు. ఉగ్రవాదంపై పోరు ఆగదని, శాంతియుత సహజీవనంవైపే తాము ప్రాధాన్యత ఇస్తామని ఒమర్ అబ్దుల్లా ఈసందర్భంగా పేర్కొన్నారు. నాలుగురోజుల్లో పూంచ్, రాజౌరి, జమ్ము బారాముల్లా సెక్టార్లలో 19 మంది మరణించారు. బుధవారం పూంచ్‌లో 12 మంది మరణిస్తే శుక్రవారం ఊరి, పూంచ్‌లోమరో ఇద్దరు మరణించారు. శనివారం ఉదయం పాక్ కాల్పుల్లో ఒక సీనియర్‌ప్రభుత్వ అధికారి మరో ఐదుగురుప్రాణాలు కోల్పోయారు.



## ఇకపై ఏ ఉగ్రదాడి అయినా యుద్ధ చర్యగానే పరిగణిస్తాం

**న్యూఢిల్లీ:** పాకిస్తాన్‌కు భారత్ సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. ఇకపై ఏ ఉగ్రదాడినైనా యుద్ధ చర్యగా పరిగణిస్తామని హెచ్చరించింది. పాకిస్తాన్ రెచ్చిపోతే అంతకు అంత ప్రతీదాడితో విరుచుకు పడాలని నిర్ణయించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన త్రివిధ దళాధిపతులతో జరిపిన అత్యున్నత స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. పాక్‌పై పూర్తి స్థాయి యుద్ధానికి మోదీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం. ఇకపై ఏ ఉగ్రదాడినైనా యుద్ధ చర్యగా పరిగణించాలని, అంతే తీవ్ర స్థాయిలో బదులివ్వాలని ప్రధాని దిశానిర్దేశం చేశారని తెలిసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోబాల్ ఈ కీలక సమావేశంలో పాల్గొన్నారు. భారత క్షిపణులు శత్రువుల గుండెల్లో గుబులు పుట్టిస్తాయ్..వీటి స్పెషల్ ఏంటంటే భారత్‌లో 26 లొకేషన్లపై పాక్ డ్రోన్ దాడులకు ప్రతిగా శనివారం తెల్లవారు జామున నాలుగు పాక్ ఎయిర్‌బేస్‌లపై భారత్ దాడులు చేసింది. అనంతరం నేపథ్యంలో మోదీ ఈ సమావేశం నిర్వహించారు. దేశ భద్రతా విషయంలో మరింత కఠిన వైఖరి ప్రదర్శించాలని ఈ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భారత ప్రయోజ నాలను దెబ్బతీసేలా భవిష్యత్తులో ఎలాంటి ఉగ్రవాద చర్యలకు పాల్పడినా దానిని యుద్ధ చర్యగా పరిగణించాలని సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్టు ఆ వర్గాలు వెల్లడిం చాయి. దీంతో ఇకపై ఉగ్రవాద చర్యలను కేవ లం అంతర్గతా భద్రతా చర్యలుగానే పరిగ ణించలేమని, ప్రతిస్పందన అత్యంత భీకరంగా ఉంటుందనే ప్రత్యక్ష హెచ్చరిక సందేశాన్ని భారత్ దాయాదికి పంపించినట్లయింది.

## సజావుగా చార్‌ధామ్ యాత్ర: సిఎం పుష్కర్‌సింగ్ ధామి



**డెహ్రాడూన్, మే 10:** ఉత్తరాఖండ్‌లో చార్‌ధామ్ యాత్రకు సంబంధించి భక్తులకు కీలక అప్‌డేట్ అందింది. సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలకు ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి స్వయంగా తెరదించారు. చార్ ధామ్ యాత్ర సజావుగా సాగుతోందని చార్‌ధామ్ యాత్ర ఎటువంటి అంతరాయాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని, యాత్రికులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని ఆయన స్పష్టం చేశారు. ఈ యాత్రా సీజన్‌లో ఇప్పటివరకు 4 లక్షలకు పైగా భక్తులు చార్‌ధామ్‌లను విజయవంతంగా దర్శించుకున్నారని సీఎం పుష్కర్ సింగ్ ధామి వెల్లడించారు. యాత్ర సజావుగా సాగేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా, శ్రీ కేదార్‌నాథ్ ధామ్‌కు హెలికాప్టర్ సేవలు కూడా పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చాయని, ఇవి నిరంతరాయంగా నడుస్తున్నాయని తెలిపారు. యాత్రకు సంబంధించి ఎలాంటి వదంతులను నమ్మవద్దని ముఖ్యమంత్రి భక్తులకు విజ్ఞప్తి చేశారు. యాత్రికుల ప్రయాణ అనుభవాన్ని సురక్షితంగా, సౌకర్యవంతంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన పునరుద్ఘాటించారు. భక్తుల భద్రతకే తమ ప్రథమ ప్రాధాన్యత అని ధామి అన్నారు. యాత్రకు సంబంధించిన ఏదైనా సమాచారం లేదా సహాయం అవసరమైతే, భక్తులు 1364 లేదా 01351364 హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించవచ్చని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి సూచించారు. ప్రభుత్వం అందించే అధికారిక సమాచారంపైనే ఆధార పడాలని ఆయన కోరారు.

## పాక్ నెత్తిన మండుతున్న 'బలోచ్' కుంపటి

### ఓ పట్టణాన్ని స్వాధీనం చేసుకొన్న బిఎల్ఎ



**ఇస్లామాబాద్, మే 10:** భారత్‌ను రెచ్చగొడుతూ భంగపాటుకు గురవుతున్న పాకిస్థాన్ నెత్తిన మరో పిడుగు పడింది. దశాబ్దాలుగా ఆ దేశానికి కొరకరాని కొయ్యగా మారిన బలోచిస్థాన్ వేర్పా టువాద ఉద్యమం తాజా ఉద్రిక్తతల వేళ మరింత తీవ్రమైంది. తాజాగా అక్కడ ఓ పట్టణాన్ని బలోచ్ లిబరేషన్ ఆర్మీ స్వాధీనం చేసుకోవడంతో దాయాదికి స్వదేశం లోనే సవాల్ ఎదురైంది. బలోచిస్థాన్ ప్రావిన్స్‌లో గల కాలత్ జిల్లా మం గోచర్ పట్టణాన్ని తాము స్వాధీనం చేసుకున్నట్లు బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఎ) శనివారం ప్రక టించింది. అంతేగాక, బలోచిస్థాన్ వ్యాప్తంగా 39 ప్రాంతాల్లో మెరుపుదాడులు చేశామని వెల్ల డించింది. ఈ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోం దని, మిలిటరీ కాన్వాయ్‌లపై దాడులు చేస్తామని హెచ్చరించింది. ఇప్పటికే కొంతమంది స్థానిక పోలీసులను బందీలుగా తీసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసు స్టేషన్‌ను తమ నియంత్రణలోకి తీసుకున్న బిఎల్ఎ రహదారులను దిగ్బంధించింది. అయితే, బలోచ్ రెబల్స్ ప్రకటనపై పాక్ ప్రభుత్వంనుంచి ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. ఇదిలా ఉండగా శుక్రవారం కూడా పాక్ ఆర్మీ సిబ్బందిపై తిరుగు బాటుదారులు దాడి చేయగా 22 మంది సైనికులు మరణించినట్లు వార్తలు వచ్చాయి. దీనిపైనా ఎలాంటి అధికారిక సమాచారం లేదు.

# భారత్‌తో పోలిస్తే అత్యంత బలహీనంగా ఉన్నాం..

## పాక్ క్రికెట్‌బోర్డు మాజీ ఛైర్మన్ నజామ్‌సేథీ



**ఇస్లామాబాద్, మే 10:** భారత్ తో పోలిస్తే పాకిస్థాన్ ఆర్థికంగా, అంతర్జాతీయంగా అత్యంత బలహీన స్థితిలో ఉందని, ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ ముందు నిలబడలేని దుస్థితి నెలకొందని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మాజీ ఛైర్మన్ నజామ్ సేథి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడి, ఆపరేషన్ సిందూర్, ఆ తర్వాత మే 9వ తేదీ రాత్రి పాకిస్థాన్ వైపు నుంచి పలు భారత నగరాలపై దాడికి జరిగిన యత్నం, దానిని భారత సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టడం వంటి ఘటనలతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో, పాకిస్థాన్‌కు చెందిన ఓ టెలివిజన్ ఛానల్ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో పాల్గొన్న నజామ్ సేథి, పాకిస్థాన్ ప్రస్తుత దుస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశం చాలా బలహీనంగా తయారైంది. మనం ప్రస్తుతం ప్రమాదకరమైన దశలో ఉన్నాం. మన అంతర్గత పరిస్థితులు కూడా దారుణంగా ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. అమెరికా కూడా మనకు అండగా నిలబడేందుకు నిరాకరిస్తోంది. ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్‌లతో మన సంబంధాలు దెబ్బతిన్నాయి" అని నజామ్ సేథి విశ్లేషించారు. కార్యక్రమంలో యాంకర్ జోక్యం చేసుకుంటూ, భారత్ లో కూడా అంతర్గత సమస్యలు ఉన్నాయని, బంగ్లాదేశ్‌తో ఆ దేశ సంబంధాలు కూడా దెబ్బతిన్నాయని ప్రస్తావించారు. అయితే, నజామ్ సేథి ఈ వాదనను పూర్తిగా తోసిపుచ్చారు. భారత్‌తో పోలిస్తే బంగ్లాదేశ్ చాలా చిన్న దేశం. అంతర్జాతీయంగా భారతదేశానికి ఇప్పటికి మంచి గుర్తింపు ఉంది. కానీ దురదృష్టవశాత్తు మనకు ఆ పరిస్థితి లేదు. ప్రస్తుత తరుణంలో విదేశీ పెట్టుబడులన్నీ భారత్ కే వెళుతున్నాయి. అరబ్ ప్రపంచం మొత్తం భార త్‌కే మద్దతుగా నిలుస్తోంది. సౌదీ అరేబియా, యూఏఈ వంటి దేశాలు భారత్‌తో బిలియన్ డాలర్ల కొద్దీ పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చు కున్నాయి. భారతదేశం ఏమాత్రం ఒంటరి కాదు, కానీ పాకిస్థాన్ మాత్రం ఒంటరైపోయింది అని సేథి అన్నారు.

## పాక్ కాల్పుల్లో మరో జవాన్ వీరమరణం

**ముంబై, మే 10:** భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఆపరేషన్ సిందూర్‌లో మరో జవాన్ వీరమరణం పొందారు. సరిహద్దుల్లో పోరాడుతూ మహారాష్ట్ర - తెలంగాణ సరిహద్దులోని నాందేడ్ జిల్లా తమ్లూర్ చెందిన ఆర్మీ సోల్జర్ సచిన్ యాదవ్‌రావు వనాంజే (29) జమ్మూ కశ్మీర్‌లో నేలకొరిగారు. సచిన్ మరణవార్త తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. స్వగ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. యుద్ధంలో ఇప్పటికే తెలుగు జవాన్ మురళీనాయక్ (22) వీరమరణం పొందారు. దేశ రక్షణలో శుక్రవారం తెల్లవారుజామున రెండున్నర గంటల ప్రాంతంలో దాయాది బుల్లెట్‌కు బలయ్యారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలోని గోరంట్ల మండలం కల్లి తండాకు చెందిన మురళీ 'ఆపరేషన్ సిందూర్' సందర్భంగా నియంత్రణ రేఖ వద్ద విధులు నిర్వర్తిస్తున్నాడు.




సచిన్ యాదవ్‌రావు వనాంజే (ఫైల్)

ఈ క్రమంలో జరిగిన కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన చికిత్స నిమిత్తం విమానంలో ఢిల్లీకి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే తనువు చాలించాడు. దేశ భద్రతలో తన ప్రాణాలను పణంగా పెట్టిన మురళీనాయక్ త్యాగం మన దేశం ఎప్పటికీ మరువలేనిదని కేంద్ర, రాష్ట్ర ప్రముఖులు నివాళులర్పించారు.

# యుద్ధ రంగంలో డ్రోన్లదే హవా

**పహల్గాం ఉగ్రదాడి తరువాత భారత్, పాక్ భారీగా డ్రోన్ల వాడకం**

**రాబోయే రోజుల్లో డ్రోన్ల స్థానంలో ఫైటర్ జెట్ డ్రోన్లు**




**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** యుద్ధం అంటే ఒకప్పుడు ఆయుధాలు, వార్ ట్యాంకులు, వేల సంఖ్యలో సైనికులు అన్నట్లుగా పరిస్థితులు వుండేవి. కానీ నేడు ఈ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఇప్పుడంతా డ్రోన్‌ల మయంగా మారింది. శత్రు దేశ లక్ష్యాలను దెబ్బతీయాలంటే ఇప్పుడు అన్ని దేశాలు డ్రోన్లనే వాడుతున్నాయి. తక్కువ ధరకు లభ్యమవుతున్న డ్రోన్లతో ప్రత్యర్థి దేశాలకు ఎక్కువ నష్టం కలిగించే డ్రోన్లను ఇప్పుడు అనేక దేశాలు సొంతంగా తయారు చేసు కోవడం లేదా దిగుమతి చేసుకోవడం జరుగుతోంది. పహల్గాం ఉగ్రదాడి తరువాత భారత్ పాక్ మధ్య మొదలైన యుద్ధంలో ఇప్పుడు డ్రోన్లే కీలక పాత్ర వహిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే డ్రోన్లే ఇప్పుడు గేమ్ చేంజర్లుగా మారాయి. భారత్‌పై పాక్ ప్రయోగిస్తున్న బైరెక్టార్ టిబి2. అసిగార్డ్ సొంగార్ రకం డ్రోన్లు టర్కీలో తయారనవి కాగా పాక్‌పై భారత్ వాడిన డ్రోన్లు ఇజ్రాయిల్, ఫ్రాన్స్‌లో రూపొందినవి కావడం గమనార్హం. పాక్ గగనతల రక్షణ వ్యవస్థలను నిమిషాల వ్యవధిలో తుత్తునియలు చేసిన భారత డ్రోన్లు ఆ దేశానికి దిమ్మదిరిగే షాక్ ఇచ్చాయి.

డ్రోన్ల వాడకం అనేది రెండు వేల దశకంలో ఎక్కువైనా 1917లోనే తొలి తరం డ్రోన్‌ను బ్రిటన్, అమెరికాలు తయారు చేశాయి. ఆ తరువాత వీటిని ఒక్కో దశ లో అనేక దేశాలు అభివృద్ధి చేసుకుంటూ పోయి 1990 దశకం వచ్చే సరికి అధునాతన డ్రోన్ ఆవిష్కృతమయ్యింది. ఇప్పుడు అనేక దేశాలు వాడుతున్న అధునా తన డ్రోన్లు గడచిన ఐదారేళ్ల వ్యవధిలో కొత్త టెక్నాలజితో రూపొందినవి. ఇందులో మిలటరీ కోసం తయారు చేస్తున్న సైనిక డ్రోన్లు యుద్ధ తంత్రాన్నే మార్చేస్తు న్నాయి. నిన్నమొన్నటి వరకు డ్రోన్ల తయారీ రంగాన్ని అమెరికా, ఇజ్రాయిల్ శాసించగా ఇప్పుడు చైనా, టర్కీతో పాటు ఫ్రాన్స్ సహా మరి కొన్ని దేశాలు అగ్ర భాగాన వున్నాయి. ప్రస్తుతం టర్కీ తయారీ డ్రోన్లు ప్రపంచ వ్యాప్తంగా పేరొందాయి. డ్రోన్లలో వున్న రకాల విషయానికి వస్తే ప్రిడేటర్ డ్రోన్లు, రాడార్ డ్రోన్లు, సూసైడ్ డ్రోన్లు ఇలా అనేక రకాల డ్రోన్లు యుద్ధ రంగంలో కీలక భూమిక వహిస్తున్నాయి. తమకంటే బలమైన దేశమైన రష్యాపై పైచేయి సాధించేందుకు రష్యా టర్కీలో తయారైన అధునాతన డ్రోన్లను వాడింది. ఉక్రెయిన్ వాడిన కొన్ని రకాల డ్రోన్లు రష్యాలోని పలు ప్రాంతాలలో ద్రవ రూపంలో వున్న థర్మైడ్ అనే ర సాయనాలను స్ప్రే చేసింది. మండే స్వభావం వున్న ఈ రసాయనం వల్ల ఆయా ప్రాంతాల భూములు చాలా కాలం పాటు నిరుపయోగంగా మారగా. అక్కడి ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఇక పాకిస్తాన్ భారత్‌పై ప్రయోగిస్తున్న సోంగార్, బైరెక్టార్ టిబి 2 రకం డ్రోన్లు పేలుడు సామర్థ్యం కలిగినవి. ఒక ర కంగా చెప్పాలంటే ఇవి ఆత్మాహుతి డ్రోన్లు. వీటిని చాలా వరకు బారత సైన్యం నిరోధించినా కొన్నిచోట్ల నష్టం వాటిల్లింది.

**ప్రపంచంలో అత్యధిక మిలటరీ డ్రోన్లు కలిగిన పది దేశాలు:** ఇక ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో మిలటరీ డ్రోన్లు కలిగిన దేశాల్లో అమెరికా అగ్రభాగాన వుంది. అమెరికా వద్ద 13,710 అధునాతన డ్రోన్లు వున్నాయి. ఇం దులో ఎక్కువగా ప్రత్యర్థి దేశాలపై నిఘా కోసం తయారయినవే కావడం గమనార్హం. అమెరికా వద్ద వున్న మిలటరీ డ్రోన్లలో ఆర్‌క్యూ 11 రావెన్ పేరిట వున్నా యి. ఈ రకం డ్రోన్లు వైమానిక నిఘా కోసం తయారయినవి. అమెరికా తరువాత టర్కీ దేశం డ్రోన్ల తయారీలో ద్వితీయ స్థానంలో వుంది. ఈ దేశంలో 1421 డ్రోన్లు వున్నాయని అంచనా. డ్రోన్ టెక్నాలజిలో అభివృద్ధి చెందిన దేశాల్లో టర్కీ ప్రస్తుతం ముందు వరుసలో వుంది. మధ్యస్థ ఎత్తులో ఎగరగల బెరెక్టార్ టిబి 2తో పాటు సోంగార్‌లు ఇందులో ప్రధానమైనవి. ఈ రకం డ్రోన్లను టర్కీ అజర్‌బైజార్, ఖతార్, ఉక్రెయిన్‌లకు భారీగా ఎగుమతి చేస్తోంది. టర్కీ తరువాత యూరపియన్ దేశం పోలాండ్ డ్రోన్ల తయారీలో మూడవ స్థానంలో వుంది. ఈ దేశం వద్ద 1209 డ్రోన్లు వున్నట్లు అంచనా. పోలాండ్ నౌకా దళంలో డబ్ల్యూ బి గ్రూప్ అభివృద్ధి చేసిన వెయ్యికి పైగా వార్మెట్ లాటరింగ్ రకం డ్రోన్లు వున్నాయి. ఇవి తేలికపాటి రకం డ్రోన్లు. పోలాండ్ తరువాత రష్యా వద్ద 1050 డ్రో న్లు వున్నాయి. రష్యా కూడా డ్రోన్ టెక్నాలజి కోసం భారీగా పెట్టుబడులు పెడుతోంది. రష్యా వద్ద వున్న డ్రోన్లలో అధిక భాగం స్థానికంగా తయారు చేసిన ఓ ర్లాన్ 10 రకం డ్రోన్లు కావడం గమనార్హం. ఉక్రెయిన్ చేస్తున్న డ్రోన్ల దాడిని ఎదుర్కొనేందుకు రష్యా కొత్తరకం డ్రోన్లను తయారు చేస్తోంది. రష్యా తరువాత జర్మనీ వద్ద 670 డ్రోన్లు వున్నాయి. ఇవన్నీ సైనిక అవసరాల కోసం వున్నాయి. ఇక డ్రోన్ల వినియోగంలో భారత్ ఆరవ స్థానంలో వుంది. భారత్ వద్ద 625 డ్రోన్లు వున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీటిలో 600 డ్రోన్లు స్పైలైట్ రకం డ్రోన్లు వున్నాయి. వీటిని 2019లో రక్షణ రంగంలో ప్రవేశ పెట్టారు. 2015లో 400 మి లియన్ డాలర్ల ఒప్పందంతో ఇజ్రాయిల్ నుంచి 10 హెరాన్ 1 డ్రోన్లను భారత్ కొనుగోలు చేసింది. దీంతో పాటు ఇటీవల ఫ్రాన్స్ నుంచి డ్రోన్లను భారత్ కొన్న ది. వీటితో పాటు భారత్ వద్ద 15 హారోప్ మానవరహిత విమానాలు వున్నాయి. భారత్ తరువాత ఫ్రాన్స్ వద్ద 591, ఆస్ట్రేలియా వద్ద 557, దక్షిణ కొరియా వద్ద 518, ఫిన్లాండ్ వద్ద 412 డ్రోన్లు వున్నాయి.

## భారత్-పాకిస్థాన్ సంయమనం పాటిస్తే మంచిది

### అవసరమైతే నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాం: చైనా



**బీజింగ్, మే 10:** భారత్-పాకిస్థాన్‌ల మధ్య సమస్యకు ముగింపు పలికేందుకు అవసరమైతే నిర్మాణాత్మక పాత్ర పోషిస్తామని చైనా పేర్కొంది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో చైనా ఈ మేరకు పేర్కొనడం గమనార్హం. ఇరు దేశాలు సంయమనం పాటించాలని చైనా విదేశాంగ శాఖ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. 'భారత్-పాక్‌ల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తత పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాం. శాంతి, స్థిరత్వం కోసం ఇరుదేశాలు సమయమనం పాటించాలని కోరుతున్నాం. శాంతియుత మార్గాలతో సమస్యలను పరిష్కరించుకోవాలి. ఉద్రిక్తతలను తీవ్రతరం చేసే చర్యలను తగ్గించుకోవాలని సూచిస్తున్నాం. ఈ ఉద్రిక్తతలను తగ్గించాలని అంతర్జాతీయ సమాజం కూడా ఆశిస్తోంది. ఈ సమస్య ముగింపునకు అవసరమైతే నిర్మాణాత్మక పాత్ర పోషించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం' అని బీజింగ్ పేర్కొంది. గత నెల 22న పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. దీనికి ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాల లక్ష్యంగా దాడులు చేసింది. దీంతో భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు తీవ్రతరమయ్యాయి.

# వందలాది భద్రతా దళాలతో షార్‌లో మాక్‌డ్రిల్

**తిరుపతి పోలీసులు, సిఐఎస్ఎఫ్ దళాల సమన్వయం**

**శ్రీహరికోట (తడ), మే 10 ప్రభాతవార్త:** అత్యంత భద్రత ప్రదేశమైన భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం శ్రీహరికోటలో సిఐఎస్ఎఫ్ దళాలు, తిరుపతి పోలీసులు సంయుక్తంగా శనివారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సూచనలతో శ్రీహరికోటలోని సిఐఎస్ఎఫ్ డిఐజి సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సుమారు రెండుగంటలపాటు షార్ వద్ద మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ డ్రిల్‌లో వివిధ సెక్యూరిటీల నుంచి సమన్వయంతో సిబ్బంది పాల్గొన్నారు. శ్రీహరికోటను ఎప్పుడూ కంటికి రెప్పలా కాపాడే కేంద్రపారిశ్రామిక భద్రత దళాలు ప్రస్తుత పాకిస్తాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో మరింత అప్రమత్తం అయ్యాయి. సీనియర్ కమాండెంట్ సంజీత్‌కుమార్, డిప్యూటీ కమాండర్ ఎస్‌కె గౌర్‌లతో పాటు సూళ్లూరుపేట సిఐ మురళీకృష్ణ, శ్రీహరికోట ఎస్ఐ కె.శ్రీకాంత్, సిఐఎస్ఎఫ్‌దళాలు, పోలీసు బలగాలు మాక్‌డ్రిల్‌లో పాల్గొన్నారు. అత్యవసర యూనిట్లుగా క్విక్ రెస్పాన్స్ టీమ్ 70మంది, బాంబ్ డిస్పోజల్ టీమ్ ఐదుగురు, అగ్నిమాపక విభాగం ఎనిమిది మంది, వైద్య సిబ్బంది నలుగురు, ఇంటలిజెన్స్ బ్యూరో అధికారి చిరాగ్, సిబ్బంది, మెరైన్ పోలీసులు, సివిల్ పోలీసులు ఇందులో పాల్గొన్నారు. ఏదయినా ముప్పు సంభవించినప్పుడు భద్రత దళాలు ఏ విధంగా సంసిద్ధతగా ఉం దాలో సమన్వయంతో పాటు ప్రతి స్పందన అవసరాలు ఈ మాక్‌డ్రిల్ లక్ష్యంగా ఉంది. ఇందులో పాల్గొనే యూనిట్లు సమర్థవంతమైన కమ్యూని కేషన్, వేగవంతమైన చర్యలను ప్రదర్శించాయి. ఈ కారణంగా మాక్ డ్రిల్ విజయవంతమైనట్లు అధి కారులు తెలిపారు. దేశంలోని ఇస్రో కేంద్రాల వద్ద భద్రతను పెంచాల్సి న అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్రప్రభుత్వం శ్రీహరికోటలోను భద్రత చర్యలను పటిష్టం చేసినట్లు వారు పేర్కొన్నారు.



ఉగ్రవాదులను ఎదుర్కోవడానికి షార్‌లో చేపట్టిన మాక్‌డ్రిల్

# స్వరం మార్చిన పాకిస్థాన్

## చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడి



**ఇస్లామాబాద్, మే 10:** భారత్ తమపై దాడిచేస్తే ఎదురుదాడికి దిగుతామని మేకపోతు గాంభీర్యం ప్రదర్శించిన పాకిస్థాన్ ఇప్పుడు స్వరం మార్చింది. పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్‌దార్ మీడియాతో మాట్లాడుతూ భారత్ తమపై చేస్తున్న సైనిక దాడిని ఇక్కడితో ఆపితే తాము కూడా ఉద్రిక్తతలు తగ్గించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఉభయ దేశాల మధ్య దాడుల వల్ల పాక్ ఆర్థిక పరిస్థితి కుదేలవ్వడం, ప్రజల పరిస్థితులు అధ్వానంగా మారే ప్రమాదం ఉండడంతో ఈ యుద్ధ వాతావరణాన్ని రూపుమాపడం కోసం న్యూఢిల్లీతో చర్చలు జరపడానికి ఇస్లామాబాద్ సిద్ధంగా ఉందని పాకిస్థాన్ అధికారిక వర్గాలు వెల్లడించాయి. భారత్-పాక్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో పరిస్థితులు చేయి దాటకముందే దాడుల నివారణకు చర్యలు తీసుకోవాలని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇరు దేశాలకు సూచించారు. ఈ నేపథ్యంలో పాక్ విదేశాంగ శాఖ మంత్రి ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. గురువారం రాత్రి నుంచి పాక్ భారత సరిహద్దు ప్రాంతాల్లో దుస్సాహసానికి ఒడిగడుతూనే ఉంది. బారాముల్లా నుంచి భుజ్ వరకు 26 ప్రాంతాలపైకి వరసగా డ్రోన్లు ప్రయోగించింది. ముఖ్యంగా శ్రీనగర్ విమానాశ్రయాన్ని, అవంతీపొరా వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకొని డ్రోన్లను ప్రయోగిస్తూ విఫలయత్నం చేస్తుండగా, దాయాది చర్యలను భారత సైన్యం తిప్పికొడుతోంది. శనివారం మరోసారి జమ్మూ, ఫిరోజ్‌పుర్, పఠాన్‌కోట్, జైసల్మేర్, బాడ్‌మేడ్, భుజ్ తదితర ప్రాంతాలపై వీటిని మళ్లీ పంపేందుకు ప్రయత్నించగా భారత సైనికులు వాటిని కూల్చేశారు.

# దైవ దర్శనానికి వెళుతూ పరలోకాలకు - అదుపుతప్పి కారు బోల్తా, తండ్రి, కుమారుడితో పాటు మరో వ్యక్తి మృతి

**బత్తలపల్లి, మే 10 ప్రభాతవార్త** ఆనందంగా దైవ దర్శనానికి వెళుతున్న వారిలో అకస్మాత్తుగా ప్రమాదం జరిగి తండ్రి, కుమారుడి తో పాటు మరో వ్యక్తి మృతి చెందారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి గ్రామం ఔటర్ రింగ్ రోడ్ వై జంక్షన్ లో అనంతపురం వైపు నుండి కదిరి వైపు వెళుతున్న సెల్ఫ్ కారు అదుపు తప్పి బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న పదిమంది లో తండ్రి కుమారుడు మృతి చెందగా, ప్రశాంత్(30) పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం కు తరలించగా అక్కడ నుండి బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. మరో ఏడు మందికి చిన్నచిన్న రక్త గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కళ్యాణదుర్గం టౌన్ చెందిన గాజుల రామ్మోహన్ (సాఫ్ట్వేర్ ఉద్యోగి) తన కుటుంబ సభ్యులు, అతని స్నేహితులు రాజశేఖర్ రెడ్డి(45)వారి కుటుంబ సభ్యులు, ముకుందాపురం గ్రామానికి చెందిన ప్రశాంత్, అందరూ కలిసి కళ్యాణదుర్గం నుండి తిరుమల వెంకటేశ్వర స్వామి దైవదర్శనం కొరకు వెళుతూ ప్రమాదానికి గురైంది. బత్తలపల్లి గ్రామం అనంతపురం కు వెళ్లే వై జంక్షన్ కు కొద్ది దూరంలో కారు డ్రైవర్, ఓనర్ అయిన రామ్మోహన్ కారు నడుపుతూ వేగాన్ని అదుపు చేయలేక కారు ఉన్నఫలంగా బ్రేక్ వేయడంతో అదుపుతప్పి కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న కారు డ్రైవర్, ఓనర్ అయిన రామ్మోహన్, అతని భార్య మాధవి, వీరి కుమార్తెలు సాన్విక పదకొండ సంవత్సరాలు, జశ్విత 8 సంవత్సరాలు, కౌటిల్ కుమార్ నాలుగున్నర సంవత్సరం, రాజశేఖర్ రెడ్డి, భార్య దీపిక, కుమారుడు యస్విత్ రెడ్డి (7), కుమార్తె వీరాధ్య 3 సంవత్సరాలు, స్నేహితుడైన ప్రశాంత్ కుమార్ లు కారు ప్రమాదంలో దెబ్బలు తగిలి రోడ్డుపై పడి పోయారు. రోడ్డుపై వెళ్లేవారు, స్థానికులు అందించిన సమాచారం మేరకు బత్తలపల్లి పోలీస్లు, 108 సిబ్బంది సహాయంతో సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను బత్తలపల్లి ఆర్ డి టి హాస్పిటల్ కు తరలించారు.

ఆర్ డి టి హాస్పిటల్ లో రాజశేఖర్ రెడ్డి, యశ్విత్ రెడ్డిలు మృతి చెందారు. తండ్రి, కుమారుడు మృతితో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ప్రశాంత్ కుమార్కు తీవ్రగాయాలు కావడంతో ఆర్ డి టి లో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురంకు తరలించారు. మిగిలిన క్షతగాత్రులకు ఆర్ డి టి హాస్పిటల్ లో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

## రక్ష కోసం కాదు ఆడబిడ్డల పసుపుకుంకుమల రక్ష కోసమే భారత్ యుద్ధం : హోంమంత్రి వంగలపూడి

విజయవాడ, మే10, ప్రభాతవార్తప్రతినిధి: కక్ష కోసం కాదు ఆడబిడ్డల పసుపుకుంకుమల రక్ష కోసమే భారత్ యుద్ధం చేసిందని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు.ఆ మేరకు ఒక ప్రకటన విడుదల చేసారు. పెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్ ఒక్కటేనన్నారు హోంమంత్రి వంగలపూడి అనిమతసామరస్యానికి నిలువెత్తు నిదర్శనం మన దేశం భిన్నత్వంలో ఏకత్వం ఒక్క మనదేశంలోనే సాధ్యం1965, 71, 2016, 2019 లో యుద్ధవాతావరణం వచ్చినా శాంతిని పాటించాంఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజాస్వామ్యం ఏనాడూ చెక్కు చెదరలేదుపాక్ ఉగ్రవాదులు దాడికి ప్రతి భారతీయ పౌరుడి హృదయం బరువెక్కిందికాళ్ల పారాణి ఆరకముందే భర్తను తన కళ్లముందే ఉగ్రవాదులు చంపడం దుర్మార్గంసాధారణ పౌరులను కర్కశంగా కన్నపిల్లలు, కట్టుకున్న వారిముందే తుపాకులతో కాల్చడం దారుణం26 మంది చనిపోతే 150 కోట్ల మంది తమ కుటుంబసభ్యులే దూరమైనంత వేదన అనుభవించారుచనిపోయిన వారిలో ఇద్దరు మన ఆంధ్రప్రదేశ్ వారే కావడం మరింత బాధాకరంఒంగోలులో టీడీపీ కార్యకర్త హత్య జరిగితే వెళ్లి పరామర్శించానుఉగ్రదాడిలో వెనువెంటనే మన రాష్ట్ర పౌరులు ఇలా భౌతికంగా దూరమవడం జరిగిందివిశాఖలో చంద్రమోళి, కావలిలో మధుసూదన్ కుటుంబాలకు ప్రభుత్వం అన్నివిధాల అండగా ఉంటుందికావలికి చెందిన మధుసూదన్ రావు మృతి చెందిన తీరు అత్యంత విషాదకరంప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, అజిత్ దోవల్ త్రిమూర్తుల్లా దేశ ప్రతిష్టను, దేశ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టారుమహిళలైన కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ సహా ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదులను మట్టుపెట్టడం గర్వించే విషయంగవర్నర్ అబ్దుల్ నజీర్ చొరవతో మతపెద్దల సమావేశం అనివార్యం, అభినందించాల్సిన విషయంఇతర దేశాల పౌరులని హింసించడం, చంపడం భారతదేశ చరిత్రలో లేదుఆంధ్రప్రదేశ్ పౌరులను మాక్ డ్రిల్ ద్వారా అప్రమత్తం చేశాంజవాన్ మురళీనాయక్ కుటుంబ పరిస్థితి గురించి మంత్రి సవితతో ఫోన్ లో మాట్లాడానుఉన్న ఒక్క కొడుకుని సైన్యంలో చేర్పించిన ఆ కుటుంబం తెగువకు హ్యాట్సాఫ్కాల్పుల విరమణకు భారత్, పాక్ దేశాలు అంగీకరించడం ఆహ్వానించదగ్గ పరిణామన్నారు.



## కాణిపాకంలో భారీగా పెరిగిన వేసవి రద్దీ

-దర్శనానికి నాలుగైదు గంటల సమయం

కాణిపాకం, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిది వినాయక స్వామి అలయం శనివారం పోటెత్తిన భక్తులతో పోటెత్తింది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు శని, ఆదివారాలు ప్రభుత్వ సెలవు రోజులు కావడంతో పాటు విద్యాసంస్థలు, పాఠశాలల్లో ఇంటర్, 10వ తరగతి పరీక్షలు పూర్తయి ఫలితాలు రావడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్నీ భక్తులతో పోటెత్తింది. ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన

# మహిళల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా!

- కుప్పంలో మహిళల్ని పారిశ్రామిక.. వ్యాపారవేత్తలుగా మార్చే ప్రణాళిక !!
- అలీప్.. ఫ్రంటైయర్ మార్కెట్స్ ద్వారా శిక్షణలు.. ఉపాధి అవకాశాలు !!

**కుప్పం, మే 10 ప్రభాతవార్త** గతంలో డ్వాక్రా సంఘాల ఏర్పాటు ద్వారా మహిళలకు పొదుపు, ఆర్థిక లావాదేవీల వ్యవహారాల్లో కీలకం చేసిన సిఎం చంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో మరోమారు మహిళల్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నారు. కుప్పం ప్రాంతంలో మహిళల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా కుప్పంలో వివిధ కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడ) ద్వారా ఈ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. గత జనవరి నెలలో హైదరాబాద్‌కు చెందిన అలీప్ సంస్థ కుప్పంలో చేపట్టే కార్యకలాపాల కోసం వారికి సుమారు 14 ఎకరాల భూమి కేటాయించడంతో పాటు శంకుస్థాపన చేసిన విషయం విదితమే. ఇప్పటికే అలీప్ సంస్థ కుప్పం ప్రాంతంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మారాలనుకుంటున్న మహిళలకు తగు శిక్షణ తరగతులను రెండు విడతలుగా నిర్వహించింది. మహిళలు తాము ఏర్పాటుచేయదలచుకున్న చిన్న,మధ్య తరహా పరిశ్రమలు, వాటికి అవసరమైన వనరులు, ప్రొడక్ట్ ఉత్పత్తి, మార్కెటింగ్ తదితర అంశాలపై మహిళలకు కూలంకుషంగా శిక్షణ తరగతుల్లో తర్ఫీదు ఇచ్చారు. త్వరలోనే వీరికి బయటి ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించనున్నారు. దాదాపు వంద మంది మహిళలు అలీప్ సంస్థ ద్వారా ఇప్పటికే శిక్షణ పొందడం విశేష ం. ముమ్ముందు కుప్పంలో మహిళలు సొంతంగా పరిశ్రమలు స్థాపి ంచే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈసంస్థ కుప్పం వచ్చేందుకు సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి ప్రత్యేక చొరవ చూపారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఆర్థిక అక్షరాస్యత (డిజిటల్) పెంచడంతో పాటు వారు రిటైల్ డిజిటల్ ఆన్‌లైన్ వ్యాపారం నిర్వహించేందుకు ప్రస్తుతం ఫ్రంటైయర్ మార్కెట్స్ సంస్థ కుప్పంకు వచ్చింది. ఆ సంస్థ సిఇఒ అజైతాషా ఇటీవలే కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్‌తో ప్రభుత్వం తరపున ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈసంస్థ మేరీ సహేలీ పేరిట యాప్‌ను రూపొందించింది. ఈయాప్‌ను మహిళలు ఎలా వినియోగించాలి, యాప్‌లో లభించే వస్తువులు, వాటి విక్రయ వివరాలు తదితరాలు పొందుపరచారు. ఈసంస్థ ద్వారా మహిళలు గ్రామాల్లోనే ఆన్‌లైన్ డిజిటల్ వ్యాపారం చేసుకునే దుకాణాలు సైతం ఏర్పాటుచేసుకునే అవకాశం ఉంది. తద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన వివిధ రకాల ఉత్పత్తులను ఫ్రంటైయర్ మార్కెట్స్ సంస్థ నేరుగా గ్రామాల్లోకే సరఫరా చేస్తుంది. తద్వారా మహిళలు తమ ఆర్థిక స్థితిని మెరుగుపరచుకుని వ్యాపారవేత్తలుగా మారే అవకాశం ఉంది. వీటితో పాటు కుప్పంలో మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం మరిన్ని కార్యక్రమాలు ముమ్మందు నిర్వహించనుంది.

## దేవుని ఆశీస్సులు అందరిపై ఉండాలి - శ్రీవారిసేవలో ప్రముఖులు

**తిరుమల, మే 10 ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, స్వామివారి దయతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించినట్లు ప్రముఖులు తెలిపారు. జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్, సినీనటి శ్రీముఖి శనివారం ఉదయం ఆలయంలోనికి చేరుకుని దేవదేవుడి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి వేదాశీర్వచనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## 16న డిఎస్సీ హిందీ ఆన్‌లైన్ ఉచిత మోడల్ టెస్ట్

విజయవాడ, మే10, ప్రభాతవార్తప్రతినిధి: హిందిలో డిఎస్సీ రాసే అభ్యర్థులకు ఇది మంచి కబురు. ఈనెల 16న సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకూ యాప్‌లో ఉచిత డిఎస్సీ హిందీ ఆన్‌లైన్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు హిందీ సేవాసదన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఎస్. గైబువల్లి ఒక ప్రకటనలో తెలిపారు. డిఎస్సీలో స్కూల్ అసిస్టెంట్, టిజిటి, పిజిటి హిందీ పరీక్షలకు రాష్ట్రంలోని హిందీ అభ్యర్థులంతా హాజరుకావొచ్చునని పేర్కొన్నారు. ఆన్‌లైన్ మోడల్ టెస్ట్‌తో పరీక్ష రాసే విధానం, సిలబస్ అనుసారంగా ప్రశ్నాపత్రం, సమయపాలన తదితర విషయాలపై అవగాహన కలుగుతుందని వివరించారు. హిందీ సేవాసదన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని రాష్ట్రవ్యాప్తంగా డిఎస్సీ హిందీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. మిగతా వివరాలకు సెల్ : 9581386150, 9553677119, 9848783787 సంప్రదించాలని విజ్ఞప్తిచేశారు.

## మంత్రి సత్యకుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన జెఎసి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు



మంత్రి సత్యకుమార్‌కు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న ఏపి జేఏసి అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు

**అనంతపురం, మే 10 ప్రభాతవార్త బ్యూరో** అమరావతి ఆంధ్రప్రదేశ్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీ జేఏసీ) అధ్యక్షులు, రాష్ట్ర రెవెన్యూ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, శనివారం అనంతపురంలో పర్యటించిన ఆరోగ్య శాఖ సహాయ మంత్రి సత్యకుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల, ముఖ్యంగా రెవెన్యూ శాఖలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు, సంక్షేమ కార్యక్రమాలు, పరిపాలనా సవాళ్లపై సవివరంగా చర్చించారు. ముఖ్యాంశాలుగా ఉద్యోగుల భద్రత, పదోన్నతులు, సేవా నిబంధనల సరళీకరణ, వృత్తిపరమైన శిక్షణా అవకాశాలు, క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధిని మంత్రికి వినిపించారు. మంత్రి సత్యకుమార్ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందిస్తూ, ఉద్యోగుల సంక్షేమం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా కట్టుబడి ఉన్నాయని తెలిపారు. లేవనెత్తిన ప్రతి అంశాన్ని పరిశీలించి, సంబంధిత శాఖలకు తగిన ఆదేశాలు ఇవ్వడం ద్వారా వీటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశం అనంతరం వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి స్పందన మాకు ఆశాజనకంగా ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పట్ల వారి నిబద్ధత స్పష్టంగా కనిపిస్తోంది. మా ప్రతిపాదనలు త్వరలోనే అమలవుతాయన్నారు.

## టిజిఆర్‌జెసి సెట్‌కు 84 శాతం మంది హాజరు

### 12 జిల్లాల్లో 301 కేంద్రాల్లో పరీక్ష

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని విద్యాశాఖ అధ్వర్యంలో కొన సాగుతున్న రెసిడెన్షియల్ జూనియర్ కాలేజెస్‌లో ప్రవేశాల కోసం నిర్వహించే టిజిఆర్‌జెసి సెట్-2025 శనివారం ప్రశాంతంగా జరిగింది. పరీక్షకి 84.38 శాతం మంది విద్యార్థులు హాజరైనట్టు సొసైటీ కార్యదర్శి రమణ కుమార్ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 35 రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి శనివారం టిజిఆర్‌జెసి సెట్‌ను నిర్వ హించారు. 35 జూనియర్ కాలేజీల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపులను ఇంగ్లీష్ మీడియంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లను తీసు కోను న్నారు. రాష్ట్రవ్యాప్తంగా 35 జూనియర్ కాలేజీలు ఉండగా.. వాటిలో బాలురకు 15, బాలికలకు 20 గురుకుల జూనియర్ కాలేజీలు కొనసాగు తున్నాయి. ప్రవేశపరీక్షకు 72,695 మంది దరఖాస్తు చేసుకొన్నారు.



జీవో కాపిని చూపుతున్న వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

# హంద్రీనీవా లైనింగ్ పనులను ఆపించండి

- 10వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచండి
- వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం, మే 10 ప్రభాతవార్త బ్యూరో** హంద్రీనీవా లైనింగ్ పనులను వెంటనే నిలుపుదల చేసి 10వేల క్యూసెక్కుల సామర్థ్యం పెంచేలా చేస్తే చంద్రబాబుపేరు చరిత్రలో నిలబడిపోతుందని, లేదంటే రాయల సీమ ద్రోహిగా చరిత్రలో మిగిలిపోతాడని వైఎస్ఆర్‌సిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. జిల్లా వైసిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. జిల్లా పర్యటనలో చంద్రబాబునాయుడు హంద్రీనీవా విషయంలో అపద్దాలు చెప్పి చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేశారని, చరిత్ర చెరిపేస్తే చెరిగి పోదని గుర్తుంచుకోవాలన్నారు. కృష్ణ జలాల కోసం దశాబ్దాలుగా పెద్ద ఎత్తున అనేక మంది, అనేక పార్టీలు పోరాటాల ఫలితంగా హంద్రీవా ప్రాజెక్టు రూపకల్పన జరిగిందన్నారు. అయితే 1983లో ఎన్టీఆర్ ఓడిసి వద్ద, 1996లో ఉరవకొండలో చంద్రబాబునాయుడు, తిరిగి 1999లో ఆత్మకూరు వద్ద చంద్రబాబునాయుడు శంకుస్థాపనలు చేశారన్నారు. మూడు సార్లు టిడిపి హయాంలో శంకుస్థాపనలకే పరిమితం అయ్యారు తప్పా గంప మట్టి కూడా తీయలేదన్నారు. 2004లో వైఎస్ఆర్ సీఎం అయ్యాక, 2005లో ఉరవకొండలో 40 టీఎంసీల సామర్థ్యంతో హంద్రీనీవాకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారన్నారు. మాల్యాల నుంచి 12 పంపుల ద్వారా జీడిపల్లికి మొదటి దశలో జీడిపల్లి నుంచి పుంగనూరు వరకు 2వ దశ పనులు చేపట్టి, 6.2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే దిశగా పనులు చేపట్టారన్నారు. వైఎస్ఆర్ హయాంలోనే హంద్రీనీవాకు దాదాపు రూ.5వేలకోట్లు ఖర్చు చేశారన్నారు. 2012 నవంబర్ 18న అప్పటి సిఎం క ఇరణ్‌కుమార్‌రెడ్డి మాల్యాలను హంద్రీనీవా ద్వారా కృష్ణ జలాలను విడుదల చేస్తే, తమతోపాటు అప్పటి మంత్రి రఘువీరారెడ్డి నీటి వెంట పాదయాత్ర చేసి 2012 నవంబర్ 29న జీడిపల్లికి నీరు తెచ్చామని ఎమ్మెల్యే హోదాలో పయ్యావుల కేశవ్ అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేయడంజరిగిందన్నారు. వాస్తవాన్ని మరుగున పరిచేలా చంద్రబాబునాయుడు అంతా తానే చేసినట్లు చెప్పుకోవడం విడ్డూరంగాఉందన్నారు. అదే విధంగా ముఖ్యమంత్రి హోదాలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనంతపురంలో కంటి వెలుగు కార్యక్రమానికి హాజరైతే 6,300 క్యూసెక్కులకు హంద్రీనీవాను పెంచాలని, తాను సీఎం దృష్టికి తీసుకెళ్తే జీవో కూడా విడుదల చేసి రూ.4647 కోట్లతో పనులు చేపట్టేందుకు టెండర్లు కూడా పూర్తయ్యాయన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ టెండర్లను రద్దు చేసి, 3850 క్యూసెక్కులకే పరిమితం చేసి విస్తరణ పనులు చేపడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో 10వేలక్యూసెక్కులతో హంద్రీనీవాను విస్తరిస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబునాయుడు నేడు 3850 క్యూసెక్కులకు పరిమితం చేయడం వల్ల భవిష్యత్తులో అదనంగా నీరు తెచ్చుకోవాలంటే తీసుకోలేని పరిస్థితికి తీసుకెళ్లి ఈ ప్రాంత ప్రజలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా చంద్రబాబునాయుడు లైనింగ్ పనులను రద్దు చేసి 10వేల క్యూసెక్కులకు హంద్రీనీవా సామర్థ్యాన్ని పెంచాలని ఆయన సూచించారు. సమావేశంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట మధు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్ నాయకులు ఖాజా, అంజి తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మ ఆలయంలో పలు విభాగాలు తనిఖీ

- భక్తులకందిస్తున్న సౌకర్యాలపై నూతన ఇఓ వికె శీనా నాయక్ పరిశీలన



దుర్గమ్మ ఆలయ పరిసరాలు పరిశీలించి అధికారులకు ఆదేశాలిస్తున్న ఇఓ

**ఇంద్రకీలాద్రి, మే 10, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో భక్తులకందిస్తున్న సౌకర్యాలపై నూతన ఇఓ వికె శీనా నాయక్ శనివారం స్వయంగా పరిశీలించారు. దుర్గాఘాట్‌ను పరిశీలించి జల్లు సౌకర్యాల ఏర్పాటు చేయాలన్నారు. మహిళలకు దుస్తులు మార్చుకోటానికి, మరుగుదొడ్లు కు పూర్తి మరమ్మత్తులు చేయాలని ఆదేశాలిచ్చారు. ఆలయ పారిశుద్ధ్యం మరింత మెరుగ్గా నిర్వహించి శుభ్రంగా వుంచాలన్నారు. దుర్గాఘాట్లో కొబ్బరికాయలు, పూజాసామాగ్రి తదితరాలమ్మే దుకాణదారులను క్రమపద్ధతిలో పెట్టాలని, ధరల్లో తేడా వుండకూడదని సిబ్బందికి ఆదేశాలిచ్చారు. తలనీలాలు సమర్పించే భక్తులకు కేశ ఖండన శాలలో ఇబ్బందులుండకుండా చర్యలు తీసుకోవాలని, భక్తులతో మర్యాదగా మెలగాలని ఆదేశాలిచ్చారు. కుమ్మరిపాలెంలో వున్న స్థలంపై వివరాలు తెలుసుకుని అక్కడ భక్తుల సౌకర్యార్థం రూపొందించిన వివరాలు తెలుసుకున్నారు. మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్ ఎదురుగా వున్న కొండప్రాంతం పరిశీలించి రెండవ ఘాట్‌గురించి రూపొందించిన ప్రతిపాదనల వివరాలు తెలుసుకున్నారు. ఆలయ భద్రతలో కీలకమైన శివాలయం దిగువ మెట్టు, రుద్రహోమం మండపం ప్రాంతం, పరిశీలన చేసి ఉత్తరంవైపు మెట్ల దారిలో గతంలో వున్న సిబ్బంది నివాస సముదాయం ప్రాంతం భద్రత రీత్యా ఉపయోగంలోకి తీసుకురావడానికి పరిశీలన చేయాలన్నారు. కొండపైన అక్షరాభ్యాసం, అన్నప్రసాన కార్యక్రమాలు నిర్వహించే మండపం పరిశీలించి భక్తుల సెంటిమెంట్లను పరిశీలిస్తు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొండమీద వివిధ ప్రాంతాల్లో గల మంచినీటి కూలర్స్ పరిశీలించి, కూలర్లపై శుభ్రం చేసిన తేదీ నమోదు చేయాలన్నారు. ఉచిత ప్రసాదం పంపిణీ పరిశీలించి భక్తులు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణంలో వున్న యాగశాల పూజా మండపాలు పరిశీలించి భక్తులకు త్వరగా అందుబాటులోకి తేవాలన్నారు.

దుర్గమ్మవారి ఆలయంలో శనివారం సాయంత్రం విజయవాడకు చెందిన నర్తన డ్యాన్స్ ఇన్స్టిట్యూట్ నృత్య విద్యార్థులు ఆచార్య పి మానస నేతృత్వంలో వారి విద్యార్థులు భక్తిశ్రద్ధలతో పలు కీర్తనలకు, సంకీర్తనలకు, భక్తిగీతాలకు అనుగుణంగా నృత్యనీరాజనమర్పించి భక్తులను ఆకట్టుకున్నారు. కళాకారులకు దుర్గమ్మవారి దర్శనాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు.

## అన్న మృతి.. తమ్ముడు ఆత్మహత్య

**కర్నూలు, మే 10, ప్రభాతవార్త :** తోడబుట్టిన సోదరుడు ఆత్మహత్య చేసుకుని మరణించాడన్న మనస్థాపనతో యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. నాలుగు నెలల వ్యవధిలో అన్నదమ్ములు మృతి చెందడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు నగరంలోని రామచంద్ర నగర్లో నివాసముంటున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రాకేష్ గౌడ్ హైదరాబాదులో సాఫ్ట్వేర్ ఇంజనీరుగా పనిచేసేవాడు. నాలుగు నెలల క్రితం అతనికి వివాహం చేశారు. అయితే వివిధ కారణాలతో వివాహం జరిగిన 20 రోజులకే రాకేష్ ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. ఈ ఘటనతో తీవ్రమనస్థాపానికి గురైన రాకేష్ సోదరుడు వంశీ కృష్ణ గౌడ్ (30) మనస్థాపానికి గురై శనివారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. 4 నెలల క్రితం అతని అన్న రాకేష్ గౌడ్ ఆత్మహత్య చేసుకున్నప్పటి నుంచి అన్న మృతిని జీర్ణించుకోలేక కొన్ని రోజులుగా మనస్థాపానికి గురై, అదోమాదిరిగా ఎవ్వరితో మాట్లాడకుండ ఉండేవాడు. ఈ నెల 7వ రాకేష్ గౌడ్ తండ్రి శ్రీనివాసులు కుటుంబ సమేతంగా బంధువుల వివాహానికి వెళ్ళాడు. అయితే తమతో కూడా వివాహానికి రమ్మని వంశీని పిలిచినప్పటికీ అతను నిరాకరించాడు.

దీంతో వంశీకృష్ణను ఇంటి వద్ద ఉంచి బంధువుల పెళ్లికి వెళ్లారు. తిరిగి వచ్చేపరికి వంశీకృష్ణగౌడ్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల నుండి విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వగా రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ అనుపత్రికి తరలించారు. తండ్రి శ్రీనివాసగౌడ్ ఇచ్చిన. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఆశా వర్కర్లు దుర్మరణం

**విజయవాడ, మే10, ప్రభాతవార్తప్రతినిధి:** మచిలీపట్నం- విజయవాడ జాతీయ రహదారి గూడూరు మండలం తరకటూరు గ్రామం వద్ద శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మచిలీపట్నం రైల్వే స్టేషన్ వద్ద గల శుభం కళ్యాణ మండపంలో జరగనున్న ఆశా వర్కర్ల సదస్సుకు హాజరవ్వటానికి వస్తున్న ఆటో తరకటూరు గ్రామం కియా కారు ఢీ కొట్టడంతో సంఘటనా స్థలంలో ఇద్దరు మృతి చెందగా, నలుగురికీ తీవ్ర గయాలపాలయ్యారు. తాడేపల్లి విజయలక్ష్మి( 45) గోపునేనిపాలెం పమిడిముక్కల మండలం, ఊటుకూరి దుర్గ (40) కపిలేశ్వరం పి.హెచ్.సి తాడంకి గ్రామం ఇద్దరు ఘటనా స్థలం వద్ద మృతి చెందారు. వాణి తాడంకి గ్రామం, గుండె నాగమల్లేశ్వరి మద్రివాడ గ్రామం, గుండె నిర్మల జ్యోతి మద్రివాడ గ్రామం, మాగంటి సుజాత తాడంకి గ్రామంకు చెందినవారు.

# ఇస్లాం పేరిట మారణహోమం సృష్టిస్తున్న పాక్

## ఎంపి అసదుద్దీన్ ఒవైసి ఆరోపణ



సభలో ప్రసంగిస్తున్న ఎంపి అసదుద్దీన్ ఒవైసి

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 10, ప్రభాతవార్త:** పాకిస్థాన్ ఇస్లాం పేరుతో మారణహోమం సృష్టిస్తున్నదని ఇస్లాం పేరును పలికే అర్హత కోల్పోయిందని, అమాయకులను, చిన్నపిల్లలను చంపమని ఇస్లాం చెప్పలేదని, పాకిస్థాన్ దాడి చేస్తే భారత్ తగ్గే ప్రశక్తి లేదని ఎఐఎంఐఎం పార్టీ అధినేత, పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఓవైసి స్పష్టం చేశారు. భారత జవాన్‌లకు మనమందరం మద్దతుగా ఇవ్వాలని, చచ్చేవరకు భారత భూమి కోసమే బతకాలని ఆయన ఉద్వేగంగా ప్రసంగించారు. అంతేకాకుండా ఆయన సంచ నలమైన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఉర్దూ జర్నలిస్ట్స్ అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ప్రసంగించారు.

భారత్ నుంచి పాకిస్తాన్ విడిపోయిన తరువాత ఇక్కడి హిందువులకు, ముస్లింలకు మధ్య విద్వేషాలను రెచ్చగొట్టాలని చూసిందని ఆయన ఆరోపించారు. పాకిస్తాన్ ఆర్మీ జవానులను టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడుతున్నదని, తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసిందని, దీంతో పాకిస్థాన్ భారత సరిహద్దు రాష్ట్రాలపై డ్రోన్లు, మిస్సైళ్లతో దాడికి ప్రయత్నిస్తున్నదని, ఈ దాడులను భారత్ పూర్తిగా ఎదుర్కొం టుందన్నారు. భారతదేశంలోని ముస్లింలు దేశం కోసం ప్రాణాలను అర్పించడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. పాకిస్తాన్ పచ్చి అబద్దాలతో ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టుకోవాలని చూస్తున్నదని, కాని వారి మాటలు నమ్మే స్థితిలో ఎవరూ లేరని చెప్పారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీల నాయ కులు విభేదాలను విడనాడి దేశరక్షణ కోసం ఐక్యంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రైల్వేస్టేషన్లలో భద్రత కట్టుదిట్టం

**హైదరాబాద్ (తార్నాక), మే 10, ప్రభాతవార్త:** భారత్.. పాకిస్థాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో రైల్వే ప్రయాణికుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు దక్షిణ మధ్యరైల్వే సీపీఆర్వో శ్రీధర్ వెల్లడించారు.

నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్‌లైన సికిందరాబాద్, కాచిగూడలో భారీగా భద్రతను పెంచినట్లు తెలి పారు. సీసీ కెమెరాల సంఖ్యను సైతం పెంచి పర్యవేక్షణ చేస్తున్నట్లు శ్రీధర్ పేర్కొన్నారు.

# టెట్రాపాడ్స్‌తో కృష్ణా ప్రాజెక్టులకు భద్రత

## ఎన్‌ఎస్‌పి, పులిచింతల, ప్రకాశం బ్యారేజీలకు పొంచి ఉన్న నష్టం

### తెలంగాణ డ్యాం సేఫ్టీ అథారిటీ భయాందోళనలు

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** శ్రీశైలం బ్యారేజి పునాదుల్లో గొయ్యి టెట్రాపాడ్స్‌ను వినియోగించి తాత్కాలిక మరమ్మతు చేపడితే శ్రీశైలం ప్రాజెక్టు మాత్రమే కాకుండా దిగువన కృష్ణానదిపై ఉన్న నాగార్జునసాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజిలకు పొంచి ఉన్న ప్రమా దం నివారించడమేకాకుండా కృష్ణానది పరివాహక ప్రాంతంలో నివాసం ఉండే ప్రజలకు భద్రత కల్పించే అవకాశం మెరుగుపడుతోంది. రిజర్వాయర్స్ మేనేజ్ మెంట్ కమిటీ మూడేళ్ల క్రితం మరమ్మతుల అవసరాన్ని, నిధుల కేటాయింపులపై కృష్ణా బోర్డుకు నివేదిక ఇచ్చింది. జాతీయ ఆనకట్ట భద్రతా ప్రాధికారసంస్థ కూడా పలు సిఫార్సులు చేసింది. ముంబయి సముద్రతీరం కోతకు గురికాకుండా ఏర్పాటు చేసిన టెట్రాపాడ్స్‌ను శ్రీశైలం ప్రాజెక్టు తాత్కాలిక మరమ్మతకు వినియో గించాలని తెలంగాణ డ్యాం సేఫ్టీ అథారిటీ సూచించింది. ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్‌కు రిసెర్చ్ బాధ్యతలు అప్పగించింది.

శ్రీశైలం డ్యాం దిగువన ఏర్పడిన గొయ్యితో ప్రమాదం ఉన్నప్పటికి ఆ ప్రాజె క్టును నిర్వహించే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నదని తెలంగాణ రాష్ట్రం నుంచి విమర్శలు వెల్లువెత్తున్నాయి. 2009లో కృష్ణా నదికి వచ్చిన భారీ వరదలతో పెద్ద గొయ్యిఏర్పడింది. నీటిపారుదలశాఖ ఇంజనీర్లు ప్లంజ్ పూల్ అనే పరిభాషతో డ్యామేజిని పిలుస్తారు. అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2014 వరకు శ్రీశైలం ప్రాజెక్టు ఒ అండ్ ఎం పై శ్రద్ధను పెట్టలేదు. రాష్ట్రం 2014లో విభజించడంతో అవశేష ఆంధ్రప్రదేశ్‌కు శ్రీశైలం నిర్వహణ బాధ్యతలు ఇవ్వగా, తెలంగాణకు నాగార్జునసాగర్ నిర్వహణ బాధ్యతలు ఇచ్చారు. అవశేష ఆంధ్రప్రదేశ్ పాలకులు కూడా శ్రీశైలం నుంచి రోజు ఎనిమిది టిఎంసిల నీటిని తరలించుకుపోతున్నారే కానీ గొయ్యి విషంలో శ్రద్ధ తీసుకోవడంలేదు. గత 16 సంవత్సరాలుగా ప్రతి ఏటా వరదతో ఇది మరింత పెద్దదిగా గొయ్యి అవుతోంది. జాతీయ సంస్థలు చేసిన రీసెర్చ్‌లలో ఈ గొయ్యి దాదాపు 143 అడుగుల లోతు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని సంవత్సరం క్రితం హెచ్చరికలు చేసినా ఆంధ్రప్రదేశ్ పాలకులు మాత్రం నిర్లక్ష్యం వీడలేదు. ఇరువై నాలుగు రోజుల్లో నైరుతి రుతుపవనాలు తెలుగు నేలపై రానే వస్తున్నాయి. గత కొద్ది సంవత్సరాలుగా కృష్ణానదికి అంతంత మాత్రమే వరద వచ్చింది. ఈసారి భారీ స్థాయిలో వరదలు వస్తే డ్యాం పరిస్థితి ప్రమాదకరంగా మరుతుందని సర్వత్రా ఆందోళన మొదలైంది.. తెలంగాణ ఇఎన్సీ, డ్యాంసేఫ్టీ కమిటీ ఛైర్మన్ జి.అనిల్‌కుమార్ 'శ్రీశైలం డ్యాం తెలుగు రాష్ట్రాలకు అత్యంత కీలకం. ఆనకట్ట దిగువన భారీ గొయ్యి ఉండటం మంచిది కాదు. ఎన్డీఎస్‌ఏ సిఫార్సులను వెంటనే అమలు చేయాలి. తాత్కా లికంగా టెట్రాపాడ్స్‌తో ఈ పెద్ద గొయ్యి పూడ్చవచ్చు. డ్యాం నిర్వహణ ఏపీ పరిధిలో ఉన్న నేపథ్యంలో వీలైనంత త్వరగా వారు స్పందించాలి' అంటూ అనేక వేదికలపై మాట్లాడుతూ ఒత్తిఇడి పెంచుతున్నారు.

శ్రీశైలం ఆనకట్ట రక్షణపై తెలంగాణ డ్యాం సేఫ్టీ కమిటీ ఆందోళన వ్యక్తం చేస్తూ నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఇటీవల ప్రజంటేషన్ ఇచ్చింది. అంతేకాకుండా పలు లేఖలు రాసింది. కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో కూడా కమిటీ ఛైర్మన్, ఇరిగేషన్ శాఖ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్ మరోమారు మరమ్మతుల విషయాన్ని గుర్తు చేశారు. శాశ్వత మరమ్మతులు ఇప్పటికిప్పుడు సాధ్యం కాకపోయినా తాత్కాలిక పనులు చేపట్టాల్సిన అవసరాన్ని ఆయన సూచించారు.

పునాది కన్నా గొయ్యి లోతుగా ఉంది అని నీటిపారుదల శాఖ నిపుణులు అంటున్నారు. కృష్ణా నదిలో 14 లక్షల క్యూసెక్కుల స్థాయిలో భారీగా వరద వచ్చినా నీటిని దిగువకు విడుదల చేసేలా శ్రీశైలం ఆనకట్టను డిజైన్ చేసి అప్పట్లో నిర్మించారు. 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలిస్తున్న సమయంలో డ్యామ్ నీటి నిర్వహణకు తిలోదకాలు ఇవ్వడంతో ఒక్కసారిగా 25 లక్షల క్యూసెక్కుల వరద దిగువకు వదలాల్సి వచ్చింది. ఆ సమయంలో డ్యాం గేట్ల దిగువన స్పిల్‌వేకు సమీపంలో భారీ గొయ్యి పడింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ ఈ గొయ్యిపై బాతిమెట్రిక్ సర్వేను చేసింది. 400 మీటర్ల వెడల్పు, 143 అడుగుల లోతుగా ఈ గొయ్యి ఉన్నట్లు నివేదించింది.

ఆనకట్ట పునాది కన్నా లోతులో ఈ గొయ్యి ఉన్నట్లు బాతిమెట్రిక్ సర్వేలో గుర్తించారు. శ్రీశైలం ఆనకట్ట దిగువన ఏర్పడిన ప్లంజ్‌పూల్ ముప్పును తెలంగాణ రాష్ట్ర డ్యాం సేఫ్టీ కమిటీ అంచనా వేసిన వెంటనే ఎన్డీఎస్‌ఏకు నివేదించింది. శ్రీశైలం జలాశయం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకే కాకుండా చెన్నైకి తాగునీరు అందించే ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టు. వర్షాకాలంలో నిల్వ సామర్థం 215 టీఎంసీలు ఉంటే అది 23 లక్షల క్యూ సెక్కుల ప్రవాహంతో సమానం. ఎండాకాలంలో నీళ్ల అడుగంటిన సమ యంలో 130 టీఎంసీలు అంటే 14 లక్షల క్యూసెక్కులకు సమానంగా ఉంటాయి.

ఆనకట్టకు ఏదైనా అనుకోని ప్రమాదం ఏర్పడితే ఇంత భారీ ప్రవాహం డ్యాం నుంచి ఒకేసారి దిగువకు విడుదలవుతుంది. దిగువన ఉన్న నాగార్జునసాగర్ తర్వాత ఉన్న పులిచింతల, ప్రకాశం బ్యారేజీల పరిస్థితి తీవ్ర ప్రమాదంలో పడుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వరద ఒక్కసారి వూళ్ళపై పడితో కోటికిపైగా మంది ప్రజలు బంగాళాఖాతంలో నిమజ్జనం అయ్యే అవకాశం ఉన్నప్పటికి మరమ్మతుపై దృష్టి సారించడంలేదు. శ్రీశైలంలో జల విద్యుత్ ఉత్పాదన కూడా జరుగుతోంది. తెలంగాణ వైపు 900 మెగావాట్లు, ఏపీ వైపు 770 మెగావాట్ల జలవిద్యుత్ కేంద్రాలు ఉన్నా యి. వీటన్నింటిపైనా ప్రభావం పడుతుందని నివేదికను సమర్పించింది.

# కులగణన చరిత్రాత్మక నిర్ణయం

### రాజ్యసభ సభ్యుడు డా.లక్ష్మణ్

**హైదరాబాద్ (పంజగుట్ట), మే 10, ప్రభాతవార్త:** బీసీలకు నిజమైన గణాంకాలు లేకపోవడం వల్లే రిజర్వేషన్‌ల పెంపుదల మీద సమస్యలు వస్తున్నాయని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. శనివారం హైదరాబాద్‌లో కులగణన, ఓబీసీల భవిష్యత్ నిర్మాణం, సామాజిక న్యాయం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం న్యాయమైన మార్గంలో కులగణన చేపట్టటం ఒక కీలకమైన చర్య అన్నారు. కులగణన పూర్తయితే రాజకీయ హక్కులు, విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధిలో బీసీలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. తెలంగాణలో గతంలో జరిగిన సర్వేలకు సంబంధించి న్యాయస్థానాల్లో నిలబడుతుందా లేదా అన్న అంశం కూడా చర్చించాలన్నారు. జనగణనతో కులగణన చేయడం చరిత్రాత్మక నిర్ణయం అన్నారు. మరో ముఖ్య అతిథిగా విచ్చేసిన యూపీ మంత్రి నరేంద్రకశ్యప్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు తెలివైనవారు, బుద్ధిమంతులని, మనలో చైతన్యం లేకపోవడం వల్లే ఇన్ని సంవత్సరాలు మనం వెనుకబడ్డామన్నారు. రాజ్యసభ సభ్యుడు ఆర్.క్రిష్ణయ్య మాట్లాడుతూ ప్రతిపక్షాలకు భయపడి మోడీ కులగణన చేశారని అంటున్నారు కానీ పాకిస్థాన్‌కే భయపడలేదు.. మోడీ కాంగ్రెస్‌కు భయపడతారా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన కులగణనలో చిత్తశుద్ధిలేదని ఆయన విమర్శలు చేశారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో మేధావులు, ఓబీసీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని తమతమ అభిప్రా యాలను వెల్లడించారు.

# రాష్ట్రంలో ఐఐటి, ఐఐఎం నెలకొల్పండి

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి చలగాని దయాకర్ వినతి

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఐఐఎం నెలకొల్పడంతోపాటు ఐఐటి సీట్లు పెంచాలని నూతన ఐఐటిలను ఏర్పాటు చేయాలని పిసిసి అధికార ప్రతినిధి చలగాని దయాకర్ డిమాండ్ చేశారు. శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలుసుకొని ఐఐటి సీట్ల పెంపు విషయంలో తెలంగాణను విస్మరించారని తిరుపతి, జమ్మూకశ్మీర్, పాలక్కాడా చత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాలలో మాత్రమే సీట్లు పెంచారని ఆయన గుర్తుచేశారు. 130 ఫ్యాకల్టీలను రూ.11828.79కోట్లతో చేయాలని నిర్ణయించారని ఇది గొప్ప పరిణామంగా ఆయన అన్నారు. తెలంగాణలో 2008లో ఐఐటిని హైదరబాద్‌లో ఏర్పాటు చేశారని జాతీయ ర్యాంకు కూడా వచ్చిందని ఆయన మంత్రికి తెలిపారు. ఐఐటి ప్రఖ్యాతి పెంచేందుకు మరోఐదువందల సీట్లు పెరిగేలా నూతన ఐఐటిలను నెలకొల్పాలని ఆయన కోరారు. తెలంగాణలో వైద్య,సాంకేతిక రంగాలతోపాటు ప్రాథమిక మాధ్యమిక విద్య అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని మంత్రికి వివరించారు. ప్రతి సంవత్సరం 10లక్షల మంది డిగ్రీ, ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరుతున్నారని రెండులక్షల మంది జెఇఇ మెయన్స్‌కు దరఖాస్తులు చేసుకుంటున్నారని వారి ఉత్సాహంకు అనుగుణంగా సీట్లు పెంచాలని కోరారు.

# 13న మరో రూ.2,500 కోట్ల రుణం

### సెక్యూరిటీ బాండ్లను విడుదల చేసిన సర్కార్

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** తెలంగాణ సర్కార్ మరో 2,500 కోట్ల రూపాయల మేర అప్పు తీసుకోవడానికి సెక్యూరిటీ బాండ్లను విడుదల చేసింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ నెల 13న నిర్వహించనున్న రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను ఈవేలం వేయడం ద్వారా ఈ రుణాన్ని సేకరించనుంది. ఈ రుణంలో 21 ఏళ్ల కాల పరిమితితో 800 కోట్ల రూపాయలు, 22 ఏళ్ల కాల పరిమితితో మరో 800 కోట్ల రూపాయలు, 25 ఏళ్ల కాల పరిమితితో ఇంకో 900 కోట్ల రూపాయల చొప్పున రుణాన్ని సమీకరించనుంది. ఇక తెలంగాణ సహా దేశంలోని 7 రాష్ట్రాలు 11,500 కోట్ల రూపాయల చొప్పున రుణాలు తీసుకోనున్నాయి. ఇక ఈ ఆర్థిక సంవత్సరంలోని ఏప్రిల్ నుండి జూన్ వరకూ తొలి క్వార్టర్‌లో 14 వేల కోట్ల రూపాయల మేర రుణ సమీకరణ కోసం రిజర్వ్ బ్యాంక్‌కు తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఇందులో భాగంగా ఏప్రిల్‌లో 3 దఫాల్లో రూ.4,400 కోట్లు తీసుకున్నది. ఈ త్రైమాసికంలోని ఈ రెండో నెలలో 6వ తేదీన ఇంకో 2 వేల కోట్ల రూపాయలు సేకరించింది. తాజాగా విడుదల చేసిన బాండ్లతో ఈ నెల 13వ తేదీన మరో 2,500 కోట్ల రూపాయలు తీసుకోనున్న నేపథ్యంలో ఈ క్వార్టర్‌లో ఇప్పటి వరకూ 8,900 కోట్ల రూపాయల రుణం తీసుకున్నట్లవుతుంది.

# మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకంలోకి మిరప

### 1,72,135 టన్నులకు మద్దతు ధర లోటు చెల్లింపు

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** తెలంగాణ మిరప రైతుల నిమిత్తం కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ లోని ధరలో లోటు చెల్లింపు (పిడిపి) ద్వారా రైతులకు మద్దతు అందించనుంది. మిరప రైతులు సాగు ఖర్చు కంటే తక్కువ ధరకు పంటను అమ్మాల్సి రావడంతో, ఈ అంతరాన్ని పూడ్చడానికి ఈ మద్దతు ధరను ఇవ్వనున్నారు. మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ పథకం తెలంగాణలో అమలు చేస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ధృవీకరించింది. ఇందుకు అవసరమైన చర్యలు ప్రారంభించాలని తెలంగాణ వ్యవసాయ శాఖను ఆదేశించింది. రాష్ట్రంలోని ఖమ్మం, మహబూబాబాద్, గద్వాల్, కొత్తగూడెం, భూపాలపల్లి, ములుగు, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మిర్చి అధికంగా పండుతుంది. రాష్ట్రంలోని రైతులు ప్రస్తుతం తమ ఉత్పత్తి ఖర్చు కంటే తక్కువ ధరకు మిరపకాయలను అమ్ముకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ అంచనా వేసిన మిరప ఉత్పత్తి 6,88,540 టన్నులలో 1,72,135 టన్నులను (అంటే 25 శాతం) మేర మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకంలోకి తీసుకురానుంది. మార్కెట్ ధర, ఉత్పత్తి ఖర్చు మధ్య వ్యత్యాసాన్ని కవర్ చేస్తారు. మిర్చి రేటు క్వింటాలుకు రూ.10,374గా నిర్ణయించబడింది. ప్రారంభంలో, రాష్ట్ర సర్కార్ ఈ మొత్తాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుంది. తదుపరి ఆమేరకు సొమ్మును కేంద్రం తిరిగి చెల్లిస్తుంది. దీనికోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 శాతం భరిస్తాయి. కాగా కొంతమంది దళారులు క్వింటాలుకు రూ.5 వేల నుండి రూ.6 వేల వరకు చాలా తక్కువ ధరకు రైతుల నుండి మిర్చిని కొనుగోలు చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు చేరాయి. ఈ నేపథ్యంలో కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది.




పి.వి.రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాలమహానాడు నాయకులు

# అణగారిన వర్గాలను పాలకులుగా చేయడమే పి.వి.రావు లక్ష్యం: పబ్బతి శ్రీకృష్ణ

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 10, ప్రభాతవార్త:** గౌతమబుద్ధుడు, జ్యోతి రావ్ పూలే, డా.బి.ఆర్.అంబేద్కర్‌ల స్ఫూర్తితో అణిచివేతలకు గురైన ప్రజలను పాల కులుగా చేయడమే మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉ మ్మడి ఎపిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో వెలువడిన 'ఆంధ్రప్రదేశ్' మాసపత్రిక సంపాదకుడు స్వర్గీయ పి.వి.రావు ఆశయమని, ఆయన ఆశయాల సాధన కోసం కృషి చేస్తా_మని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ చెప్పారు. శనివారం ఎన్‌ఎస్‌ఎస్‌లో జరిగిన పి.వి.రావు 73వ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పి.వి.రావు స్థాపించిన మాలమహానాడు నైతిక విలువలు, సామాజిక బాధ్యతల కోసం తాము శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. తెలుగు, ఇంగ్లీషు, మరాఠి, హిందీ, ఉర్దూలో పట్టున్న పి.వి.రావు ఆంధ్రప్రదేశ్ మాసపత్రికకు ఎడిటర్‌గా పనిచేశారని తెలిపారు. అంతకుముందు మాలమహానాడు నాయకులు పి.వి.రావు చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు.

# తెలంగాణ ప్రతిష్టను దెబ్బ తీయాలని చూస్తున్న ఎమ్మెల్సీ కవిత

### భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** మిస్‌వరల్డ్ కాంపిటేషన్‌లను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్సీ కవిత తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను దెబ్బ తీయాలని చూస్తున్నదని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. మిస్ వరల్డ్ కాంపిటీషన్‌పై ఎమ్మెల్సీ కవిత చేసిన కామెంట్స్ పై స్పందించిన భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రతి అంశాన్ని రాజకీయం చేయాలని ఏదో ఒకటి వివాదస్పదంగా మాట్లాడాలి అన్నా ఆలోచన ఉన్నా రని ఆయన ఆరోపించారు.

మిస్ వరల్డ్ కాంపిటీషన్ లను పోస్ట్ ఫోన్ చేయడం లేదా రద్దు చేయడం వంటి కార్యక్రమాలు తెలంగాణ ప్రభుత్వానికి చేసే అధికారం లేదని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం కేవలం ఒక ఫెలిసేటేటర్ మాత్రమే అని ఆయన గుర్తుచేశారు. తెలంగాణ ఈరోజు చాలా సేఫెస్ట్ ప్లేస్ అని తెలంగాణలో పెట్టుబడులు పెట్టొచ్చని ఎంపి వివరించారు. తెలంగాణలో ఇంత పెద్ద ఈవెంట్లు ప్రపంచవ్యాప్తంగా చూస్తున్నటువంటి ఈవెంట్లను చేయ వచ్చని, నాలుగైదునెలల క్రితం ఈ ప్లేస్ తెలంగాణను సెలెక్ట్ చేసుకోవడం జరిగిందని ఆయన గుర్తుచేశారు. ఈరోజు మిస్‌వరల్డ్ లిమిటెడ్ అనే కంపెనీ ఇక్కడ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. కవిత అమెరికాలో కూడా చదువుకొని వచ్చింది, ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం పరిధి ఏంటి అనేది ఆమెకి అర్థం అయి ఉండాలి కానీ రాజకీయం చేయాలన్న దురుద్దే శంతో కాకుండా వాస్తవాలు మాట్లాడాలి చామల కోరారు.

# అందాల పోటీలకు నిరసన సెగ

### పలు మహిళా సంఘాల ప్రతినిధుల అరెస్ట్

### అందాల పోటీలు సిగ్గుచేటు: పిఒడబ్ల్యు సంధ్య

**హైదరాబాద్ (సైబరాబాద్ ప్రతినిధి), మే 10, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న మిస్‌వరల్డ్ అందాల పోటీలకు పలు మహిళా సంఘాల నుంచి తీవ్ర నిరసన ఎదురైంది. మహిళా సంఘాల ప్రతి నిధులు తమ కార్యకర్తలతో కలిసి శనివారం గచ్చిబౌలి స్టేడియం వద్ద నిరసన తెలియ చేయడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్‌వరల్డ్ పోటీలు ప్రారంభం కావడానికి ముందు ఒక్కసారిగా దూసుకువచ్చిన ప్రగతిశీల మహిళాసంఘంతోపాటు ఇతర మహిళా సంఘాల ప్రతినిధులు నిరసనకు దిగారు. మిస్‌వరల్డ్ పోటీలను వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. అందాల పోటీలు నిర్వహించడం తగదంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఒక దశలో వీరు స్టేడియం లోపలికి దూసుకువెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులకు, మహిళా కార్యకర్తలకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. దీంతో నిరసనకారులను అరెస్టుచేసిన పోలీసులు సమీపానవున్న పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా దాదాపు వంద మందిని అరెస్టు చేయగా తమలో కొందరికి గాయాలయ్యాయని మహిళా కార్యకర్తలు వాపోయారు. పిఒడబ్ల్యు, సిఎమ్ఎస్, ఐద్వా, ఎయిమ్స్, పిడిఎస్‌యు, పివైఎల్ తదితర సంఘాలు మిస్ వరల్డ్ అందాల పోటీలకు వ్యతిరేకంగా నిరసనలో పాల్గొన్నారు.



గచ్చిబౌలి స్టేడియం వద్ద మహిళా సంఘాల ప్రతినిధులను అరెస్టు చేస్తున్న దృశ్యం

ఈ సందర్భంగా పిఓడబ్ల్యూ సంధ్య మా ట్లాడుతూ మిస్ వరల్డ్ అందాల పోటీలు సామ్రాజ్య వాద విష సంస్కృతికి నిదర్శన మన్నారు.

ఈ పోటీలకు వ్యతిరేకంగా గచ్చిబౌలి స్టేడియం ముందు తాము నినదిస్తుండగా తాదుతో రౌండప్‌చేసి తమ జెండాలను, బ్యాడ్జిలను బల వంతంగా లాక్కొని తమను పోలీస్ వ్యాన్‌లో ఎక్కించారన్నారు.

ఓవైపు రాష్ట్రంలో సామాన్యులు ఇబ్బందులు పడుతుంటే అందాల పోటీలు నిర్వహించడం సిగ్గచేటన్నారు.

# రికార్డు స్థాయిలో యాసంగి

### 79.96 లక్షల ఎకరాల్లో సాగు

### వ్యవసాయ శాఖ తుది నివేదిక వెల్లడి

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రస్తుత యాసంగి సీజనులో వివిధ పంటల సాగు రికార్డు స్థాయిలో నమోదైంది. యాసంగి సాధారణ సాగు విస్తీర్ణం 63,54,286 ఎకరాలు కాగా, ఈ సీజనులో రాష్ట్రవ్యాప్తంగా 79,96,302 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. నిరుడు యాసంగిలో సాగైన విస్తీర్ణంతో పోలిస్తే ఇది 12.25 లక్షల ఎకరాల మేర ఎక్కువ కావడం విశేషం.

ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ తుది నివేదికను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించింది. గత 2023-24 సీజనులో 67,70,396 ఎకరాల్లో పంటలు సాగవ్వగా, ఈసారి సుమారు 80 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేయటం విశేషం. యాసంగిలో సాగైన మొత్తం పంటల్లో అత్యధికంగా వరి 59,84,302 ఎకరాల్లో వరి సాగైంది. అలాగే 3,67,440 ఎకరాల్లో జొన్న, 9,13,411 ఎకరాల్లో మొక్కజొన్న, 2,22,772 ఎకరాల్లో శనగ, 56,273 ఎకరాల్లో మినుము, 2,51,115 ఎకరాల్లో వేరుశనగ, 31,444 ఎకరాల్లో నువ్వులు, 21,491 ఎకరాల్లో పొద్దుతిరుగుడు, 19,132 ఎకరాల్లో పొగాకు, 17,195 ఎకరాల్లో చెరకు పంటలు సాగైయ్యాయి. ఇక అత్యధికంగా రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లాలో 5,82,122 ఎకరాల్లో వివిధ పంటలతో అగ్రస్థానంలో ఉంది. అత్యధికంగా పంటలు సాగైన జిల్లాల్లో 5,31,682 ఎకరాలతో నిజామాబాద్ రెండో స్థానంలోను, 4,92,748 ఎకరాలతో సూర్యాపేట్ మూడో స్థానంలో ఉన్నాయి. అలాగే రాష్ట్రంలోనే అత్యల్పంగా 16,672 ఎకరాలతో మల్కాజిగిరి చివరి స్థానంలో ఉన్నట్లు వ్యవసాయ శాఖ పేర్కొంది.

# థర్మల్ పవర్ ప్రాజెక్టుకు భద్రత కట్టుదిట్టం

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** భారత్, పాకిస్థాన్ సరిహద్దులో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్రం నేషనల్ థర్మల్ పవర్ (ఎన్టీపీసీ) ప్రాజెక్టుల్లో భద్రతను కట్టుదిట్టం చేసింది. దేశంలోనే కీలకమైన విద్యుత్ కేంద్రంగా గుర్తింపు పొందిన రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టులో భద్రతా వ్యవస్థను పటిష్ఠం చేశారు. దక్షిణాదిలోని అన్ని రాష్ట్రా లకు ఈప్రాజెక్టు నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోంది. దేశంలోని అన్ని కీలక ప్రాజెక్టులలో అలర్ట్ ప్రకటించిన క్రమంలో కేంద్రం రామగుండం ప్రాజెక్టులో భద్రతా వ్యవస్థను పెంచాలని ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. సీఐ ఎస్‌ఎఫ (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్) కేంద్రం ఆదేశాలతో అప్రమత్తమైంది. రోజువారీ భద్రతను పెంచడంతోపాటు అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. డ్రోన్ దాడులతో పాటు, విపత్తు సంభవిస్తే ప్రతి స్పందనకు సంబంధించి

# ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించాలి

### నా వ్యాఖ్యలను వక్రీకరించారు

### సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ



శనివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూమ్‌భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న పార్టీ జాతీయ కార్యదర్శి కె. నారాయణ

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రపంచవ్యాప్తంగా మానవాళికి బద్ధశత్రువైన ఉగ్రవాదం ఏ మతంలో ఉన్నా, ఏ కులంలో ఉన్నా, ఏ ప్రాంతంలో ఉన్నా దానిని సమూలంగా నిర్మూలించాల్సిందేనని సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. ఆడపిల్ల కన్నీరు ఊరికే పోదని, ఆపరేషన్ సిందూర్ భారత సైన్యం పక్కా ప్రణాళికతో పాకిస్థాన్ కేంద్రంగా కరుడుగట్టిన ఉగ్రవాదులు శిక్షణ పొందిన పలు కీలక ఉగ్రవాదుల శిక్షణ కేంద్రాలను విజయవంతంగా ధ్వంసం చేయడం ద్వారా భారత సైనిక శక్తిని ప్రపంచానికి చాటిందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూమ్‌భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో వారు మాట్లాడారు. పహలాగ్రంలో ముష్కరులు కాళ్ల పారాణి ఆరకముందే భార్య ముందు భర్తను చంపడం హేయమైన చర్య అన్నారు. సరి హద్దుల్లో ప్రాణాలు కోల్పోయిన ఎపికి చెందిన అగ్నివీర్ మురళి నాయక్‌కి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఉగ్ర వాదుల క్యాంపులపై దాడి క్రమంలో పాకిస్థాన్ సామాన్య జనాలకు ఇబ్బందులు కలిగించ వద్దని మాత్రమే తాను మాట్లాడానని, తన వ్యాఖ్యలు వక్రీకరించారని ఇది సరైంది కాదన్నారు. పాకిస్తాన్‌కి చైనా మద్దతు ఇస్తుందనేది అపోహ మాత్రమేనని, ఇందుకు సంబంధించి చైనా అధికారికంగా స్పష్టం చేసిన విషయాన్ని నారాయణ గుర్తు చేశారు.

కులగణన పూర్తి చేసేందకు కాలపరిమితిని నిర్దేశించాలి కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న కులగణనను సిపిఐ పూర్తిగా స్వాగతిస్తుందని, అయితే ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఖచ్చితమైన కాలపరిమితిని నిర్ణయించాలని నారాయణ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ సుందరి పోటీలు నిర్వహించడం సిగ్గుచేటని నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యుద్ధ కథనరంగంలో దూసుకుపోతున్న కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మనకు ఆదర్శ మన్నారు. కార్పొరేట్ సంస్థలకు అమ్ముడుపోయే ప్రపంచ సుందరి పోటీలు మనకు ఎందుకని.. వారు ఎవరికి ఆదర్శమని, ప్రపంచ సుందరీ మణులను పర్యాటక ప్రదేశాల్లో ఊరేగించినంత మాత్రాన ఈ రంగం అభివృద్ధి చెందుతుందా అని నారాయణ ప్రశ్నించారు. పర్యాటక ప్రాంతాలకు రవాణా సౌకర్యం, మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా .. వివిధ ప్రాంతాలకు పర్యాటకులు వచ్చేందుకు వీలు కలుగు తుందన్నారు.

భారత్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి పాకిస్తాన్ దాడులకు తెగబడ డంతో పాటు సుమారు 400 వరకు డ్రోన్లను ప్రయోగించగా, వాటిని భారత సైన్యాలు విజయవంతంగా తిప్పికొట్టడం అభినందనీయమని సయ్యద్ అజీజ్ పాషా అన్నారు.

సాధారణ పౌరులకు ఏలాంటి ప్రాణ నష్టం జరగకూడదనే లక్షంతో భారత సైన్యాలు అర్ధరాత్రి తర్వాత కేవలం ఉగ్రవాదుల శిక్షణ కేంద్రాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని వాటిని విజయవంతంగా పూర్తి చేయడం పట్ల ప్రపంచ దేశాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయన్నారు.

# సాగు మెలకువలపై రైతులకు అవగాహన

### రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం షురూ

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం కొనసాగుతోంది. రాష్ట్రంలో ప్రతివారం 200 గ్రామాల్లో ఆరు వారాల పాటు ఈ కార్యక్రమాన్ని తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహిస్తోంది. ప్రధానంగా ఇందులో ముఖ్యంగా ఆరు అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా అవసరానికి మించి యూరియా వాడుతున్నారని, దాని వాడకం తగ్గించడం, అందువల్ల లాభాలు, నష్టాలను గూర్చి వివరిస్తున్నారు. ఇటీవల కాలంలో అధిక దిగుబడుల కోసం రైతుల అవసరానికి మించి రసాయనాలను వాడుతుండటం, దాని ప్రభావం వాతావరణం, రైతుల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపడమే కాకుండా, పంటల సాగుకు పెట్టుబడి వ్యయం కూడా పెరుగుతుందనే విషయాలను గూర్చి క్లుప్తీకరిస్తున్నారు. అలాగే విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు రశీదు తీసుకోవడం, తీసుకున్న దాన్ని సాగు అయిపోయేంతవరకు భద్రపరుచుకోవడం వంటి సూచనలు చేస్తున్నారు. వరి సాగుకున నీటిని ఎక్కువగా వాడకూడదని, రెండు, మూడు రోజులకు ఒకసారి పొలంలో నీరు తడి ఉంటే సరిపోతుందని అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాకుండా పంట పొలాల్లో పంట మార్పిడి చేయడంపై దృష్టిసారించాలని చెబుతున్నారు.



పూర్తి దగ్ధమైన కారు

# ఔటర్ రింగ్‌రోడ్డుపై కారు ప్రమాదం

### ముగ్గురు యువకులు మృతి

**హైదరాబాద్ (అబ్దుల్లాపూర్‌మెట్), మే 10, ప్రభాతవార్త:** ఔటర్ రింగ్‌రోడ్డుపై ప్రయాణిస్తున్న కారు రోడ్డుపై ఆగి ఉన్న బొలోరో వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు యువకులు అగ్నికి ఆహుతికాగా మరో యువకుడు చికిత్స పొందుతున్న సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీస్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని తాడ్‌బంద్‌కు చెందిన రితేష్‌కుమార్ అగర్వాల్ కుమారుడు దీపేష్ అగర్వాల్ తన స్నేహితుల్ని కలిసి వస్తానని చెప్పి రాత్రి 11 గంటలకు తన కారులో బయలు దేరాడు. తన స్నేహితులు సంచై మల్పాని, ప్రియాన్ష మిట్టల్‌తో కలిసి శంషాబాద్ నుండి ఘట్కేసర్ వెళ్లేందుకు ఒఆర్ఆర్‌పై ప్రయాణిస్తుండగా మార్గమధ్యంలోని గండిచెరువు బ్రిడ్జి వద్ద రెండు గంటల ప్రాంతంలో రోడ్డుపై ఎదురుగా ఉన్న బొలెరో గూడ్స్ వాహనాన్ని వీరు ప్రయాణిస్తున్న కారుతో ఢీకొట్టారు. దీంతో బొలెరో వాహనం 100 మీటర్ల మేరకు ముందుకు వెళ్లింది.. టాటా కారు ఇరుక్కుపోవడంతో మంటలు చెలరేగాయి. బొలెరో వాహనం డ్రైవర్ వెనుక భాగంలో ఇరుక్కున్న కారుని తీసే ప్రయత్నం చేయగా అప్పటికే మంటలు కారు మొత్తం వ్యాపిస్తుండగా వెనుక సీట్లో ఉన్న ప్రియాన్షను బయటికి తీశాడు. ఎదురుగా కూర్చున్న ఇద్దరు దీపేష్ అగర్వాల్ సంచై మల్పాని సజీవదహనమయ్యారు. కాగా తీవ్రంగా గాయపడిన ప్రియాన్ష మిట్టల్‌ను నగరంలోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందు ఉదయం నాలుగు గంటలకు మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# అరవింద్ క్యారెక్టర్ నా అదృష్టం: వెన్నెల కిషోర్

కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్ శ్రీ విష్ణు, ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ సమ్మర్ సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ సింగిల్. సందర్భంగా వెన్నెల కిషోర్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలని పంచుకున్నారు. సింగిల్ సినిమాలో మీ క్యారెక్టర్‌కి చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. సెకండ్



హీరో మీరే అనే రివ్యూస్ కూడా వచ్చాయి. ఎలా అనిపిస్తుంది? మనం చికెన్ బిర్యాని తిన్నప్పుడు అప్పుడప్పుడు లివర్‌పీస్ వస్తుంది. అది బిర్యానికి ఒక టేస్ట్‌ని తీసుకొచ్చిందనే ఫీలింగ్ వస్తుంది. ఇందులో నా క్యారెక్టర్ కూడా అలాంటిదే(నవ్వుతూ)

మీరు తప్పితే మరో ఆప్షన్ లేదని డైరెక్టర్ చెప్పారు? డైరెక్టర్ రాజ్ చాలా మంచి పర్సన్. శ్రీ విష్ణు చాలా స్పాంటేనియస్‌గా డైలాగ్స్‌ని ఇంప్రవిజ్ చేసేస్తారు. దానికి పక్కన అంతే స్పాంటేనియస్‌గా రియాక్షన్ ఇచ్చే యాక్టర్ ఉండాలి. అలాంటి స్పాంటేనియస్ క్యారెక్టర్‌కి నేనైతే కరెక్ట్ అని డైరెక్టర్ భావించారు. అందుకే శ్రీ విష్ణు ఉండే ఫ్రేంలో వెన్నెల కిషోర్ ఉండాలని ఆయన ముందే ఫిక్స్ అయ్యారు.

కామెడీ పాత్రల్లో కొత్తదనాన్ని ఎంచుకోవడానికి మీరు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారు? నిజానికి కామెడీ పాత్రలని ఎంచుకునే అంత వెర్సటాలిటీ ఇప్పుడు లేదు. ముందు రైటర్స్‌ని మనం చాలా ఎంకరేజ్ చేయాలి. రైటర్స్ కొత్త కొత్త ఆలోచనలతో వస్తేనే కామెడీ పాత్రలు కూడా కొత్త వస్తాయి. చాలాసార్లు మనకి రెగ్యులర్ పాత్రలే వస్తుంటాయి. కానీ దాన్ని మనం ఓన్ చేసుకొని అందులోనే ఏదో ఒక యూనిక్నెస్ ని ప్రజెంట్ చేసేలా ప్రయత్నం చేస్తుంటాను. నావల్ల ఒక సీన్

మీకు ఏ జోనర్ ఇష్టం? నాకు థ్రిల్లర్స్ ఇష్టం. చార్లీ సినిమా తర్వాత మళ్లీ హీరోగా సినిమా చేయలేదు.

మళ్ళీ హీరోగా చేయాలని ఆలోచన ఉందా? కథలు వస్తున్నాయి గాని మళ్లీ లవ్ స్టోరీ, పాటలు అంటున్నారు. అవి అంతగా సూట్ కావు. ప్రోపర్ కామెడీ కథ కుదిరితే తప్పకుండా చేస్తాను.

బ్రహ్మానందం మీరు తన వారసుడని చెప్పడం ఎలా అనిపించింది? అది ఆయన ప్రేమతో అన్న మాట. ఏదో నాకు కొంత బూస్టప్ ఇవ్వడానికి ఆ మాట అభిమానంతో చెప్పినదే.

మీకు డ్రీమ్ రోల్స్ ఉన్నాయా? నాకు డ్రీమ్ రోల్స్ అంటూ ప్రత్యేకంగా లేవు. దూకుడు సినిమా తర్వాతే నా డ్రీమ్ రోల్ అయిపోయింది.

# 'సింగిల్'కు వచ్చే కలెక్షన్‌లో కొంత సైనికులకు..: అల్లు అరవింద్

కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్ శ్రీ విష్ణు, ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ సమ్మర్ బ్లాక్ బస్టర్ సింగిల్. కేతిక శర్మ, ఇవానా కథానాయికలుగా నటించారు, వెన్నెల కిషోర్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. గీతా ఆర్ట్స్ మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో కళ్యా ఫిల్మ్స్ తో కలిసి చిత్రాన్ని విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మించారు. మే 9న థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా అందరినీ అలరించి సమ్మర్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకొని సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్ లో నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ, భారత్ మాతాకీ జై. మేము ఒక మిక్స్డ్ ఫీలింగ్‌తో ఇక్కడికి వచ్చాం. సినిమా రిలీజ్ సందర్భంగా ఉత్సాహంగా రావాలని అనుకున్నాం. కానీ మన సైనికులు మన దేశం కోసం పోరాడుతుంటే, సినిమా విషయంలో మేం సెలబ్రేషన్స్ చేసుకోవడం సరికాదు అనిపించింది. సినిమాని ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపేందుకే ఈ ప్రెస్‌మీట్ పెట్టాం. మన దేశం కోసం పోరాడుతున్న సైనికులకి ఇక్కడ నుంచి సపోర్టే కాకుండా ఈ సినిమా నుంచి



వచ్చే కలెక్షన్స్‌లో కొంత భాగం మన కోసం పోరాడే సైనికులకి రక్షకులకు అందజేయనున్నాం. ఈ ఉద్రిక్త పరిస్థితులకు ముందు మేం ఈ మూవీ రిలీజ్ డేట్ ప్రకటించాం. వాయిదా వేయడం మంచిదా, కాదా అన్న దానిపై చర్చించాం. సినిమా కోసం వందల మంది పనిచేయడమే కాదు థియేటర్లపై వందల కుటుంబాలు ఆధారపడి ఉంటాయి. అందుకే ఎవరూ తప్పుగా అర్థంచేసుకోరనే ధైర్యంతో సినిమాని విడుదల చేశాం. సినిమా విషయానికి వస్తే మొదటి నుంచి ఒక ఆహ్లాదకరమైన సినిమాని ఇవ్వాలని ప్రయత్నించాం. థియేటర్లో రియాక్షన్ చూసిన తర్వాత మేము అనుకున్న దాని కంటే అద్భుతంగా ప్రేక్షకులు ఆస్వాదిస్తున్నారు. సినిమాని ఇంత గొప్పగా ఆదరిస్తున్న ప్రేక్షకులు అందరికీ మా కృతజ్ఞతలు. శ్రీ విష్ణు, వెన్నెల కిషోర్ అద్భుతంగా అలరించారు. శ్రీ విష్ణు తన అన్ని సినిమాలు కంటే ఒక మెట్టు ఎదిగి సిక్సర్ కొట్టాడు. వెన్నెల కిషోర్ ఫుల్ కిక్ ఇచ్చారు. భాను నందు చాలా చక్కని డైలాగ్స్ రాశారు. డైరెక్టర్ చాలా ఎంటర్టైనింగ్‌గా సినిమా తీశారు. ఇద్దరు హీరోయిన్స్ కూడా చాలా చక్కగా పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. గీత ఆర్ట్స్ నుంచి గత ఆరు నెలల్లో మూడు సినిమాలు వచ్చాయి. ఈ మూడు సినిమాలు కూడా అద్భుతమైన విజయాలు సాధించాయి అన్నారు.

# 30న 'భైరవం' విడుదల

తాజాగా మేకర్స్ సినిమాకు విడుదల తేదీని ప్రకటించారు. ఈ వేసవి సీజన్‌లో బిగ్గెస్ట్ అట్రాక్షన్‌గా మే 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో "భైరవం" విడుదల కాబోతోంది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ముగ్గురూ కలర్ఫుల్ ఫెస్టివల్ వైబ్ తో కనిపించిన రిలీజ్ డేట్ పోస్టర్ అదిరిపోయింది. ఈ చిత్రంలో ఆదితి శంకర్, ఆనంది, దివ్య పిళ్ళై కథానాయికలుగా నటిస్తున్నారు. హరి కె వేదాంతం సినిమాటోగ్రఫీ నిర్వహిస్తుండగా, చోటా కే ప్రసాద్ ఎడిటర్. బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. డైలాగ్స్ సత్యర్షి, తూమ్ వెంకట్ రాశారు. మూవీ విడుదలకు మూడువారాలు ఉండటంతో మేకర్స్ ప్రమోషన్స్‌ను మరింత దూకుడుగా చేయబోతున్నారు. నటీనటులు: బెల్లంకొండ శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్, ఆదితి శంకర్, ఆనంది, దివ్య పిళ్ళై, సాంకేతిక బృందం: కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: విజయ్ కనకమేడల, నిర్మాత: కెకే రాధామోహన్, సమర్పణ: డా. జయంతిలాల్ గడా (పెన్ స్టూడియోస్) సినిమాటోగ్రఫీ: హరి కె వేదాంతం, ప్రొడక్షన్ డిజైనర్: బ్రహ్మ కడలి, ఎడిటర్: చోటా కే ప్రసాద్, సంగీతం: శ్రీచరణ్ పాకాల, డైలాగ్స్: సత్యర్షి, తూమ్ వెంకట్, సాహిత్యం: భాస్కరభట్ల, కాసర్ల శ్యామ్, చైతన్య ప్రసాద్, బాలాజీ, తిరుపతి ఫైట్ మాస్టర్స్: రామకృష్ణ, నటరాజ్ మడిగొండ పబ్లిసిటీ డిజైనర్: సుదీర్ పిఆర్‌ఓ: వంశీ శేఖర్.





రాశి ఖన్నా నయా లుక్

# 'కె-ర్యాంప్' షూటింగ్ షురూ

యంగ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా కె-ర్యాంప్. కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న 11వ చిత్రమిది. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కె-ర్యాంప్ సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో కిరణ్ అబ్బవరం సరసన యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. నుంచి కె-ర్యాంప్ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. ఈ విషయాన్ని మూవీ టీమ్ తెలియజేస్తూ పోస్టర్ రిలీజ్ చేసింది. త్వరలో"రేర్యాంప్థ్ సినిమా ఫస్ట్ లుక్ విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు.



నటీనటులు: కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా, తదితరులు టెక్నికల్ టీమ్: ప్రొడక్షన్ డిజైనర్: బ్రహ్మ కడలి యాక్షన్: పృథ్వీ ఎడిటర్: ఛోటా కె ప్రసాద్ డీవోపీ: సతీష్ రెడ్డి మాసం మ్యూజిక్: చేతన్ భరద్వాజ్ పీఆర్ ఓ జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్), వంశీ శేఖర్, కోప్రొడ్యూసర్‌బాలాజీ గుట్ట ప్రొడ్యూసర్ రాజేష్ దండాశివ బొమ్మకు, రచన, దర్శకత్వం జైన్స్ నాని.

# 'హిట్ 3' సక్సెస్ మీట్

నేచురల్ స్టార్ నాని సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ హిట్: ది థర్డ్ కేస్. శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటించింది. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వాల్ పోస్టర్ సినిమా, నాని యూనానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మే 1న పాన్ ఇండియా గ్రాండ్‌గా రిలీజ్ అయిన హిట్: ది థర్డ్ కేస్ అందరినీ ఆకట్టుకొని బ్లాక్ బస్టర్ సక్సెస్‌ని అందుకొని సక్సెస్ ఫుల్ గా రన్ అవుతుంది. ఈ సందర్భంగా మేకర్స్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీటింగ్ నిర్వహించారు. సక్సెస్ మీట్‌లో నేచురల్ స్టార్ నాని మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఈ సక్సెస్ సెలబ్రేషన్ గురించి డిస్కస్ వచ్చినప్పుడు దేశంలో పరిస్థితి సెన్సిటివ్ గా ఉంది కదా సెలబ్రేషన్స్ చేయొచ్చా అనే చర్చ వచ్చింది. శత్రువులు మనకి ఒక ప్రాబ్లం క్రియేట్ చేయాలని ప్రయత్నించారు. దానికి మన దేశం, సైన్యం చాలా హుందాగా బదులు చెప్పింది. వాళ్లు చేసిన పని వల్ల ఇండియాలో ఒకచోట సక్సెస్ సెలబ్రేషన్ క్యాన్సిల్ అయిందని ఒక సాటిస్ఫాక్షన్ కూడా వాళ్లకి ఇవ్వకూడదని ఉద్దేశంతో ఈ సెలబ్రేషన్ చేయడం జరిగింది. మనల్ని ఏమీ చేయలేకపోయారని స్టేట్మెంట్ పాస్ చేయాల్సిన బాధ్యత కూడా మన మీద ఉంది. లెట్స్ సెలబ్రేట్.. లెట్స్ సెల్యూట్ ద ఇండియన్ ఆర్మీ. సైన్యంలో ఉన్న అందరికీ నా, మా టీం తరపు నుంచి ఏ బిగ్ సెల్యూట్. హిట్ 3 సినిమా విషయానికొస్తే ఈ సినిమా సక్సెస్ అవుతుందని అనుకున్నాను కానీ ఈ స్థాయిలో సక్సెస్ అవుతుందని నేను ఊహించలేదు. ఒక క్రైమ్ థ్రిల్లర్‌ని ఒక బిగ్ మాస్ కమర్షియల్ సినిమాలా సెలెబ్రేట్ చేసుకోవడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. థియేటర్స్ నుంచి వస్తున్న రెస్పాన్స్ చూస్తే అద్భుతం అనిపించింది. ఈ సినిమాలో నటించిన నటీనటులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. మా టెక్నీషియన్స్ అందరికీ థాంక్యూ. ఆ డైరెక్టర్ నాగేంద్ర గారు అన్ బిలియబుల్ సెట్స్ వేశారు. డిఓపి సాను నా ఫేవరెట్. ఆయనతో నాది 4వ సినిమా. కథ చెప్పడానికి ఆయన బిగ్ స్ట్రెంత్. మిక్కీ సినిమాకి ఒక కొత్త టోన్ సెట్ చేసిన సౌండింగ్ ఇచ్చారు. డైరెక్షన్ డిపార్ట్మెంట్ అందరికీ థాంక్యూ. సతీష్, లీ చాలా అద్భుతమైనటువంటి ఫైట్స్‌ని డిజైన్ చేశారు. తెలుగు సినిమాలో



ఎప్పుడు చూడని ఫైట్స్‌ని ఆడియన్స్ చూశారు. శైలేష్‌తో వర్క్‌చేయడం చాలా ఫన్‌గా ఉంటుంది. తను చాలా కూల్‌గా పని చేసుకుంటూ వెళ్తాడు. తను ప్రతి సినిమాకి ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ వెళ్తున్నాడు. తనకిహిలేరియస్ కామెడీ టైమింగ్ ఉంది. తనతో నేను చేయబోయే నెక్స్ట్ సినిమా మాత్రం మంచికామెడీ ఎంటర్టైనర్ అవ్వాలని కోరుకుంటున్నాను.

# 'వీర చంద్రహాస్' ట్రైలర్ లాంచ్

కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్ బ్యానర్‌పై ఎమ్‌వీ రాధాకృష్ణ తెలుగులో విడుదల చేస్తున్న కన్నడ చిత్రం"వీర చంద్రహాస్థ. మంచి టేస్ట్ ఉన్న ప్రొడ్యూసర్‌గా రాధాకృష్ణకు గుర్తింపు ఉంది. గతంలో శివరాజ్ కుమార్ నటించిన"వేద్ధ, ప్రజ్వల్ దేవరాజ్ నటించిన రాక్షస చిత్రాలను తెలుగులో రిలీజ్ చేసిన ఆయన.. తాజాగా వీర చంద్రహాస తెలుగు రైట్స్‌ను దక్కించుకున్నారు. అతి త్వరలో తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. కేజీయఫ్, సలార్ లాంటి యాక్షన్ చిత్రాలకు సంగీతం అందించి మ్యూజిక్ డైరెక్టర్‌గా ఒక సంచలనం సృష్టించిన రవి బస్రూర్.. వీర చంద్రహాస చిత్రంతో దర్శకుడిగా కూడా సత్తా చాటుతున్నారు. ఆయన దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ కీలక పాత్ర పోషించగా, శిథిల్ శెట్టి, నాగశ్రీ జీఎస్, ప్రసన్న శెట్టిగార్ మందార్తి, ఉదయ్ కడబాల్, రవీంద్ర దేవాడిగ, నాగరాజ్ సర్వేగర్, గుణశ్రీ ఎం నాయక్, శ్రీధర్ కాసర్కోడు, శ్వేత అరెహోల్, ప్రజ్వల్ కిన్నాల్ ప్రధాన పాత్రలు పోషించారు. కన్నడ అగ్ర నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో ఓంకార్ మూవీస్ బ్యానర్‌పై ఎన్ ఎస్ రాజ్‌కుమార్ నిర్మించారు. ఏప్రిల్ 18న కన్నడలో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. దీంతో ఈ మూవీ తెలుగు రిలీజ్ కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ మూవీ తెలుగు వెర్షన్ ట్రైలర్‌ను మాస్ కా దాస్ విశ్వక్ సేన్ సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మాట్లాడుతూ, వీర చంద్రహాస టైటిల్‌తో పాటు ట్రైలర్ కూడా చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. రవి బస్రూర్ మల్టీ టాలెంట్ ఉన్న వ్యక్తి. ఇప్పటి వరకు ఆడియెన్స్‌ను తనదైన సంగీతంతో అలరించగా, డైరెక్టర్‌గానూ తానెంటో ప్రూవ్ చేశారు. ఎమ్‌వీ రాధాకృష్ణ ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తుండటం చాలా ఆనందంగా ఉంది. టీమ్ అందరికీ ఆల్ ద బెస్ట్ అని చెప్పారు. ట్రైలర్ విషయానికొస్తే.. వీర చంద్రహాస అనేది మహాభారతంలోని అశ్వమేధిక పర్వంలోని కథ. ఇది ఒక అనాథ కుర్రాడి యొక్క గొప్ప కథను చెబుతుంది. పరాక్రమవంతుడు, సద్గుణవంతుడు వీర చంద్రహాసుడు అవుతాడు. సినిమా చరిత్రలో మొట్టమొదటిసారిగా యక్షగానం వెండితెరపై పూర్తి వైభవంతో రావడం ప్రేక్షకులకు గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీయెన్స్ ఇచ్చేలా ట్రైలర్‌ను కట్ చేసిన తీరు సినిమాపై అంచనాలు పెంచుతోంది.



# జూన్ 6న 'బద్మాషులు'

మహేష్ చింతల, విద్యాసాగర్ కారంపురి, మురళీధర్ గౌడ్ లీడ్ రోల్స్‌లో శంకర్ చేగూరి దర్శకత్వంలో రూపొందున్న హిలేరియస్ ఎంటర్టైనర్



బద్మాషులు. తార స్టోరీ టెల్లర్స్ బ్యానర్ పై బి. బాలకృష్ణ, రామ శంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన ఈ సినిమా ఫస్ట్ లుక్ మరియు టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది.

సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న బద్మాషులు చిత్రం జూన్ 6న థియేటర్స్‌లో గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. దీపా ఆర్ట్స్ ఈ సినిమాను థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. మహేష్ చింతల, విద్యాసాగర్ కారంపురి, మురళీధర్ గౌడ్ పాత్రలు విశేషంగా, రూరల్ రూటెడ్ కథ, కథనం, కామెడీ చాలా ఆర్గానిక్‌గా ఈ చిత్రాల్లో ఉండబోతున్నాయి, డైరెక్టర్ శంకర్ చేగూరి టేకింగ్ చాలా రిఫ్రెషింగ్‌గా అన్ని వర్గాల ఆడియన్స్‌కు కనెక్ట్ అయ్యే విధంగా ఉండబోతోంది. ఇది మన ఊరి కథ అనే విధంగా ఈ చిత్రంలో పాత్రలు చాలా సహజంగా ఉంటాయి, డైరెక్టర్ శంకర్ చేగూరి వంద శాతం జనాలను రెండు గంటలు నవ్వించాలి అనే ఉద్దేశ్యంతో బద్మాషులు చిత్రాన్ని తెరకెక్కించారు.

# చీరకట్టులో దివ్య భారతి..

దివ్య భారతి... ఈ పేరు వింటేనే ఒక విధమైన స్వచ్ఛమైన అందం కళ్ల ముందు మెదులుతుంది. తనదైన శైలిలో నటిస్తూ, కుర్రకారు హృదయాలను కొల్లగొడుతున్న ఈ యంగ్ టాలెంట్ బ్యూటీ తాజాగా చీరకట్టులో దర్శనమిచ్చి అభిమానులను మంత్రముగ్ధులను చేసింది. ఆమె పోస్ట్ చేసిన తాజా ఫోటోలు సోషల్ మీడియాలో ఒక సంచలనం సృష్టిస్తున్నాయి. ఆ ఫోటోల్లో దివ్య భారతి కట్టుకున్న చీర అచ్చమైన తెలుగింటి సంప్రదాయాన్ని గుర్తుచేస్తోంది. మృదువైన రంగులు, సింపుల్ డిజైన్‌తో ఉన్న ఆ చీరలో ఆమె ఒక దేవకన్యలా మెరిసిపోతోంది. తన మెత్తని, ఒత్తైన కురులను లూజ్‌గా వదిలేసి, చిన్నపాటి ఆభరణాలు ధరించడంతో ఆమె అందం మరింత సహజంగా, ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఎలాంటి హంగులు లేకుండానే ఆమె చూపు తిప్పుకోలేని సౌందర్యంతో వెలిగిపోతుండటం విశేషం.

దివ్య భారతి అతి తక్కువ సమయంలోనే తన నటనతో ప్రేక్షకుల్లో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. కింగ్‌స్టన్ సినిమాలో ఆమె పోషించిన పాత్రకు మంచి గుర్తింపు లభించింది. జీవీ ప్రకాష్ హీరోగా నటించిన ఈ యాక్షన్ అడ్వెంచర్ ఫాంటసీ చిత్రంలో దివ్య భారతి తనదైన శైలిలో మెప్పించింది. ఇప్పుడు ఆమె ఖిమదిల్ మెల్ కాదల్‌ఖి అనే మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. అంజనా అలీఖాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ రొమాంటిక్ కామెడీలో ముగెన్ రావుతో కలిసి దివ్య భారతి సందడి చేయనుంది. ఈ సినిమాలో సాక్షిఅగర్వాల్, అను హాసన్, కస్తూరి వంటి సీనియర్ నటీనటులు కూడా ఉండటంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. అయితే, ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారిన విషయం మాత్రం దివ్య భారతి చీరకట్టులోని అందమే. ఆమె సింప్లిసిటీనే తన స్టైల్‌గా మార్చుకోవడం ఆమెకు మరింత ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చిపెడుతోంది. ఎలాంటి హడావుడి లేకుండా, కేవలం తన సహజమైన అందంతోనే ఆమె లక్షలాది మంది అభిమానుల హృదయాలను గెలుచుకుంటోంది.





## మాతృప్రేమ

కడుపు మండుతున్నా
గొంతెఎండిపోతున్నా
బిడ్డ ఆకలి తీర్చేందుకు
తల్లడిల్లేది మాతృ హృదయం
ఆమెకు బిడ్డ ఆకలి తప్ప
తన ఆకలి తెలియదు
ప్రేమను పంచడం తప్ప
ప్రేమను ఆశించదు
మాతృ ప్రేమలోని మాధుర్యం
మాటల్లో చెప్పలేనిది
ఆమె త్యాగం అమూల్యం
అమ్మను మించిన దైవం లేదు
అందుకే ఆమె ప్రత్యక్ష దైవం
అమ్మ అనురాగం అపారం
అమ్మ త్యాగం అనితరం
అప్యాయతకు అర్థం అమ్మ
మమతల మకరందం అమ్మ
ప్రేమకు నిలువెత్తు రూపం అమ్మ
అమ్మ పంచే ఆత్మీయత అపురూపం
అమ్మ ప్రేమ ఆప్యాయతకు ప్రతిరూపం

- కాయల నాగేంద్ర

## అనురాగమయి

ఆ మనసు ఓ హిమశిఖరం
ఆ హృదయం అనురాగమయం
ఆ పిలుపు కొండంత బలం
ఆ త్యాగం వెలకట్టలేని ధనం
ఆ పదం సృష్టికే ఆలవాలం
ఆ బంధం



పేగు బంధంతో ముడి వేసుకునే
అనుబంధం
ఆ ప్రేమ ఆప్యాయతల్ని అల్లుకునే
చల్లని మల్లె పందిరి
ఆ రుణం
ఏ జన్మలో తీర్చుకోలేనిది
ప్రతి జీవికి అమ్ముంటుంది
ప్రతి జన్మకు అమ్ముంటుంది
అనురాగమయి అమ్మకు వందనం

- నెల్లుట్ల సునీత

# అపురూప కావ్యం అరుదైన రూపం అమ్మ



"పెదవే పలికిన మాటల్లో తీయని మాటే అమ్మ కదిలే దేవత అమ్మ కంటికి వెలుగమ్మ/ తనలో మమత కలిపే పెడుతుంది ముద్దగా/ తన లాలి పాటలు సరిగమ పంచుతుంది ప్రేమ మధురిమ" అన్నారు ఓ సిని మహాకవి గారు. నిజమే కదండి పదాలు తెలియని పెదవులకు అమృత వాక్యం అమ్మ, ఓ కదిలే దేవత, ప్రత్యక్ష దైవం. తనలోని మమకారానంత రంగరించి మరీ గోరుముద్దలు తినిపిస్తూ పాటల పల్లకి అయి పోతుంది. ఇలా అమ్మ చూపించినంత ప్రేమని ఈ ప్రపంచంలో ఎవరు చూపించరు. ఎన్నో బంధాలు ఉన్నా మాతృప్రేమలో ఉన్న అనుభూతి ఎక్కడా దక్కదు. ఈ లోకంలో అన్నింటికన్నా అమూల్యమైనది, అతి మధురమైనది అనంతమైనది అమ్మ అనురాగం మాత్రమే. అలుపెరుగని ఓర్పు, అద్భుతమైన స్నేహం, అపురూప కావ్యం, అరుదైన రూపం అమ్మ. మనకు మంచి నడక నేర్పేది అమ్మ. అమ్మ ఆశీస్సులు కొండంత అండ. తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కాపాడే మనస్తత్వం ఒక్క అమ్మకే వుంటుంది. అందుకే ఈ ప్రపంచంలో అన్ని బంధాల కన్నా పేగుబంధం గొప్పది. ఇంత గొప్ప బంధాన్ని చూసి ఆ నింగి కూడా తలవంచుతుంది. అమ్మ పంచే అనురాగానికి సముద్రం కూడా చిన్నబోతుంది. తనలో దాచుకున్న కన్నీళ్ళకి వెన్నెల కూడా దాసోహం అవుతుంది. అమ్మ చూపే అందమైన ఆత్మీయతకి. ఆత్మీయతతో పాటు ఆమెలో సహనం, క్షమాగుణం, ఓర్పు, స్నేహం లాంటి అద్భుతమైన ప్రవృతులు ఎప్పటికీ సజీవంగా ఉంటాయి. కాబట్టి ఆ ప్రేమ ఎప్పటికీ చెదరిని మధురా నుభవం. అదే అమ్మలో ఉన్న కమ్మదనం గొప్పతనం. తన బిడ్డల్ని కంటికి రెప్పలా కాపాడుతూ గుండెల్లో పెట్టుకొని పెంచుతుంది. తన బిడ్డల్ని బువ్వ పెట్టి, బుజ్జగించి, లాలించి, పాలించి ప్రయోజకుల్ని చేసేంతవరకు విశ్రమించదు. ఈ సృష్టిలో అమ్మకన్నా విలువైనది ఏదీ లేదు. అందుకే దేవుడు తాను ప్రతిచోట ఉండలేక అమ్మని సృష్టించాడు. అందుకే మాతృదేవోభవ అని అమ్మని దైవంతో సమానంగా కొలుస్తాము. అలాంటి అమ్మను గౌరవించాలి అన్న ఆలోచనతో పుట్టినదే మాతృ దినోత్సవం.

ఎక్కడో అమెరికాలో జరిగిన ఈ సాంప్రదాయం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే స్థాయికి వెళ్ళింది. అమెరికాకి చెందిన 'మేరీ జార్విస్' అనే మహిళ మాతృ దినోత్సవానికి నాంది పలికింది. తన తల్లి సంవత్సరంలో ఒక్కరోజైనా మాతృ దినోత్సవానికి గుర్తింపు సాధించడానికి ఏళ్ల తరబడి పోరాటం చేశారు. కానీ తన ఆశయం నెరవేరకుండానే ఆమె కన్నుమూశారు. ఆ తర్వాత మేరీస్ ఆ మహా కార్యానికి శ్రీకారం చుట్టారు. తన ప్రయత్నంలో భాగంగా మాతృ దినోత్సవాన్ని అంతర్జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని జార్విస్



అమ్మ భాషకు అందని గొప్ప భావం కనిపించే ప్రత్యక్ష దైవం. ఆది గురువు అమ్మ మంచి నడత, నడక నేర్పేది అమ్మ తల్లిని మించిన ప్రేమా మృతమూర్తి ఈ ప్రపంచంలోనే లేదంటే అతిశయోక్తి కాదు. ఈ ప్రపంచం ఆధునికతతో తన రూపం మార్చుకున్న అమ్మ ప్రేమ అజరామజనం, ఎన్నటికీ చెరగని మధురానుభవం. అమ్మ ఆశీస్సులు కొండంత అండ. తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా గుండెల్లో దాచుకొని కాపాడే మనసత్త్వం కేవలం అమ్మకి మాత్రమే ఉంటుంది. ఆప్యాయత వెలకట్టలేని ప్రేమ అమ్మది.

పట్టుదలగా ప్రయత్నించారు. ఈమె కృషి ఫలితంగా పశ్చిమ వర్జీనియా రాష్ట్రంలో 1910లో తొలిసారి మాతృ దినోత్సవం రోజు అధికారిక సెలవుదినంగా ప్రకటించారు. ఆ తర్వాత మే 9వ తేదీన 1914న అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ మే నెలలో వచ్చే రెండవ ఆదివారాన్ని మాతృ దినోత్సవంగా అధికారికంగా ప్రకటించారు. అలాగే మాతృ దినోత్సవంపై తొలిసారిగా అమెరికా ప్రభుత్వం పోస్టల్ స్టాంపు విడుదల చేసింది. ఇంత ఘన చరిత్ర ఉన్న "అమ్మ" పండుగని ఇప్పుడు విశ్వవ్యాపితంగా జరుపుకుంటున్నారు.

ఇంతటి చరిత్రను సృష్టించిన అమ్మ అనే



పదంలో ఆప్యాయత, అనురాగం, ఆనందం, ఆత్మీయత, ఆదర్శం, కమ్మదనం, తీయదనం ఇలా ఎన్నో ఎన్నెన్నో ఎంత చెప్పినా తక్కువే. మాటలకు అందనంత గొప్పది అమ్మ ప్రేమ. అమ్మ కంటే గొప్ప ప్రేమ, అమ్మ కంటే గొప్ప భద్రత ఎక్కడా దొరకదు. మన సంతోషం తన సంతోషంగా, మన బాధని తన బాధగా భావించేది అమ్మ. మన భారతీయ సంప్రదాయంలో "మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ" అంటూ అమ్మకే అగ్ర తాంబూలం ఇచ్చారు. ఈ ప్రపంచానికి బిడ్డను పరిచయం చేసే మొట్టమొదటి వ్యక్తి అమ్మ. "అమృతం తాగిన వాళ్ళు దేవతలు దేవుళ్ళు/ అధికరణకు పంచేవాళ్ల అమ్మానాన్నల్లు" అంటారు. అమృతం కన్నా తీయనైన ప్రేమాను రాగాలని పంచుతున్న అమ్మానాన్నలని దేవతలు దేవుళ్ళతో పోల్చి ఎంతో అద్భుతంగా చెప్పారు కవిగారు. అదే అమ్మ ప్రేమలోని గొప్పతనం. ఏ దేశంలో అయినా సంస్కృతి, సంప్రదాయాలు, భాషలు, నాగరికతలు మారవచ్చు. కానీ అమ్మప్రేమ అజరామరం. మనకు జన్మనిచ్చిన తర్వాత మనకి బతుకునిచ్చి జీవితాంతం కొండంత అండగా నిలుస్తుంది అమ్మ.

ఆమె ఒక గురువు, తత్వవేత్త, మానసికవేత్త, విశ్లేషకురాలు. అందుకే "అమ్మంటే అంతులేని సొమ్మురా అది ఏనాటికి తరగని భాగ్యమ్మురా.. అన్నారు పెద్దలు అందుకే "విలువలైనా, ఆత్మవిశ్వాసమైనా" అమ్మతోనే సాధ్యమంటున్నారు నేటి ఆధునిక సమాజంలో ఉన్నత స్థితికి చేరుకున్న ప్రముఖులు. నిర్మలమైన నిష్కల్మషమైన ప్రేమను పంచడం తప్ప అమ్మకు వేరే ఆలోచన ఉండదు. దానికి రూపు, రేఖ, కులం, ప్రాంతం అడ్డుగోడగా నిలవదు. ఎంతమంది కాదన్నా మనల్ని ఓ రత్నంలా తీర్చిదిద్ది ఉన్నత స్థాయికి చేర్చితే అందరి మన్ననలను పొందినప్పుడు తన బిడ్డ చేరుకున్న అత్యున్నత స్థాయిని చూసి గర్వపడేది దేవుని ప్రతిరూపమైన అమ్మ మాత్రమే. ఇలాంటి దేవత మూర్తిని కష్టాలపాలు చేయకండి. మనల్ని అపురూపంగా చూసుకొనే కన్నతల్లిని మరింత ప్రేమగా చూసుకోండి. కమ్మనైన, తేనెకన్నా తీయనైన అమ్మ ప్రేమకు దాసోహం అవ్వండి బిడ్డలందరినీ కంటిపాపలా కాపాడే మాతృమూర్తులందరికీ మాతృ దినోత్సవ శుభాకాంక్షలు, జేజేలు, వందనాలు.

-పింగళి భాగ్యలక్ష్మి



# ఆడేద్దామా తొక్కుడు బిళ్ల

**తొక్కుడు బిళ్ల ఆట పేరు వినగానే.. చిన్నప్పుడు** మనం ఆడిన రోజులు గుర్తొస్తున్నాయి కదా! అయితే, మనం దీన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఆడే ఆటగా, ముఖ్యంగా మనం భారతీయ చిన్నారులు ఆడుకునేదిగా భావిస్తాం. కానీ, హాప్‌స్కాచ్ పేరుతో ప్రపంచ వ్యాప్తంగా దీనికున్న పాపులారిటీ అంతా ఇంతా కాదు. అతి పురాతనమైన ఈ క్రీడ, రోమన్ల పాలనా కాలంలో బ్రిటన్‌లో ప్రారంభమైందని చెబుతారు. అయితే, బ్రిటిష్ సామ్రాజ్యంలో సైనిక శిక్షణ కోసం సుమారు వంద అడుగులు పొడవుతో ఉండే కోర్టుల్లో ఈ ఆటను ఆడించేవారట. ఆ తరవాత అనేక మార్పులకు లోనై.. ఒక్కో ప్రాంతంలో ఒక్కో తీరున ఈ ఆటను ఆడేస్తున్నారు. పది అంకెలు వచ్చేలా నేలపై పెద్ద పెద్ద గడులతో నిలువు, అడ్డంగా ఆకులతో కోర్టుని గీస్తారు. ఆడేవారు బయట నిలబడి కాయిన్ లేదా పెంకుని అందులో వేసి ఒంటికాలితో వెళ్లి తేవాలి. ఈ క్రీడ ఏకాగ్రతనూ, చేతికీ, మెదడుకీ మధ్య సమన్వయాన్ని పెంచుతుంది. మరింకెందుకాలస్యం. వేసవి సెలవుల్లో పిల్లలతో ఆడించేయండి వాళ్లూ కొత్తగా ఉండే అని సంబరపడతారు. □

## చెలి చిట్కా

చేపలు బురదవాసన, నీచువాసన రాకుండా వాటిని ముక్కలుగా తరగటానికి ముందు ఒక గంటపాటు ఉప్పునీటిలో వేసినతర్వాత శుభ్రమైన నీటితో కడగండి. □

# మామిడి పచ్చళ్లు

ఎండాకాలం.. మే నెల సగం అయిపోయింది. మామిడి కాయలు టెంక కట్టి ఎదురు చూస్తున్నాయి. జాడీలు స్నానాలు చేసి ఎండలో సేదదీరుతుంటాయి. ఇంట్లో మిక్సీలు గిర్‌ర్‌ర్ అంటూ గోల చేస్తుంటాయి. మామిడి కాయలు కొట్టే కత్తి పుల్లదారి పదునుదేలింది. ముక్కలు కొట్టండి.. పళ్లెంలో వేయండి. కారం కలపండి. జాడీలకెత్తండీ.. పళ్లెంలో వేడి వేడి అన్నం వేసి కలపండి. ఇంటిల్లిపాదీ ఆవురావురుమని తినవచ్చు.

## మామిడి ఆవకాయ..

**కావలసినవి :** పచ్చి మామిడి ముక్కలు-కేజీ, పచ్చిశనగలు-50 నగ్రాములు, సన్నఆవాలు-పావు కేజీ, మెంతులు-రెండు టేబుల్ స్పూన్లు, గుంటూరు



మిరపపొడి-పావు కేజీ, ఉప్పు-నూపట యాభై గ్రాములు, పసుపు-టేబుల్ స్పూన్, నువ్వుల నూనెలేదా వేరుశనగనూనె-పావుకేజీ,

**తయారీ :** ○ ఆవకాయ పట్టడానికి ముందు రోజు మిరపకాయలు, ఆవాలు, మెంతులను విడిగా ఎండబెట్టాలి. మరునాడు ఉదయం ఆవాలను మిక్సీలో పొడిచేయాలి. మిరపపొడి రెడీమేడ్‌ది కూడా తీసుకోవచ్చు. కానీ ఆవాలు స్వయంగా చేసుకోవాలి. ○ మామిడి కాయలను కడిగితే నీరుపోయే వరకు తుడిచి ఆరబెట్టాలి. బాగా ఆరిన తర్వాత కాయలకున్న తొడిమ తొలగించాలి.○ అప్పటికీ సొన కారుతుంటే శుభ్రమైన నూలు వస్త్రంతో తుడిచేయాలి. ఇలా సిద్ధం చేసుకున్న మామిడికాయలను టెంకతో సహా చిన్న ముక్కలు చేసుకోవాలి. ○ శనగలను శుభ్రమైన వస్త్రంతో తుడిచి పక్కన పెట్టాలి. ○ వెడల్పుగా ఉన్న పెద్దపాత్రలో మామిడి ముక్కలు వేయాలి. అందులో శనగలు,ఆవాల పొడి, మిరపపొడి, ఉప్పు, పసుపు వేసే అట్లకాడతో బాగా కలపాలి. ○ మెంతులు కూడా వేసి బాగా కలపాలి. చివరగా నూనెపోసి ముక్కలకు ఒత్తిడికి కలగకుండా అడుగు నుంచి కలిపితే ఆవకాయ రెడీ. దీనిని పింగాణి జాడీలో పెట్టి అంచులకు తెల్లని శుభ్రమైన నూలు వస్త్రాన్ని కట్టాలి. ○ ఆ పైన మూత పెట్టాలి. ఈ జాడీలోని ఆవకాయను రోజూ మూత తీయకూడదు. రోజువారీ వాడుకకు అవసరమైనంత చిన్న జాడీలోకి తీసుకుంటూ ఉంటే ఎక్కువ రోజులు తాజాగా ఉంటుంది.

## బెల్లం ఆవకాయ

**కావలసినవి :** మామిడి ముక్కలు-అర కేజీ, బెల్లం-అరకేజి, మిరపపొడి-200 నరగాములు, ఉప్పు-200 గ్రాములు, ఆవపిండి-100 గ్రాములు, నూనె-200 గ్రాములు.

**తయారీ :** మామిడి కాయలను శుభ్రంగా కడిగి తుడిచి టెంకతో సహా ముక్కలు చేసుకోవాలి.

○ బెల్లాన్ని తురిమి వెడల్పుపాత్రలో వేసే అందులో మామిడికాయ ముక్కలు, ఆవపిండి, మిరపపొడి, ఉప్పు, కప్పు నూనె వేసి కలపాలి. ○ ఈ మిశ్రమాన్ని రెండు రోజులపాటు ఎండలో పెట్టాలి. బెల్లం కరిగిపాకంలా జిగురుగా వచ్చినట్లనిపిస్తే సరే, లేకపోతే మూడవ రోజు కూడా ఎండలో పెట్టాలి. ○ పాకం వచ్చిన తర్వాత మిగిలిన నూనె కూడా వేసి బాగా కలిపి జాడీలోకి తీసుకోవాలి. ○ ఈ బెల్లం ఆవకాయను పిల్లలు బాగా ఇష్టపడతారు. ఐరన్ రిచ్ ఫుడ్ కాబట్టి మహిళలు



## నువ్వుల ఆవకాయ



**కావలసినవి :** మామిడికాయ ముక్కలు - కప్పులు, నువ్వులు-ఒకటిన్నర కప్పులు, మిరపపొడి-ముప్పావు కప్పు, ఉప్పు-పావు కప్పు, పసుపు-అరటీ స్పూన్, వేరు శనగ నూనె- ఒకటిన్నర కప్పులు.

**తయారీ :** ○ నువ్వులను తయారీ దోరగా వేయించి చల్లారిన పొడి చేయాలి. ○ మామిడి ముక్కలను వెడల్పు పాత్రలో వేసి అందులో నువ్వుల పొడి, మిరపపొడి, ఉప్పు, పసుపు వేసి అట్లకాడతో బాగా కలపాలి. ○ ఉప్పు, కారం నువ్వుపిండి సమంగా కలిసిన తర్వాత కప్పు నూనెపోసి మళ్లీ కలపాలి. ○ ఈ మిశ్రమాన్ని జాడీలోకి తీసుకుని, మిగిలిన నూనెను పైన తేలేటట్లుపోయాలి. ○ ఇందులో క్యాల్షియం సమృద్ధిగా ఉంటుంది. ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

## వెల్లుల్లి ఆవకాయ

**కావలసినవి :** మామిడికాయ ముక్కలు-పావు కేజి లేదా 3, వెల్లుల్లి-200 గ్రాములు, ఉప్పు-100 గ్రాములు, మిరపపొడి-200 గ్రాములు, ఆవాలు-150 గ్రాములు , పసుపు-టీ స్పూన్, మెంతులు - టేబుల్ స్పూన్, నువ్వుల నూనె లేదా వేరుశనగ నూనె- కిలో,



**తయారీ :** ○. ఒక పాత్రలో నూనెపోసి మామిడి ముక్కలను వస్త్రంతో తుడిచి నూనెలో వేయాలి. ○ వెల్లుల్లిపాయలను పొట్టు వలిచి ఒక ప్లేట్‌లో వేసి గాలికి ఆరనివ్వాలి. ○ మరొకపాత్రలో మిరపపొడి,ఆవపిండి,ఉప్పు, పసుపు, మెంతులు వేసి సమంగా కలసేవరకు కలపాలి. ఇప్పుడు వెల్లుల్లి రేకలను వేసి కలపాలి. ○ మామిడి ముక్కలలోని నూనెను ఒక జాడీలోకి పంపాలి. ఇప్పుడు మామిడి ముక్కలలో ముందుగా కలిపి సిద్ధంగా ఉంచిన ఉప్పు, వెల్లుల్లి ఇతర పొడుల మిశ్రమాన్ని వేసి పొడులన్నీ మామిడి ముక్కలకు పట్టేలా కలపాలి. ○ మామిడి ముక్కలను పట్టి ఉన్న నూనె ఈ పొడులను పీల్చుకుని కొంత తడి పొడిగా మారుతుంది. ○ ఈ మిశ్రమాన్ని నూనె వంపుకున్న జాడీలో వేసి అదమాలి.○ నూనెపైకి తేలుతుంది. వెల్లుల్లి బ్లడ్ థిన్నర్ రక్తాన్ని పలచలబరిచి రక్తనాళాల్లో పూడికలు ఏర్పడకుండా నివారిస్తుంది. కాబట్టి పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు అందరూ హాయిగా తినవచ్చు. □

# జల్లెడతో పని లేదు!



ఏదైనా పిండి లేదా రవ్వను ఎక్కువ మొత్తంలో జల్లెడపట్టాలంటే చేతులు నొప్పెడతాయి. ఇకపై అలా శ్రమించకుండా సునాయసంగా పని చేసేందుకు ఫ్లోర్ సిఫ్టర్ వచ్చేసింది. ఇది మీట నొక్కితే చాలు.. జల్లెడ పట్టేస్తుంది సౌఖ్యంగా పట్టుకునేందుకు అనుకూలమైన హ్యాండిల్ ఉంది. స్టెయిన్‌లెస్ స్టీలుతో రూపొందిన ఈ పరికరం తుప్పుపట్టదు. ఇందులో రెండు జల్లెడలు అమర్చి ఉంటాయి. పిండి లేదా పంచదార తేలిగ్గా క్రిందికి దిగుతాయి. □





# పిల్లల్ని దైవిక నియమాల్లో పెంచాలి..

అంతర్వాణి

నేడు స్మార్ట్‌ఫోన్‌ల ప్రభావంతో నైతికవిలువలు సన్నగిల్లుతున్నాయి. ప్రత్యేకంగా పిల్లలు, యువతను వీటినుంచి దూరం చేయడం చాలా కష్టమైపోయింది. స్మార్ట్‌ఫోన్ అవసరమే కానీ, అదే ప్రపంచమైపోయింది వారికి. ఆధునిక కాలంలో పిల్లల్ని పెంచడం అనేది చాలా కష్టమైనది. నేటి పిల్లలు చాలా స్మార్ట్‌గా తయారై పోతున్నారు. ఈపరిస్థితుల్లో విశ్వాసంలో వారిని పెంచడం అనేది చాలా సంక్లిష్టంగా మారుతున్నది. అలాగని విశ్వాస గృహాల్లోన్ని పిల్లలు తల్లిదండ్రులు ఆశించినట్లుగా వారు ఆధ్యాత్మికలో ఎదుగుతున్నారు. ఇందుకు కారణం తల్లిదండ్రులుగా వారు తమ పిల్లలను పసిబిడ్డలుగా ఉన్నప్పుడే వారిని ప్రార్థనలో, వాక్యంలో పెంచుతున్నారు. ఇంతవరకు సంతోషమే. కానీ చాలా విశ్వాసగృహాల్లో పిల్లలు దారితప్పిపోతున్నారు. 'బాలుడు నడవవలసిన త్రోవను వానికి నేర్పుము వాడు పెద్దవాడైనప్పుడు దానినుండి తొలగిపోడు' (సామెతలు 22:6). 'ఎట్లనగా యెహోవా అబ్రాహామును గూర్చి చెప్పినది అతనికి కలుగజేయునట్లు తన తరువాత తన పిల్లలును తన యింటివారును నీతి న్యాయములు జరిగించుచు, యెహోవా మార్గమును గైకొనుటకు అతడు వారి కాజ్ఞాపించునట్లు నేనతని నెరిగియున్నాననెను' (ఆది 18:19). మనం పిల్లల్ని దేవుడికోసం పెంచాలి. లేతవయసులో ఉన్నప్పుడే వారికి మనం దేవుడి గురించి బోధించాలి. ఖచ్చితంగా దేవుడి మార్గంలో పయనించేలా చూడాలి. దైవికనియమాల్లో పెంచేందుకు తల్లిదండ్రులు ఎప్పుడూ రాజీపడకూడదు. ఎందుకంటే దేవుడి వాక్యం ఏమని సెలవిస్తున్నది? బాలుడు నడవాల్సిన మార్గంలో నేర్పుపు, వాడు పెద్దవాడైనప్పుడు దానిలో నుంచి తొలగిపోడు. మనం నిజంగా వారిని సరైనవిధానంలో పెంచితే వారు తప్పిపోరు. సరే కొన్నిసార్లు వారు తప్పిపోవచ్చు. లోకంలో కలిసి జీవించవచ్చు. అప్పుడు ఏం చేయాలి? మేం పెంచాల్సిన మార్గంలో పెంచాం అని చేతులు దులుపుకోవడం కాదుకానీ, వారు తిరిగి దేవుడిమార్గంలో పయనించేంతవరకు కన్నీటితో, పశ్చాత్తాపంతో వేడుకోవాలి. దేవుడికి అబ్రాహాము మనసు తెలుసు. ఆయన తన కుటుంబ సభ్యులకు నీతిమార్గం గురించి నేర్పిస్తాడని తెలుసు. అందుకే రాబోయే ఉపద్రవం గురించి అబ్రాహాముకు తెలిపాడు. లోతు కుటుంబాన్ని రక్షించేందుకు దేవుడు సాయం చేసాడు. కాబట్టి పిల్లల విషయంలో తల్లిదండ్రులుగా మనం తప్పు చేయవచ్చు. కానీ వారు చేయిదాటిపోతున్నప్పుడు నిర్లక్ష్యం చేయకుండా, దేవుడిని క్షమాపణలు వేడుకుంటూ ప్రార్థించాలి. వారిని తన మార్గంలో నడిపించమని అడగాలి. సమాజం బాగలేదు, చుట్టూ పరిస్థితులు బాగలేవు, వారు త్వరగా చెడుమార్గాల్లో వెళతారు అని సమర్థించుకునే పెద్దలూ ఉన్నారు. మనవరకు మనం పిల్లల విషయంలో జాగ్రత్త వహిస్తూ, వారిని ప్రార్థనలో పెంచితేచాలు. అందుకు మనకూ కూడా కావాలి మిందైన ప్రార్థనాజీవితం.

-పి.వాణిపుష్ప

## పాదాలను శుభ్రంగా..


వారానికి ఒకసారి శుభ్రంగా పాదాలను సబ్బుతోకడగాలి. ఒక చెంచా క్యుటికల్ క్రిములేదా రెండు చెంచాలా ఆలివ్ అయిల్, రెంచు చెంచాల నిమ్మరసం నాలుగులేదా ఐదు చుక్కల గ్లిజరిన్ బాగా కలిపి చేతులకు పాదాలకు రాసుకోవాలి. 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటిలో 4 చెంచాల పెరాక్సైడ్ ఒక చెంచా ఉప్పు నాలుగైదుచుక్కల హెర్బల్ షాంపు చేసి 15 నిమిషాల పాటు నాన బెట్టాలి. పాదాల మీద వున్న మురికి అంతా మెత్తబడి తొలగి పోతుంది. □

ఆట



## ఏషియన్ పవర్ లిఫ్టింగ్‌లో..
# చందనకు కాంస్యం

**న్యూఢిల్లీ:** ఆసియా సబ్‌జూనియర్, జూనియర్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్-2025లలో తెలంగాణకు చెందిన పవర్ లిఫ్టర్ తుడి సిరి చందన కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగిన మహిళల 52 కిలోల విభాగంలో పాల్గొన్న చందన 330 కిలోలు ఎత్తి మూడవ స్థానాన్ని దక్కించుకుంది. గత ఏడాది డిసెంబర్‌లో న్యూఢిల్లీలో జరిగిన 41వ ఫెడరేషన్ కప్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్-2024లో రాణించడం ద్వారా ఆమె ఆసియా పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికైంది. కాగా గత పదేళ్లలో చందన ఆరు జాతీయ మరియు 24 రాష్ట్ర ఈవెంట్లలో పాల్గొంది. రాష్ట్ర స్థాయి ఈవెంట్లలో పతకాలు గెలుచుకోవడమే కాకుండా, 2022 సంవత్సరంలో జాతీయ స్థాయి ఈవెంట్‌లో బంగారు పతకాన్ని గెలుచుకుంది. కేరళలో జరిగిన జూనియర్ నేషనల్ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆమె కాంస్య పతకాన్ని గెలుచుకుంది. 2018 లో హైదరాబాద్‌లో జరిగిన ఎస్‌జిఎఫ్ గేమ్స్‌లో ఆమె రజత పతకాలను కూడా గెలుచుకుంది. తమిళనాడు, జార్ఖండ్, మహారాష్ట్రలలో జరిగిన జాతీయ స్థాయి ఈవెంట్‌లో 52 కిలోల విభాగంలో పాల్గొనడం ద్వారా ఆమె పతకాలను సాధించింది.




# భారత్‌లో వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ నియంత్రణ మండలి 2025-2027 సైకిల్ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌ను భారత్‌లోనే పరిశీలిస్తున్నది. 2025 ప్రపంచ టెస్ట్ చాంపియన్ షిప్ ఫైనల్ ఈ ఏడాది వచ్చే నెల లార్డ్స్‌లో జరుగనున్నది.గత నెలలో జింబాబ్వేలో జరిగిన ఐసీసీ చీఫ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్స్ కమిటీలో చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో ఐపిఎల్ చైర్మన్ అరుణ్ దుమాల్ బీసీసీఐ తరఫున పాల్గొన్నారు. భారతదేశం రాబోయే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకుంటే అభిమానులకు గొప్ప అవకాశం అవుతుందని అంచనా వేస్తున్నారు. ఇదే సమయంలో భారత్ ఫైనల్ ఆడకపోయినా చాలా మంది ఇతర రెండు అగ్ర జట్ల మధ్య జరిగే మ్యాచ్‌పై ఆసక్తి చూపుతారని భావిస్తున్నారు. భారత్ ఇప్పటి వరకు రెండుసార్లు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరింది. 2021లో న్యూజిలాండ్ చేతిలో, 2023లో ఆస్ట్రేలియా చేతిలో ఓటమిపాలైంది. భారత జట్టు ఈ ఎడిషన్‌లో 2025 సైకిల్ ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయింది. కాగా స్వదేశంలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలో బోర్డర్ గవాస్కర్ సిరీస్‌లో ఓటమి తర్వాత ప్రపంచ చాంపియన్ షిప్ ఫైనల్ రేసు నుంచి టీమిండియా నిష్క్రమించింది. ఇక ఇటీవల భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ టెస్ట్‌ల నుంచి రిటైర్ అయ్యాడు. ఈ క్రమంలో టీమిండియా కొత్త కెప్టెన్‌తో టెస్ట్ ఛాంపియన్‌షిప్ కొత్త సీజన్‌లోకి ప్రవేశించనుంది. యువ బ్యాటర్ శుభ్‌మాన్ గిల్ ప్రస్తుతం కెప్టెన్సీ రేసులో ముందున్నాడు. భారత జట్టు ఇంగ్లాండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌తో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్‌ను మొదలుపెడుతుంది. మొదటి టెస్ట్ మ్యాచ్ జూన్ 20 నుంచి లీడ్స్‌లో జరుగుతుంది. భారత్ చివరిసారిగా 2021-22లో ఇంగ్లాండ్‌లో పర్యటించింది. ఆ సమయంలో జట్టు విరాట్ కోహ్లీ నాయకత్వంలో టెస్టులు ఆడింది. ఈ సిరీస్‌లో ఐదో టెస్టుకు బుమ్రా కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఇక ఈ సిరీస్ 22తో డ్రాగా ముగిసింది. కాగా డబ్ల్యూటీసీ తొలి ఎడిషన్ ఫైనల్ 2021లో సౌతాంప్టన్‌లో, రెండో ఎడిషన్ ఫైనల్ 2023లో ఓవల్‌లో జరిగింది.

# ఐపిఎల్‌కు 3సార్లు బ్రేక్

## మధ్యలోనే నిలిచిపోయిన సీజన్లు

### కరోనాతో అర్థంతరంగా ముగిసిన మ్యాచ్‌లు



**న్యూఢిల్లీ:** ప్రపంచంలోనే అతిపెద్ద టీ20 లీగ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) 18వ సీజన్ అకస్మాత్తుగా ఆగిపోయింది. భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో, భారత క్రికెట్ నియంత్రణ మండలి టోర్నమెంట్‌ను నిలిపివేయాలని నిర్ణయించుకోవలసి వచ్చింది. 58 మ్యాచ్‌ల తర్వాత ఈ నెల 9వ తేదీన బీసీసీఐ టోర్నమెంట్‌ను వారం పాటు నిలిపివేసింది. 2008లో ప్రారంభమైన ఈ లీగ్ చరిత్రలో వివిధ కారణాల వల్ల టోర్నమెంట్ వాయిదా వేయాల్సి రావడం ఇదే మొదటిసారి కాదు. ఐపిఎల్ 2008 లో ప్రారంభమైంది. అప్పటి నుంచి టోర్నమెంట్ ఎటువంటి సమస్యలు లేకుండా కొనసాగుతోంది.

కానీ, గత 5 సంవత్సరాలలో బీసీసీఐ టోర్నమెంట్‌ను వాయిదా వేయవలసి రావడం ఇది మూడోసారి. టోర్నమెంట్ మధ్యలో నిలిపివేయడం ఇది రెండోసారి. ఐపిఎల్ ప్రారంభం కావడానికి ముందే ఒకసారి వాయిదా వేయాల్సి వచ్చింది. ఐపిఎల్ ఎప్పుడు, ఎన్ని రోజులు వాయిదా పడిందనే వివరాలను గూర్చి తెలుసుకుంటే తొలిసారిగా ఐపిఎల్ 2020 లో వాయిదా వేయాల్సి వచ్చింది. అప్పుడు టోర్నమెంట్ మార్చి 29న ప్రారంభం కావాల్సి ఉంది. కానీ, కరోనా వైరస్ మహమ్మారితో ప్రపంచం కుదేలైంది. భారత బోర్డు మార్చి 15న టోర్నమెంట్‌ను ఏప్రిల్ 14 వరకు వాయిదా వేసింది. తరువాత ఏప్రిల్ 15న నిరవధికంగా వాయిదా వేసింది. చివరకు, 174 రోజుల తర్వాత, 2020 సెప్టెంబర్ 19న, టోర్నమెంట్ యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్‌లో ఐపిఎల్ మ్యాచ్‌లను పూర్తి చేశారు. మళ్ళీ ఒక సంవత్సరం తర్వాత ఐపిఎల్ 2021లో కూడా అదే జరిగింది. ఈసారి బీసీసీఐ బయోబబుల్‌లో టోర్నమెంట్‌ను నిర్వహించడం ప్రారంభించింది.

టోర్నమెంట్‌ను 34 వేదికలలో మాత్రమే నిర్వహించారు. ఇది ఏప్రిల్ 9న ప్రారంభం కావాల్సి ఉంది. కానీ, రెండవ దశ కరోనావైరస్ కారణంగా, మే 2న జరగాల్సిన మ్యాచ్ వాయిదా పడింది. ఈ సమయంలో, కొంతమంది ఆటగాళ్ళు వైరస్ బారిన పడ్డారు. ఆ తరువాత రెండు మ్యాచ్‌లు కూడా వాయిదా పడ్డాయి. చివరికి టోర్నమెంట్ మే 5న వాయిదా పడింది. మొత్తం మీద 139 రోజుల తర్వాత, సెప్టెంబర్ 19న, మరోసారి టోర్నమెంట్‌లో మిగిలిన భాగాన్ని యూఏఈలో పూర్తి చేశారు. ఇక ప్రస్తుఐపిఎల్ 2025 గురించి మాట్లాడుకుందాం. టోర్నమెంట్ మార్చి 22న ప్రారంభమైంది. అప్పటి నుంచి గత ఒకటిన్నర నెలల్లో టోర్నమెంట్‌లోని 57 మ్యాచ్‌లు పూర్తయ్యాయి. మే 8న ధర్మశాలలో పంజాబ్ కింగ్స్ వర్సెస్ ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య లీగ్ 58వ మ్యాచ్ జరుగుతుండగా, మ్యాచ్ కేవలం 10.1 ఓవర్ల తర్వాత రద్దు చేశారు. మరుసటి రోజు అంటే ఇప్పుడు 9న, టోర్నమెంట్ ఒక వారం పాటు వాయిదా పడింది. ఇప్పుడు టోర్నమెంట్ ఎప్పుడు తిరిగి ప్రారంభమవుతుందో తెలియాల్సి ఉంది.

## ఇటాలియన్ ఓపెన్‌లో..
# లాజోవిక్‌ను ఓడించిన అల్కరాజ్





**న్యూఢిల్లీ:** ఇటాలియన్ ఓపెన్-2025లో 4సార్లు గ్రాండ్‌స్లామ్ ఛాంపియన్ అయిన కార్లోస్ అల్కరాజ్ సంచలన విజయం సాధించాడు. ఇటలీలోని రోమ్ లోగల ఫోరో ఇటాలికోలో అవుట్‌డోర్ క్లే కోర్ట్‌ల శనివారం జరిగిన ఈ టోర్నమెంట్‌లో సెర్బియా క్వాలిఫైయర్ దుసాన్ లా జోవిక్‌పై 6-3, 6-3 తేడాతో విజయం సాధించాడు.ఇటాలియన్ ఓపెన్‌లో జోకో మొదటి నాలుగు గేమ్‌లను అల్కరాజ్ గెలిచాడు. కానీ మొదటి సెట్‌ను 5-2తో సర్వ్ చేసినప్పుడు తన సర్వీస్‌ను వదులుకున్నాడు. స్పానియార్డ్ తదుపరి గేమ్‌లో వెనక్కి తగ్గాడు. ఫోరో ఇటాలికో వద్ద క్లే కోర్టులో తన వేగాన్ని ప్రదర్శించి డ్రాప్ షాట్‌ను ఢీకొట్టి ఒక కీలక పాయింట్‌పై బ్యాక్‌హ్యాండ్ విజేతను అందించాడు. ఇక ఏప్రిల్‌లో మోంటే కార్లో మాస్టర్స్ గెలిచిన అల్కారాజ్, ఈ సీజన్‌లో క్లే కోర్టులో 10-1తో మెరుగుపడ్డాడు. అతను తదుపరి 31వ సీడ్ అలెక్స్ మిచెల్సెన్ లేదా లాస్లో డిజెరేతో తలపడతాడు. నాలుగు సార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ అయిన అల్కరాజ్, మే 25న ప్రారంభమయ్యే ఫ్రెంచ్ ఓపెన్‌లో తన టైటిల్‌ను కాపాడుకోవడానికి సిద్ధమవుతున్నాడు. కాగా మహిళల టోర్నమెంట్‌లో, అగ్రస్థానంలో ఉన్న అరినా సబలెంకా అనస్తాసియా పొటాపోవాపై 6-2, 6-2 తేడాతో విజయం సాధించి శుభారంభం చేసింది.



## ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్ 2లో
# మధురకు స్వర్ణం

### పురుషుల టీమ్ ఈవెంట్లో భారత్‌కు 3 పతకాలు

**న్యూఢిల్లీ:** ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 2లో మధుర తొలి వ్యక్తిగత స్వర్ణం గెలుచుకోగా, టీమ్ ఈవెంట్లలో భారత్ మూడు పతకాలు సాధించింది. అంతకుముందు, శనివారం ఇక్కడ జరిగిన ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 2లో భారత కాంపౌండ్ ఆర్చర్లు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి, టీమ్ ఈవెంట్లలో స్వర్ణం, రజతం మరియు కాంస్య పతకాలను గెలుచుకున్నారు. అభిషేక్ వర్మ, ఓజాస్ డియోటలే మరియు రిషబ్ యాదవ్‌లతో కూడిన పురుషుల జట్టు ఉత్కంఠభరితమైన ఫైనల్‌లో మెక్సికోను 232-228 తేడాతో ఓడించి స్వర్ణం సాధించడం పతకాల జోరులో ముఖ్యాంశం. మొదటి ఎండ్‌లో దాదాపు 59 పాయింట్లతో భారత్ 2 పాయింట్ల ఆధిక్యాన్ని బలంగా ప్రారంభించింది, మెక్సికో 57 పాయింట్లతో ఆధిక్యంలో ఉంది. రెండవ ఎండ్‌లో మెక్సికో 58 పరుగులతో పోరాడగా, భారతదేశం 56 పరుగులతో మ్యాచ్‌ను 115-115తో సమం చేసింది. మూడో ఎండ్‌లో, భారత్ 58 పరుగులతో మళ్లీ ఆధిక్యంలో ఉంది, మెక్సికో 57 పరుగులు చేసింది, భారత్ జట్టుకు 173-172 స్వల్ప ఆధిక్యాన్ని ఇచ్చింది. చివరి దశలో భారత త్రయం తమ ధైర్యాన్ని నిలుపుకుంది, అద్భుతమైన 59 పరుగులు చేసి స్వర్ణాన్ని కైవసం చేసుకోగా, మెక్సికో కేవలం 56 పరుగులు మాత్రమే చేయగలిగింది. మహిళల కాంపౌండ్ ఫైనల్లో, వెన్నం జ్యోతి సురేఖ, మధుర ధమన్‌గోంకర్, చికిత తనిపర్తి జట్టు 221-234 తేడాతో బలమైన మెక్సికన్ జట్టు చేతిలో ఓడిపోయి రజతం గెలుచుకుంది. ఇక ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 2లో మధుర ధమన్‌గోంకర్ అమెరికాకు చెందిన కార్సన్ క్రాహేపై 139-138 తేడాతో అద్భుతమైన విజయం సాధించింది. తన తొలి వ్యక్తి గత ప్రపంచ కప్ బంగారు పతకాన్ని గెలుచుకుంది. మూడు సంవత్సరాలుగా అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడనందుకు ప్రపంచ ఆర్చరీ ర్యాంకింగ్స్‌లో స్థానం పొందని మధుర, మూడవ ఎండ్‌లో 81-85తో వెనుకబడి ఉంది. కానీ 24 ఏళ్ల ఒత్తిడిలో అద్భుతమైన ప్రదర్శన చేసింది. దాదాపు దోషరహితంగా నాల్గవ ఎండ్‌లో కేవలం ఒక పాయింట్ మాత్రమే కోల్పోయి స్కోరును 110 ఆల్ వద్ద సమం చేసింది. డిసైడర్‌లో, ఆమె రెండు పర్ఫెక్ట్ 10లతో తన ఆధిక్యాన్ని నిలుపుకుంది. ఒక పాయింట్ తేడాతో అధిగమించి ఉత్కంఠభరితమైన ముగింపును సాధించింది. ఈ ఈవెంట్‌లో మధురకు ఇది మూడో పతకం కావడం విశేషం. అంతకుముందు మహిళల టీమ్ ఈవెంట్‌లో రజతం, మరియు అభిషేక్ వర్మతో కలిసి కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కాంస్యం గెలుచుకుంది.

# నిత్యావసరాల కొరత భయం..కేంద్ర స్పష్టత

**న్యూఢిల్లీ, మే 10:** ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా అధిక ప్రభావం పడేది నిత్యావసరాల సరఫరా మీదే. అందుకే పాకిస్థాన్‌తో యుద్ధ పరిస్థితులు తీవ్రమవుతున్న క్రమంలో దేశంలోని పలు ప్రాంతాల్లో ముఖ్యంగా ఉత్తరాధి రాష్ట్రాల్లో నిత్యావసరాల కొతర భయం సామాన్య ప్రజల్లో నెలకొంది. జమ్మూ, జైపూర్, శ్రీనగర్ వంటి కొన్ని ప్రాంతాలలో కొనసాగుతున్న యుద్ధ ప్రయత్నాల కారణంగా కొరత వస్తుందనే భయంతో ప్రజలు వస్తువులను నిల్వ చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టత నిచ్చింది. దేశంలో ఆహారం, ఎరువులు ఇంధనం వంటి అన్ని నిత్యావసర సరుకుల నిల్వలు తగినంత ఉన్నాయని వెల్లడించింది. ధరలపై ఎటువంటి ప్రభావం లేకుండా దేశవ్యాప్తంగా సరఫరా లైన్లు నిరాటంకంగా పనిచేస్తున్నాయని రాష్ట్రాలతో సమావేశం నిర్వహించిన తర్వాత అధికారులు తెలిపారు. రైలు, రోడ్డు, విమాన మార్గాల్లో సరుకుల రవాణాకు ఎలాంటి అంతరాయం లేదని, దేశంలోని దాదాపు 500 మార్కెట్లలో కీలక వస్తువుల ధరల స్థాయిలు స్థిరంగానే ఉన్నాయని ఆందోళన చెందవద్దని ప్రజలను కోరారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ వంటి ఇంధనాలకొరత ఆందోళనలపై ప్రముఖ చమురు సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కూడా తాజాగా స్పందించింది. ఇండియన్ ఆయిల్‌కు దేశ వ్యాప్తంగా ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, తమ సర ఫరా లైన్లు సజావుగా పనిచేస్తున్నాయని, ఎవరూ భయాందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఆహార కొరతకు సంబంధించిన ఫేక్ వార్తలను, అసత్య ప్రచా రాన్ని ఎవరూ నమ్మొద్దని కేంద్ర వినియోగ దారుల వ్యవహారాలు, ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రజలను కోరారు. దేశంలో అవసరానికి మించి ఆహార నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ఎక్స్‌పోస్ట్ ద్వారా ఆయన స్పష్టం చేశారు.



# రెండు బ్యాంకులలకు ఆర్‌బిఐ జరిమానా

**న్యూఢిల్లీ, మే 10:** భారతీయ రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా నిబంధనలు పాటించలేదనే కారణంతో ప్రముఖ బ్యాంకులైన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా(ఎస్‌బిఐ), జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుపై జరిమానా విధించింది. ఆర్థిక క్రమశిక్షణను అమలు చేయడానికి, నిర్దేశించిన మార్గదర్శకాలకు బ్యాంకులు కట్టుబడి ఉండేలా ఈ జరిమానా విధిస్తున్నట్లు తెలిపింది. బ్యాంకుల రుణాలు, అడ్వాన్స్‌లు, అనధికార ఖాతాలు ఓపెన్ చేయడంలో నిబంధనల ఉల్లంఘనలను గుర్తించినట్లు ఆర్‌బిఐ తెలిపింది. దాంతో ఎస్‌బిఐకి రూ.1.72 కోట్ల జరిమానా విధిస్తున్నట్లు పేర్కొంది. జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్, 1949 ప్రకారం నిబంధనలను ఉల్లంఘించినందుకు రూ.కోటి జరిమానా విధిస్తున్నట్లు చెప్పింది. ఈ జరిమానాలు బ్యాంకింగ్ రంగంలో మరింత జవాబుదారీతనాన్ని నిర్ధారించడానికి దిద్దుబాటు చర్యగా పనిచేస్తాయని పేర్కొంది. రెగ్యులేటరీ నిబంధనల అమలు ఆర్థిక సంస్థలపై ఆర్‌బిఐ కఠినమైన పర్యవేక్షణను ప్రతిబింబిస్తుంది. అంతర్గత నియంత్రణలను బలోపేతం చేయడానికి, కస్టమర్ రక్షణ యంత్రాంగాలను మెరుగుపరచడానికి బ్యాంకులను ప్రోత్సహిస్తుంది. ఈ చర్యలు ఇతర బ్యాంకులకు హెచ్చరికగా కూడా పనిచేస్తాయని కొందరు భావిస్తున్నారు. ఆర్‌బిఐ



ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ లావాదేవీల్లో కస్టమర్ ప్రొటెక్షన్‌కు సంబంధించిన అంశాలు, కరెంట్ అకౌంట్ మార్గదర్శకాలకు కట్టుబడి ఉండాలని, వాటిని పాటించడంలో లోపాలను నివారించాలని కోరుతున్నారు.

# సిఐఎల్, ఎఎం గ్రీన్ భాగస్వామ్యం

**ముంబై, మే 10:** దీర్ఘకాలిక పునరుత్పాదక ఇంధన సరఫరా కోసం కోల్ ఇండియా లిమిటెడ్ (సిఐఎల్), ఎఎం గ్రీన్ ఒప్పందం (ఎంఒయు) కుర్చుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం సిఐఎల్ సోలార్, పవన శక్తి ద్వారా ఎఎం గ్రీన్ ఉత్పత్తి చేయబోతున్న గ్రీన్ అమోమనియా సౌకర్యాలకు 4,500 మెగావాట్ల కార్బన్ రహిత శక్తిని సరఫరా చేయనున్నారు. ఈ మేరకు ఇటీవల జరిగిన ఒప్పందంపై సిఐఎల్ జిఎం సుదర్శన్ బోరా, ఎఎం గ్రీన్ బిజిఎస్ డెవలప్‌మెంట్ సీనియన్ వైస్ ప్రెసిడెంట్ శతన్షు అగర్వాల్



ఇరు సంస్థల ఉన్నతాధికారుల సమక్షంలో సంతకాలు చేశారు. దేశవ్యాప్తంగా భారీ పునరుత్పాదక ఇంధన విస్తరణ జరపాలని యోచిస్తున్నారు. అందులో భాగంగా గుజరాత్, రాజస్థాన్‌ల్లో సోలార్ పవర్ కెపాసిటీని 2,500 మెగావాట్ల నుంచి 3వేల మెగావాట్ల వరకు పెంచాలని నిర్ణయించారు. 1500 మెగావాట్ల పవన విద్యుత్ సామర్థ్యాన్ని 2వేల మెగావాట్లకు విస్తరించాలని చూస్తున్నారు. ఇందుకోసం దక్షిణ భారతదేశంలో అనువైన స్థలాలను అన్వేషిస్తున్నారు. ఈ మేరకు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు రూ.25వేల కోట్లు ఖర్చు చేయాలని ప్రతిపాదించారు. ఎఎం గ్రీన్ ఈ పునరుత్పాదక శక్తిని పంప్డ్ హైడ్రో స్టోరేజీతో అనుసంధానిస్తున్నట్లు పేర్కొంది. కంపెనీఉత్పత్తి సౌకర్యాలకు స్థిరమైన గ్రీన్ ఎనర్జీ సరఫరాను ఇది నిర్ధారిస్తుంది. గ్రీన్‌కో గ్రూప్ ప్రమోటర్లు స్థాపించిన ఎఎం గ్రీన్ 2030 నాటికి యేటా 5 మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియాను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ఒక ఎంటిపిఎ గ్రీన్ హైడ్రోజన్‌కు సమానం. ఇది నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌లక్ష్యలో 20శాతంగా ఉండడం విశేషం. ఈ సందర్భంగా సిఐఎల్ సుస్థిరమైన ఎనర్జీని సరఫరా చేసేందుకు కట్టుబడి ఉందని సంస్థ చైర్మన్ పిఎం ప్రసాద్ తెలిపారు. భారత దేశ ఇంధన తయారీలో బొగ్గు కీలక భాగంగా ఉన్నప్పటికీ, సిఐఎల్ గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఈ మేరకు కంపెనీ చురుకుగా పనిచేస్తోందని పేర్కొన్నారు. గ్రీన్‌కో అండ్ ఎఎం గ్రీన్ వ్యవస్థాపకులు అనిల్ చలమలశెట్టి ఈ ప్రాజెక్టుపై విశ్వాసం వ్యక్తం చేస్తూ గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, ఇతర గ్రీన్ మాలిక్యూల్స్ తయారీలో గణనీయంగా ఖర్చు తగ్గించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

# వాట్సప్ బాట్‌లో ప్రీమియం చెల్లింపు: ఎల్ఐసి


**ముంబై, మే 10:** పాలసీ దారులు సులభంగా ప్రీమియం చెల్లించేందుకు వీలుగా సరికొత్త సదుపాయాన్ని తీసుకొచ్చినట్లు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) తెలిపింది. ఇందుకోసం ప్రత్యేకంగా వాట్సప్ నంబరు 8976862090 కేటాయించినట్లు పేర్కొంది. ఎల్ఐసీ పోర్టల్‌లో నమోదు చేసుకున్న పాలసీ దారులు, ఈ నంబరుకు సందేశం పంపించడం ద్వారా పాలసీ దారులు ఎక్కడి నుంచైనా, ఎప్పుడైనా ప్రీమియం చెల్లించేందుకు ఇది సౌకర్యంగా ఉంటుదన్నారు. దాదాపు 2.2 కోట్ల మంది ఎల్ఐసీ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. ఆన్‌లైన్ సేవల కోసం రోజుకు 3 లక్షల మందికి పైగా పాలసీదారులు పోర్టల్‌ను సందర్శిస్తుంటారని తెలిపారు. ఎల్ఐసీ కేటాయించిన వాట్సప్ నంబరుకు హాయ్ అని సందేశం పంపించాలి. ఆ తర్వాత తెరపై పలు రకాల ఆప్షన్లు కనిపిస్తాయి. ఇందులో మీకు కావాల్సింది ఎంపిక చేసుకుని, తదుపరి సూచనల ప్రకారం కొనసాగొచ్చు.

తమ పాలసీలకు చెల్లించాల్సిన ప్రీమియం వివరాలు తెలుసుకునేందుకు వీలవుతుంది. నేరుగా యూపీఐ, నెట్ బ్యాంకింగ్, కార్డుల ద్వారా వాట్సప్ బాట్‌లోనే చెల్లింపులు పూర్తి చేయొచ్చు. పాలసీలకు చెల్లించాల్సిన ప్రీమియం నుంచి, చెల్లించిన తర్వాత రశీదు కూడా ఈ వాట్సప్ బాట్‌లోనే లభిస్తుందని ఎల్ఐసీ సీఈఓ, ఎండీ సిద్ధార్థ మొహంతి తెలిపారు.

# వాణిజ్యం

# భారత్-పాక్ ఉద్రికత్తలు..ఐటి ఉద్యోగులకు వర్క్‌ఫ్రం హోం

**ఇస్లామాబాద్, మే 10:** పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్‌చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్‌తో పాకిస్థాన్ కయ్యానికి కాలు దువ్వింది. సరిహద్దు ప్రాంతాల్లో దాడులు చేస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. దీంతో ప్రస్తుతం రెండు దేశాల మధ్య ఉద్రికత్త పరిస్థితులు తారాస్థాయికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో దేశీయ ఐటి సంస్థలు మళ్లీ వర్క్ ఫ్రమ్ హోమ్ బాటపట్టాయి. ఉద్యోగుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఢిల్లీ, ఛండీగఢ్, జైపూర్, అహ్మదాబాద్, నోయిడా, గురుగావ్ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు ఇంటి నుంచి పనిచేసే వెసులుబాటు కల్పించాయి. టెక్‌మహీంద్రా, హెచ్‌సిఎల్ టెక్నాలజీ, కెపిఎంజి, డెలాయిట్ సహా ఇతర ఐటి, కన్సల్టింగ్ సంస్థలు ఈ మేరకు వర్క్ ఫ్రమ్‌హోమ్ సదుపాయం కల్పించాయి. అలాగే అత్యవసరం కాని ప్రయాణాలపై విరమించుకోవాలని, సరిహద్దు రాష్ట్రాల్లోని ఉద్యోగులను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాని సూచిస్తున్నాయి. పరిస్థితులు చక్కబడే వరకు జాగ్రత్తగా ఉండాలని తెలిపాయి. అంతే కాకుండా ప్రస్తుత దేశ పరిస్థితులపై సోషల్ మీడియా కామెంట్లు, చేయొద్దనీ, క్లైయింట్స్ సంభాషణల్లోనూ ప్రస్తావించొద్దని తమ ఉద్యోగు లను పలు సంస్థలు కోరాయి.




కాగాభారత్-పాక్ యుద్ధ నేపథ్యంలో పంజాబ్, హర్యాణా, రాజస్థాన్, ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, బీహార్‌లలో ఇప్పటికే ఎమర్జెన్సీ ప్రోటోకాల్ విధించిన విషయం విదితమే.

# ఇస్లామాబాద్‌లో పెట్రోల్ బంకులు క్లోజ్..

**న్యూఢిల్లీ, మే 10:** భారత వైమానిక దాడులతో ఉక్కిరిబిక్కిరి అవుతోన్న పాక్‌కు మరో సంక్షోభం వచ్చి పడింది. భారత్ దాడితో కుదేలవుతున్న పాక్‌ను ఇప్పుడు చమురు కొరతవేధిస్తోంది. ఇస్లామాబాద్ రాజధాని టెరిటరీ అడ్మినిస్ట్రేషన్ రాజధాని నగరంలోని అన్ని పెట్రోల్, డీజిల్ ఫిల్లింగ్ స్టేషన్లను రాబోయే 48 గంటల పాటు పూర్తిగా మూసివేయాలని తక్షణ ఉత్తర్వు జారీ చేసింది. శనివారం ఉదయం 6 గంటల నుంచి 48 గంటల పాటు ఇస్లామాబాద్‌లోని అన్ని పెట్రోల్ బంకులను మూసి వేస్తున్నట్టుగా అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. అయితే, పెట్రోల్ బంకులు మూసి వేయడానికి గల కారణాలు ఏంటనే విషయంపై స్పష్టమైన వివరాలు మాత్రం తెలిసి రాలేదు. కాగా, పాక్‌లోని 4 ఎయిర్‌బేస్‌లపై భారత్ దాడి చేసింది. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రతర మయ్యాయి.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.